ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
సోమవారం 19, ఫిబ్రవరి 2024

12 ఎయిడెడ్ స్కూళ్ల మూసివేత!

ఇప్పటికే ఒక హైస్కూల్‌కు తాళం

మరో 11 పాఠశాలలకు నోటీసులు

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 18 : జిల్లాలో 12 ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఒక ఎయిడెడ్ హైస్కూల్‌కు తాళం పడింది. మరో 11 పాఠశాలలను ఎందుకు మూసి వేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని యాజమాన్యాలకు డీఈవో నోటీసులు ఇచ్చారు. జిల్లాలో నాలుగు హైస్కూళ్లు, ఏడు ప్రాథమిక పాఠశాలలు ఆ జాబితాలో ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. 2022-23 విద్యా సంవత్సరంలో విద్యార్థులు లేని (జీరో ఎన్‌రోల్‌మెంట్), 10 మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను గుర్తించాలన్నారు. వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకొని మూసివేతకు చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పాఠశాల విద్య ఆర్‌జేడీ, డీఈవోలను ఆదేశించారు. జిల్లాలో గత విద్యా సంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్, పది మంది లోపు విద్యార్థులు ఉన్న 12 పాఠశాలను గుర్తించారు. వీటిల్లో తొమ్మిది చోట్ల జీరో ఎన్‌రోల్‌మెంట్, ఒక్క పాఠశాలలో ఒకరు, మరో స్కూల్‌లో ఎనిమిది మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఒంగోలు స్టేషన్ రోడ్డులోని సమావేశం హైస్కూల్‌లో పిల్లలు ఒక్కరు కూడా లేకపోవడంతో దాన్ని ఇప్పటికే మూసివేశారు. కొమరోలు మండలం గోవరపల్లిలోని ఏబీఎం పాఠశాలలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్నారు. మార్కాపురం పదో వార్డులోని శారదా ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నారు. ఒంగోలు గద్దలగుంటలోని హెచ్‌పి ఎయిడెడ్ పాఠశాల, కొమరోలు మండలం నల్లగుంట ఎయిడెడ్ స్కూలు, గిద్దలూరు ఏపీజీ ఎలిమెంటరీ స్కూలు, కనిగిరిలోని ఏబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, దొనకొండ మండలం ఒబ్బాపురం ఎయిడెడ్ పాఠశాల, వైపాలెం డీఎంఎస్ బీసీ బాలికల హైస్కూలు, గిద్దలూరు శ్రీవివేకానంద హైస్కూలు, కొమరోలు మండలం నల్లగుంట్ల ఎయిడెడ్ హైస్కూలు, ఒంగోలు జీవీఎస్ హైస్కూలులో ఒక్క విద్యార్థి కూడా లేరు. దీంతో ఈ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పటికే అవసరం ఉన్న ఇతర చోట్ల సర్దుబాటు చేసి మాతృపాఠశాలల నుంచి జీతాలు చెల్లిస్తున్నారు. ఇకపై ఇవి పూర్తిగా మూతపడనున్నాయి.

బదిలీల బంతాట

ఇష్టానుసారం అధికారుల మార్పు

నెలలో కొండపి నియోజకవర్గానికి ముగ్గురు ఈఆర్వోలు

సింగరాయకొండకు మూడోసారి తహసీల్దార్ రాక

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమంటున్న ఎమ్మెల్యే స్వామి

కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి

కొండపి, ఫిబ్రవరి 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు బంతాటగా మారాయి. కొండపి నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా మంత్రి ఆదిమూలపు సురేష్ రావడంతో పూర్తిగా అధికారుల నియామకం ఆయన కనుసన్నల్లో జరుగుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. ఎలక్షన్ విధుల్లో పక్షపాతం వహిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని ఎన్నికల సంఘం అధికారులు హెచ్చరిస్తున్నా అధికారపార్టీ నేతలు పట్టించుకోవడం లేదు. కిందిస్థాయిలో తమకు కావాల్సిన అధికారుల నియామకాలు ఇష్టానుసారం చేయించుకుంటూనే ఉన్నారు. నియోజకవర్గంలో తమకు అనుకూలంగా ఉండరని భావిస్తున్న తహసీలార్లను, ఈఆర్వోలను పదేపదే మారుస్తున్నారు.

నెలలోపే ముగ్గురు ఈఆర్వోలు

అధికారులు గత నెల 22న ఓటర్ల తుది జాబితాలను ప్రచురించారు. మరుసటి రోజు అప్పటి ఈఆర్వో నారదముని కొండపిలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించిన అప్పటి ఈఆర్వో, తహసీల్దార్లను పార్టీల నాయకులు ప్రశంసించారు. ఆ తర్వాత ఎన్నికల నిబంధనల మేరకు నారదముని జిల్లా నుంచి బదిలీ అయ్యారు. అనంతరం 15 రోజులకు కొండపి ఈఆర్వోగా ఝాన్సీలక్ష్మి వచ్చారు. ఆమె ఒకసారి తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. వారంలోనే ఆమె మారిపోయారు. ఈనెల 15న రాజకుమారి ఈఆర్వోగా వచ్చారు. కొండపిలో తహసీల్దార్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె నాయకులు లేవనెత్తిన అంశాలపై ఈసారి సమావేశంలో సమాధానాలు చెబుతానని, మినిట్స్ బుక్‌లో రాయించారు. తిరిగి ఈఆర్వోగా ఆమె స్థానంలో ఎ.కుమార్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వచ్చాయి. దీంతో రాజకీయ ఒత్తిళ్లతో బదిలీలు పదేపదే జరుగుతున్నాయని అటు ప్రజలు, ఇటు ప్రతిపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు.

సింగరాయకొండ తహసీల్దార్ కూడా..

సింగరాయకొండ తహసీల్దార్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఈనెల 6న అక్కడ తహసీల్దార్‌గా శంఖల రమణయ్యను నియమించారు. వెంటనే 7వ తేదీన ఆయన్ను మార్చి జె.ప్రసాదరావుకు పోస్టింగ్ ఇచ్చారు. తిరిగి గుంటూరు జిల్లా నుంచి ఎం.భవానీశంకర్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం కొనసాగుతున్నారు. తహసీల్దార్లను కూడా ఇలాగే పదేపదే మార్చడంలో మంత్రి పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం సీరియస్‌గా చెబుతున్నా పదేపదే తహసీల్దార్‌లు, ఈఆర్వోలను మారుస్తుండంతో నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ ఒత్తిళ్లతోనే : ఎమ్మెల్యే స్వామి

కొండపి నియోజకవర్గ ఈఆర్వోలుగా నెల వ్యవధిలో ముగ్గురిని మార్చడం, సింగరాయకొండ తహసీల్దార్లను పదేపదే బదిలీ చేయడం వెనుక మంత్రి సురేష్, వైసీపీ నేతల ప్రమేయం ఉందని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మంత్రి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు అనుకూలమైన అధికారులను తెచ్చుకొంటున్నారన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అధికారులను పదేపదే బదిలీ చేయడంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశానని ఆయన చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అరాచక సీఎంను సాగనంపాలి

యరజర్లలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి ఆనంద్‌బాబు



ఎన్టీఆర్ విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న ఆనంద్‌బాబు, దామచర్ల

ఒంగోలు (రూరల్), ఫిబ్రవరి 18 : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని సాగనంపాలని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ఒంగోలు మండలం యరజర్లలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం అయ్యాయని ధ్వజమెత్తారు. అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఎస్సీల కోసం గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను పూర్తిగా ఎత్తివేసి వారిని కడుపేదలుగా చేసిన ఘనత జగన్‌రెడ్డిదని దుయ్యబట్టారు. పారిశ్రామిక వేత్తలను కూడా దోచుకుతింటుండటంతో పరిశ్రమలు పెట్టేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేన కూటమికి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒంగోలు నియోజకవర్గంలో అభివృద్ధి అనేది ఎక్కడా కనిపించడంలేదని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు యరజర్ల కొండ మట్టిని దోచుకుతిన్నారని ధ్వజమెత్తారు. పేకాట, క్యాసినో ఆడేవాళ్లు ఎన్నికలకు ఆరు నెలల ముందు వచ్చి మిమ్మల్ని మభ్యపెట్టాలని చూస్తారని, అలాంటి వారిపట్ల అప్రత్తంగా ఉండాలని సూచించారు. అవినీతిపరులను ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే నియోజకవర్గంలో అభివృద్ధి అన్నది ఉండదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నలమోతు బాలగంగాధర్, నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాసరావు, కఠారి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుండపనేని శ్రీనివాసరావు, మక్కెన శ్రీనివాసరావు, కంకణాల తిరుమల, కంకణాల శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, రావిపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో ఎక్కడ చూసినా తప్పులే కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం వైసీపీ ప్రభుత్వం వేస్తున్న ఎత్తుగడలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు ఎన్నిసార్లు సరిచేసినా, మళ్లీ అవే అవకతవకలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పూర్తి సమాచారం సేకరించడం లేదని ఓటర్లు విమర్శిస్తున్నారు. ఎన్నికల కమిషన్ మాత్రం ఇదే చివరి జాబితా.. ఏమైనా తేడాలు ఉంటే సరి చేసుకోవాలని చెబుతోంది. అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు రెండేసి చోట్ల ఓటుహక్కు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో నాయకులు బోగస్ ఓట్లను చేర్పించినప్పటికీ బీఎల్వోలు ఎటువంటి విచారణ చేయకుండా జాబితాలో అలాగే ఉంచుతుండటంపై ప్రతిపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

దండిగా దొంగోట్లు!

రోజురోజుకూ వెలుగుచూస్తున్న బోగస్‌లు

- వెతికే కొద్దీ బయటపడుతున్న వైనం
- అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు..
- అవగాహన లేని బీఎల్వోలు
- చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్న సిబ్బంది
- ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రతిపక్షాలు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 18 : ఓటమి తప్పదన్న భయంతో వైసీపీ దొంగ ఓట్లు చేర్పించే పనిలో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గతేడాది నుంచి ప్రారంభమైన ఓటరు దరఖాస్తుల పరిశీలనలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. 2023 ఆగస్టు నుంచి ఓట్లకు సంబంధించి నమోదులు, చేర్పులు, మార్పులు, తొలగింపులు, డబుల్ ఎంట్రీలు ఇలా వివిధ రకాల ప్రక్రియ నడుస్తోంది. డోర్ టూ డోర్ పరిశీలన జరుగుతోంది. గతేడాది ఆగస్టులో డ్రాఫ్ట్ జాబితా రాగా, అక్టోబరు నుంచి మదర్ రోల్ జాబితా సిద్ధమైంది. అయితే ఓటర్ల జాబితాపై అధికారులు పరిశీలన చేస్తుండగా తప్పులు కోకొల్లలుగా బయటపడుతున్నాయి. ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే బీఎల్వోలలో కొందరికి అవగాహన లోపం, మరోవైపు అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో దొంగ ఓట్లు చేర్పించినట్లు తెలుస్తోంది.

పరిశీలనలో బయటపడుతున్న అక్రమాలు

ఏడాదిగా పరిశీలన చేస్తున్నప్పటికీ ఇంకా ఓటర్ల జాబితాల్లో తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి. బీఎల్వోల్లో అవగాహన లోపం, అధికారులపై వైసీపీ నేతల ఒత్తిడి కారణంగా డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు జాబితాల్లో అలాగే ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన ఓటరు తుది జాబితాలోనూ అవకతవకలు కోకొల్లుగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా డబుల్ ఎంట్రీ ఓట్లు, పదిహేను వందల నుంచి రెండు వేల వరకు చనిపోయిన వారి ఓట్లు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అయితే వాటిని తొలగించాల్సి ఉంది. ఓటరు జాబితాలో వెలుగుచూస్తున్న అవకతవకలపై ప్రతిపక్షాలు పదేపదే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సమాచారం.

అధికారుల ఇష్టారాజ్యం

వైసీపీ నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో కొందరు బీఎల్వోలు, బీఎల్‌ఏలు చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు తెలుస్తోంది. ఫీల్డ్ వర్క్ పేరుతో ఉండే బీఎల్వోలు జిల్లాలో 2,500 మంది వరకు ఉన్నారు. అయితే రోజులో కనీసం 70 నుంచి 100మంది వరకు తమ పైఅధికారులకు చెప్పకుండానే విధులకు రావడం లేదని సమాచారం. అంతేకాకుండా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫాం 6, 7, 8లను బీఎల్వోలు నేరుగా తీసుకుని పరిష్కరించాలి. ప్రజల నుంచి వచ్చే ఓటరుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సి ఉంది. అవేమీ చేయకుండా ఆన్‌లైన్‌లో పరిష్కరించుకోవాలని చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎల్వోల నిర్లక్ష్య సమాధానంపై ప్రజలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.



తప్పుల తడకగా ఓటర్ల జాబితా

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి ఒకటో బూత్‌లో మొత్తం 929 ఓటర్లు ఉన్నారు. ఈ బూత్ పరిధిలో ఎనిమిది మంది 0 డోర్ నంబర్‌తో ఉన్నారు. పొందుగుల శివమల్లారెడ్డి, పాతర్ల చంద్రకళ పేర్లు 0 డోర్ నెంబర్లతో కనిపిస్తున్నాయి. 1 డోర్ నెంబర్‌తో బూల కొండేటి, చిన్న నాగమ్మ మేకల, ప్రవీణ్ మేకల, భవాని పాతర్ల తదితరులు ఉన్నారు. గ్రామంలో 10మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. గ్రామానికి చెందిన చక్కిలం సుబ్బరామయ్య మృతిచెంది ఎనిమిది నెలలు దాటినప్పటికీ, ప్రస్తుత జాబితాలో ఓటుహక్కును కల్పించారు. మండలంలోని రాయవరం 108వ పోలింగ్ కేంద్రంలో 20మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్లు గల్లంతయ్యాయి. గత జాబితాలో వీరికి ఓటు హక్కు ఉన్నా, ప్రస్తుత జాబితాలో డిలీట్‌లో ఉంచారు. తమకు తెలియకుండా తమ ఓట్లు తొలగించటం ఏమిటని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

లక్షల్లో దరఖాస్తులు

అందిన సమాచారం మేరకు గతేడాది నుంచి ఇప్పటి వరకు 5,42,746 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో సుమారు 5.34లక్షల వరకు పరిశీలన చేసినట్లు సమాచారం. వాటిలో వెయ్యికిపైగా దొంగ ఓట్లు, 1,500లకుపైగా చనిపోయిన వారి పేరుతో ఓట్లు ఉండగా.. అసలు అడ్రస్, ఊరూ, పేరు లేని ఓట్లు వేలల్లోనే ఉన్నాయి. ఇంకా 2,183 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరలోనే ఉండగా, పరిశీనలో వెలుగుచూస్తున్న అక్రమాలపై అధికారులు ఎప్పుడు చర్యలు తీసుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

కొత్త జాబితాలోనూ దొంగ ఓట్లు

తెలంగాణకు చెందిన ముగ్గురి పేర్లు

పీసీపల్లి : మండలంలో వెతికేకొద్దీ దొంగ ఓట్లు బయటపడుతున్నాయి. కొత్త ఓటర్ల జాబితాలోనూ పొరుగు రాష్ట్రం తెలంగాణకు చెందిన వారి పేర్లు ఉన్నాయి. స్థానికులు కాకపోయినప్పటికీ మురుగుమ్మిలోని డోర్ నెంబర్లతో ఓట్లు చేర్పించారు. కొంతమంది వైసీపీ కార్యకర్తలు తెలంగాణలో ఉన్న తమ బంధువుల పేర్లను ఇక్కడి అడ్రస్‌లతో నమోదు చేయించారని టీడీపీ గ్రామ నాయకులు ఆరోపిస్తున్నారు. దొంగ ఓట్ల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. టీడీపీ నాయకులు తెలిపిన వివరాల మేరకు.. మురుగుమ్మిలోని 216 నెంబరు పోలింగ్ కేంద్రం జాబితాలో వరుస సంఖ్య 391లో ఎక్స్‌ఎంహెచ్ 2061034 ఓటర్ ఐడీతో నవీన రామారం భర్త దేవేంద్రరెడ్డి పేరు ఉంది. ఈమె తెలంగాణ వ్యక్తిగా గ్రామస్థులు గుర్తించారు. అదే బూత్‌లో వరుస నెంబరు 395లో ఎక్స్‌ఎంహెచ్ 2060911 ఐడీతో దేవేంద్రరెడ్డి రామారం తండ్రి రామిరెడ్డి పేరు నమోదైంది. ఇతను స్థానికుడు కాదని తెలంగాణ వాసి అని టీడీపీ నాయకులు గుర్తించారు. అదే బూత్‌లో వరుస నెంబరు 403లో ఎక్స్‌ఎంహెచ్ 2060929 ఐడీతో పద్మ వీరెడ్డి భర్త పాండురంగారెడ్డి పేరున మహిళ ఓటు కలిగి ఉంది. ఈమె కూడా స్థానికురాలు కాదని తెలంగాణకు చెందినవారని టీడీపీ నేతలు నిర్ధారించుకున్నారు. ఈ ముగ్గురు గ్రామంలోని వైసీపీ కార్యకర్తకు బంధువులని చెప్తున్నారు. అందువల్లనే ఇక్కడ దొంగ ఓటర్లుగా చేర్పించారని ఆరోపిస్తున్నారు. వెంటనే ఆ ఓట్లను తొలగించాలని ఆ బూత్ ఓటర్లు, టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అదే బూత్‌లో సీరియల్ నెంబర్ 202లో స్థానికుడైన వైసీపీ సానుభూతిపరుడు ప్రగడ పెదపుల్లయ్యకు ఓటు ఉండగా, 985 నెంబర్‌తో కూడా ఆయన పేరుతో మరో ఓటు కనిపిస్తోంది.



మురుగుమ్మి ఓటర్ల జాబితాలో గుర్తించిన నకిలీ ఓట్లు

క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశం!

జిల్లాలో దొంగ ఓట్ల నమోదుపై ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ దినేష్‌కుమార్ సీరియస్ అయినట్లు సమాచారం. బాధ్యులపై క్రిమినల్ చర్యలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఒకే డోర్ నంబరుపై వందల సంఖ్యలో దొంగ ఓట్లు. డబుల్ ఎంట్రీలు, అడ్రస్ లేకుండా ఓట్లు నమోదు తదితర అంశాలపై కలెక్టర్ సీరియస్‌గా దృష్టి సారించారు. అక్రమాలకు పాల్పడిన బీఎల్‌వోలు, బీఎల్‌ఏలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం.



కింకర్తవ్యం!

- తొందరెందుకంటున్న మహీధర్‌రెడ్డి
- ఆమంచికి అన్ని దారులు మూసుకుపోయినట్లే

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీకి చెందిన కందుకూరు శాసనసభ్యుడు మహీధర్‌రెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై ఆ ఇద్దరు నాయకులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. మహీధర్‌రెడ్డి ఇంటికి శనివారం ఉదయం నుంచి పెద్దసంఖ్యలో అనుచరులు వచ్చి రకరకాల అభిప్రాయాలు చెబుతూ ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు ఆమంచి కృష్ణమోహన్‌ను కూడా ముఖ్యఅనుచరులు కలుస్తున్నారు. వారిద్దరూ రాజకీయ భవితవ్యంపై ఇప్పటి వరకు స్పష్టమైన నిర్ణయానికి రానప్పటికీ వ్యూహాత్మకంగా అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది. మానుగుంట, ఆమంచిలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఊహించని షాక్ ఇచ్చిన విషయం విదితమే. కందుకూరు నియోజకవర్గంలో మహీధర్‌రెడ్డి ఇప్పటి వరకూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తండ్రి మూడుసార్లు విజయం సాధించారు. ఇప్పటికీ బలమైన వర్గం ఉన్న ఆయన్ను జగన్ ఈసారి కూడా కొనసాగిస్తారని అంతా భావించారు. అయితే అనూహ్యంగా మహీధర్‌ను తప్పించడమే కాకుండా ఆ స్థానంలో మహిళను అందునా ఆయన సిఫార్సు లేని వారిని రంగంలోకి తెచ్చారు. ఇక ఆమంచి కృష్ణమోహన్‌ను ముఖ్యమంత్రి ఏరికోరి పార్టీలోకి తీసుకున్నారు. జగన్ ఓదార్పు యాత్ర సమయంలో చీరాల ఎమ్మెల్యేగా ఉన్న ఆమంచి నియోజకవర్గంలో వైఎస్సార్ విగ్రహాల ఏర్పాట్లను అడ్డుకున్నారు. అయినప్పటికీ 2019లో పిలిచి మరీ ఆయనకు వైసీపీ చీరాల టికెట్ ఇచ్చారు. ఓడిపోయిన తర్వాత స్థానికులు వద్దన్నా పర్చూరు ఇన్‌చార్జిగా నియమించారు. ఏడాది తిరక్కముందే ఆమంచిని దూరం పెట్టడం ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన్ను పర్చూరు నుంచి తప్పించి కొత్త వారిని రంగంలోకి దించారు. ఆమంచి అడిగిన చీరాల నుంచి ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్‌కు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వేచి చూడండి

కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని శనివారం ఆయన స్వగ్రామమైన మాచవరంలో ముఖ్య అనుచరులందరూ వచ్చి కలిశారు. అందరితో ఆయన ఓపిగ్గా మాట్లాడారు. 'ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. నామినేషన్లలోపు ఏమైనా జరగొచ్చు. నామినేషన్ల చివరి రోజు కూడా మార్పులు చోటుచేసుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి' అని తనను కలిసిన వారితో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గతంలో ఆయన టీడీపీలోకి వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారం జరిగింది. వైసీపీలో కూడా కొత్త ఇన్‌చార్జిల పట్ల నియోజకవర్గాల్లో సానుకూలత రాకపోతే మార్పులు చేస్తున్నట్లే, చివర్లో వైసీపీ టికెట్ తిరిగి మహీధర్‌కే రావచ్చని కొందరు, టీడీపీలోకి వెళ్లవచ్చని మరికొందరు ఆయన మాటలను బట్టి అభిప్రాయపడుతున్నారు. ఈసారి పోటీలో ఉండకపోవచ్చని కూడా ఇంకొందరు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఏదో రూపంలో ఆయన ఈ పర్యాయం ఎన్నికల రంగంలో ఉండే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీలో ఉంటారా? స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తారా?

చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌పై శనివారం ఇంకొల్లులో జరిగిన సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్రమైన విమర్శలు చేశారు. ఆయన మాటల ద్వారా ఆమంచికి ఆ పార్టీలో అవకాశం లేదని చెప్పకనే చెప్పారు. జనసేన వైపు నుంచి కూడా ఆయన ముందుకు వచ్చే అవకాశాలు ఏమాత్రం కనిపించడం లేదు. ఇకపోతే ప్రధాన పార్టీల్లో మిగిలింది బీజేపీ, కాంగ్రెస్. టీడీపీతో బీజేపీ జతకడుతున్నందున ఆవైపు నుంచి అవకాశాలు తక్కువే. కాంగ్రెస్ పక్షాన పోటీ వైపు ఆమంచి అడుగులు వేయకపోవచ్చు. ఈనేపథ్యంలో శనివారం పందిళ్లపల్లిలో ఆయన్ను పర్చూరు నియోజకవర్గం వారు కలిస్తే పార్టీ నిర్ణయాన్ని గౌరవిద్దాం అన్న చందంగా మాట్లాడినట్లు చెబుతున్నారు. అదేసమయంలో చీరాల నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల వారీ ఉన్న తన అంతరంగీకులతో విడివిడిగా మాట్లాడుతున్నారు. దీంతో ఆయన 2014 మాదిరిగానే చీరాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వస్తారా? వైసీపీలోనే ఉంటూ ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉంటారా? అన్నది తేలాల్సి ఉంది



ఇప్పటికే కొన్ని ఇళ్లు పూర్తి.. పనులు ప్రారంభించిన మరికొందరు

సెంటు రూ.లక్షకు విక్రయిస్తున్న అక్రమార్కులు

బండిదారిలో అక్రమ నిర్మాణాలు

రూ.10 కోట్ల ఆస్తి స్వాహా అవుతున్నా పట్టించుకోని అధికారులు

అధికారపార్టీ నాయకుల అండతో యథేచ్ఛగా అమ్మకం



బండిదారి భూమిలో నిర్మించిన గృహాలు

దర్శి, ఫిబ్రవరి 18 : దర్శి - కురిచేడు రోడ్డులోని ఎంతో విలువైన బండిదారిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కొంతమంది ఇప్పటికే గృహాలను నిర్మించారు. మరికొందరు పనులు మొదలుపెట్టారు. అధికార పార్టీ నాయకుల అండతో కొంతమంది అక్రమార్కులు తాజాగా సెంటు లక్షన్నర చొప్పున అమాయకులకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుందని ఇళ్లు నిర్మించుకోవచ్చనే ఆశతో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే బండిదారి భూమి స్వాహా అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

దర్శి రెవెన్యూ పరిధిలోని 247, 248, 266 సర్వే నెంబర్లలో సుమారు 10 ఎకరాల బండిదారి భూమి ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పట్టా భూమి సెంటు రూ.3లక్షలకు పైగా ధర పలుకుతోంది. డీకే భూములను కూడా సెంటు లక్షన్నర రూపాయల చొప్పున అక్కడ విక్రయించారు. గతంలో ఒక కళాశాల యాజమాన్యం ఎకరానికి పైగా బండిదారిని ఆక్రమించుకొని కళాశాలలో కలుపుకొని గోడ నిర్మించింది. చుట్టు పక్కల ఉన్న రైతులు మరింత భూమి తమ పొలాల్లో కలుపుకున్నారు. ప్రస్తుతం ఐదు ఎకరాలు మాత్రమే ఖాళీగా కనిపిస్తోంది. ఆరు నెలల క్రితం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు బండిదారి భూమి కొలిచి ఆక్రమణలు గుర్తించి తొలగించేందుకు మార్కింగ్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో కాని ఆక్రమణలను తొలగించలేదు. ప్రస్తుతం ఆ మార్కింగ్ గుర్తులు లేకుండా చేశారు. బండిదారిలో కొంత భూమిని ఆక్రమించి మట్టి తోలి చదును చేసి అమ్మకానికి పెట్టారు. గతంలో కొనుగోలు చేసిన కొంత మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారు. వారిని చూసి కొందరు అమాయకులు ఖాళీగా ఉన్న భూమిని తీసుకుంటున్నారు. కొందరు ఆక్రమార్కులు తమ సొంత భూమిలా బండిదారిలో మట్టితోలి చదును చేసి విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండిదారి పూర్తిగా ఆక్రమణలకు గురయ్యే పరిస్థితి నెలకొనడంతో అక్కడ పొలాలు ఉన్న రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ మార్కింగ్ వేసి వదిలేశారని వాపోతున్నారు. తాజాగా జరుగుతున్న పరిణామాలను మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రైతులు భావిస్తున్నారు.

బాబు సీఎం అయితేనే

రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



కరపత్రాన్ని అందజేస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, ఫిబ్రవరి18 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే ఆంధ్రప్రదేశ్‌కు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి పట్టణంలో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ ఇంటింటా తిరుగుతూ టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశా రు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, శివపార్వతి, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంగారి పట్టపుపాలెంలో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామ పంచాయతీలోని చిన్నంగారిపట్టపుపాలెంలో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలోని శ్రీరాముడి దేవాలయంలో పూజలు చేశారు. మేకలసామయ్య పట్టపుపాలెంలో చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముప్పవరపు వీరయ్యచౌదరి, అడకా స్వాములు, తేళ్ల మనోజ్‌కుమార్, మద్దినేని హరిబాబు, చాట్ల నారాయణ, కుక్కల నాగార్జునరెడ్డి, వి.వి జయభాస్కర్, మేకల ఏసురత్నం, చిన్నంగారి శ్రీను, కొన్నపూడి గోపి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా



రౌడీషీటర్‌ను హెచ్చరిస్తున్న సీఐ, ఎస్సై

టంగుటూరు, ఫిబ్రవరి 18 : రానున్న ఎన్నికల్లో మీ కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండలంలోని రౌడీ షీటర్ల ఇళ్లకు వెళ్లి పోలీసులు వారికి హెచ్చరికలు జారీ చేశారు. సింగరాయకొండ సీఐ రంగనాథ్, ఎస్సై నాగేశ్వరరావు తన సిబ్బందిని వెంటబెట్టుకొని వరుసగా రెండు రోజులు శని, ఆదివారాల్లో రౌడీషీటర్ల గృహాలను సందర్శించారు. ముందుగా వీరి గురించి గ్రామ సచివాలయ పోలీసులు, పోలీస్ ఇన్‌ఫార్మర్లు, గ్రామ పెద్దలతో మాట్లాడారు. మండలంలో మొత్తం 80 మంది అనుమానాస్పద వ్యక్తులుండగా, వీరిలో రౌడీషీటర్లు 36 మంది, ఇద్దరు కేడీలు, మరో ఇద్దరు డీసీలున్నారు. మిగిలిన వారంతా రౌడీ షీటర్లేనని ఎస్సై చెప్పారు.

విద్యార్థినికి బహుమతి ప్రదానం



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ఓంఅశ్విని

టంగుటూరు, ఫిబ్రవరి 18 : టంగుటూరు ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన చదవడం-నాకిష్టం కార్యక్రమంలో హిందీ పద్యాలు అప్పజెప్పిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 6వ తరగతి విద్యార్థిని ఓంఅశ్వినికి గ్రంథాలయ నిర్వాహకులు బహుమతి ప్రదానం చేశారు. పలువురు విద్యార్థులు తెలుగు, హిందీ పద్యాలు చదవడంలో పోటీపడ్డారు. గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18: ఒంగోలులోని బీవీ.సుబ్బయ్య హైస్కూలు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక మంగమూరురోడ్డులోని అతిథిఫంక్షన్ హాలులో జరిగింది. సుమారు 50 మంది పూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. విద్యావ్యవస్థలో అరుదైన వ్యక్తిగా గుర్తింపు పొందిన బీవీ.సుబ్బయ్యను స్మరించుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు అరికట్ల శ్రీనివాసరావు, ఎం.హరిబాబు, వాడా మనోహర్‌రెడ్డి, జి.సుబ్బారావు, కృష్ణమూర్తి, ఈదర విష్ణువర్ధన్, పుచ్చకాలయ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు నల్లూరి కృష్ణారావు, కేవీ.శేషయ్య, ఆరికట్ల రమణయ్య, వీఎస్ఆర్, వేణుగోపాల్‌లను సత్కరించారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం

● ఇబ్బందిపడుతున్న స్థానికులు



తుంగతో నిండిన డ్రైనేజీకాలువ

మద్దిపాడు, ఫిబ్రవరి 18 : మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. చీకటి పడగానే మోత మోగిస్తున్నాయి. దోమ తెర లేనిదే నిద్ర పోలేని పరిస్థితి నెలకొంది. మురుగు నీటి కాలువలు దోమలకు ఆవాసాలుగా మారాయి. ప్రధానంగా వీధుల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కాలువలు పరిస్థితి అధ్వానంగా మారవడంతో దోమలకు అవాస కేంద్రాలుగా మారాయి. దోమకాటుతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. జ్వరాలు, కాళ్లు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందిపడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉండగా అలాంటిది ఎక్కడా కన్పించడం లేదు. ఎస్సీ హాస్టల్ పక్కనే డ్రైనేజీ అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు దుర్గంధంతో అల్లాడుతున్నారు. అలాగే గ్రామంలో సేకరించిన చెత్తను చెత్తసంపద కేంద్రానికి తరలించడకుండా పారిశుధ్య సిబ్బంది ఎక్కడికక్కడే తగలబెడుతున్నారు. దీంతో గ్రామంలో వాయి కాలుష్యం పెరుగుతోంది. స్కూళ్ల పక్కన చెత్తకుప్పలు వేయడంతో పాటు తగులబెడుతుండడంతో ఆ ప్రాంతం పొగ అలుముకుని విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవడంతో పాటు చెత్తను వీధుల్లోనే తగలబెట్టకుండా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

కొండపి వైసీపీలో వర్గ విభేదాలు !

వైఎస్ఆర్ విగ్రహావిష్కరణకు దూరంగా వరికూటి వర్గీయులు ● హాజరుకాని అశోక్‌బాబు, తాటిపర్తి, మాదాసి



సభ జరుగుతున్న సమయంలో ఖాళీగా కుర్చీలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 18 : నియోజకవర్గం వైసీపీలో మరోమారు వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆదివారం శానంపూడి రోడ్డు ఎదురుగా జాతీయ రహదారి పక్కనే నిర్వహించిన వైఎస్ఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జులు మాదాసి వెంకయ్య, వరికూటి అశోక్‌బాబు, వైపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో తొలి నుంచి గ్రూపు తగాదాలు నెలకొనడంతో తాజాగా వెంకయ్య, ఆ తర్వాత అశోక్‌కుబాబును కాదని కొత్తగా మంత్రి సురేష్‌ను ఇన్‌చార్జిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఇదిలా ఉండగా, రాష్ట్ర వైసీపీ వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మించిన ఆర్చీ, వైఎస్ఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి వరికూటి డుమ్మా కొట్టారు. ఈ కార్యక్రమానికి వరికూటి అభిమానులు, ఆయన్ను అనుసరించే నాయకులు, ముఖ్యంగా స్థానిక ముస్లింలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సింగరాయకొండకు చెంది వైపాలెం ఇన్‌చార్జిగా ఉన్న తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఆహ్వానం ఉన్నా ఆయన కూడా మోహం చాటేశారు. తాను వైపాలెంలో నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మంత్రి సురేష్ ఒక్కసారి కూడా చంద్రశేఖర్‌కు మద్దతుగా అక్కడ ఆయనతో పాటు పర్యటించలేదు. దీంతో ఆయన ఇన్‌చార్జిగా ఉన్న నియోజకవర్గంలో నిర్వహిస్తున్నా కార్యక్రమానికి తాటిపర్తి పాల్గొనకుండా దూరంగా ఉన్నట్లు చర్చనడుస్తోంది.

అసంతృప్తిలో వైసీపీ మండల అధ్యక్షుడు

పూర్తిగా పార్టీ కార్యక్రమైనప్పటికీ వైసీపీ మండల అధ్యక్షుడైన సామంతుల రవికుమార్‌రెడ్డిని స్టేజీ మీదకు ఆహ్వానించినా ఆయన కింద కుర్చీలోనే కూర్చుండిపోయారు. తొలుత వేసిన శిలాఫలకంపై, ఫ్లెక్సీల్లో వరికూటి అశోక్‌బాబు పేరు లేకపోవడంతో శుక్రవారం రాత్రి ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అనుచరులు డాక్టర్ అశోక్‌ను నిలదీశారు. ఆ తరువాత శిలాఫలకాన్ని మార్చి ఆయన పేరు, ఫ్లెక్సీల్లో కొన్నింటిపై ఫొటోలు ముద్రించినా ఆయన వర్గం దూరంగా ఉంది.

గ్రూపు తగాదాల వల్లే ఓడాం : బాలినేని

సభలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండుసార్లు వైసీపీలో ఉన్న గ్రూపు తగాదాల వలనే పార్టీ అభ్యర్థులు ఓడిపోయారని చెప్పారు. పార్టీలో ఉండి పార్టీకి ద్రోహం చేయకూడదని వైఎస్ఆర్ చెప్పిన మాటను శ్రేణులు గుర్తుంచుకోవాలని సూచించారు. డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డికి గతంలో పార్టీలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, అందర్నీ కలుపుకొని పోవాలని సూచించారు. దీనిపై అశోక్ స్పందిస్తూ ఇకపై తాను మండలంలో నాయకత్వం, పెత్తనంకాని చేయబోనని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి సురేష్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ

● హాజరైన ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంట



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంట, శిద్దా రాఘవరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : ఒంగోలులోని బాపూజీ కాంప్లెక్స్ ఎదుట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య కాంశ్య విగ్రహన్ని ఆదివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావులు రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. తాను గనులశాఖ మంత్రిగా ఉన్న సమయంలో అధికారులు తనకు తెలియకుండానే సంతకాలు చేసి కేంద్రప్రభుత్వానికి పంపారని, ఆ సమయంలో కేంద్రంలోని అప్పటి మంత్రులు తాను చేసినట్లుగా భావించారని చెప్పారు. ఆ సమయంలో రోశయ్య జోక్యం చేసుకొని బాలినేని అటువంటి వ్యక్తి కాదని చెప్పిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. రోశయ్య మరణానంతరం ఒంగోలులో కాంశ్యవిగ్రహం ఏర్పాటు చేస్తానని చెప్పానని, ఆ మేరకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ కొణిజేటి రోశయ్యతో మాగుంట కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఇద్దరం కలిసి పార్లమెంట్‌లో పనిచేశామన్నారు. అసెంబ్లీలో కూడా అనేక పర్యాయాలు ఆయనను కలిసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పారిశ్రామికవేత్త చలువాది బదరీనారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, సూపర్ బజారు చైర్మన్ తాతా బద్రి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు హరీష్ హరి, పోతుల సురేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రావూరి జనార్దన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కోదూరి కిషోర్, రంగనాయకులు, సురేష్, వేణు, చెంచురామయ్య, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడు దుర్మరణం

● ఇరువురుకి తీవ్ర గాయాలు



రవితేజ (ఫైల్)

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి18: రెండు ద్విచక్రవాహనాలు ఎదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలులోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ప్రమాదంలో కొప్పోలుకు చెందిన కనుమాల రవితేజ(22) ఏసీ మెకానిక్. ఆయన తన స్నేహితుడు సుభాష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఒంగోలుకు వస్తున్నారు. అందేసమయంలో ఒంగోలుకు చెందిన విజయ్ ద్విచక్రవాహనంపై వెళుతూ రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎదురెదుగా ఢీకొని కిందపడ్డారు. దీంతో వాహనం నడుపుతున్న రవితేజ రోడ్డు మీద పడి తలకు త్రీవ గాయంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే సుభాష్, విజయ్‌లకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు నగరంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న తాలుకా పోలీస్‌స్టేషన్ ఎస్సై పున్నారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంభం చెరువు నుంచి యథేచ్ఛగా నీటి వృథా

● ఆందోళన చెందుతున్న ప్రజలు



చెరువులో అడుగంటిన జలాలు

కంభం, ఫిబ్రవరి 18 : కంభం చెరువు రెండు తూముల గుండా నీరు వృధాగా పోతుండడంపై రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కంభం చెరువుకు 18 అడుగులమేర నీరు వచ్చింది. మరో 3 అడుగులు నీరు చేరి ఉంటే అలుగు పారేది. రైతులు మూడేళ్ళ పాటు పంటలకు ఢోకా లేదని భావించారు. అయితే వారి ఆనందంగా నిలువలేదు. గత ఏడాది తీవ్ర వర్షాభావానికి తోడు రెండు తూముల గుండా నిరంతరం నీరు వృధాగా పోతుండడంతో ప్రస్తుతం ఆరు అడుగులమేర నీరు ఉంది. రెండు తూముల వద్ద లీకేజీలు ఉన్నా మరమ్మతులు చేయకపోవడంతో నీరువృధాగా పోతూ జల పాతాలను తలపిస్తున్నాయి. చెరువులో ఆ కొద్దిపాటి నీరు నిలువ ఉండకపోతే ఈ వేసవి కాలంలో భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉంది. చెరువు కింద రైతులు అరటి, పసుపు, తదితర పంటలను సాగు చేస్తున్నారు. చెరువులో నీరు అడుగంటితే వ్యవసాయ బోర్ల నుండి నీరు అందదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మంచినీటి బోర్లు కూడా ఎండిపోతాయని, మరోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే దుస్థితి వస్తుందని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమా వేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని, తూములకు తక్షణమే మరమ్మతులు చేయించాలని ఇరిగేషన్ అధికారులను నిలదీసిన విషయం విదితమే. తూము మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని, తామేమి చేయలేమిని ఇరిగేషన్ ఏఈ చెప్పడం గమనార్హం. దీనిపై డీఈ జాకీర్‌హుస్సేన్‌ను వివరణ కోరగా చెరువులో నీరు మరికొంత అడుగంటిన తరువాత రెండు తూములకు అడ్డుగా గోడను నిర్మించి మరమత్తులు చేపడతామన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి కండెక్టర్ మృతి

బేస్తవారపేట, ఫిబ్రవరి18: మిద్దెపై నుంచి జారిపడి ఆర్టీసీ కండెక్టర్ కర్రావుల రామకృష్ణారెడ్డి(49) మృతిచెందిన ఘటన మండలంలోని మోక్షగుండం గ్రామంలో ఆదివారం చోటు చేసుకొంది. గిద్దలూరు ఆర్టీసీ డిపోలో కండెక్టర్‌గా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి పందిళ్లపల్లె గ్రామంలో నూతనంగా భవనం నిర్మించుకుంటున్నాడు. ఆ భవనానికి నీరు క్యూరింగ్ చేస్తూ కాలుజారీ మిద్దెపై నుంచి కింద పడ్డాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేస్తవారపేట పోలీసు లు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మీజవాన్‌కు కన్నీటి వీడ్కోలు

రాచర్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని సోమిదేవిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బత్తుల వెంకటరాజు గుండెపోటుతో మృతిచెందాడు. కోల్‌కత్తాలో విధులు నిర్వహిస్తున్న వెంకటరాజు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆ మేరకు భార్య చంద్రకళకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం మిలటరీ అధికారులు మృతదేహాన్ని స్వగ్రామమైన సోమిదేవిపల్లికి తీసు కొచ్చారు. ప్రజలు, కుటుంబసభ్యులు భార్య, ఇద్దరు కుమారులు భౌతికకాయం చూసి విలపించారు. ఎమ్మెల్యే గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జి కెనాగార్జునరెడ్డి నివాళులర్పించారు. సర్పంచ్ రేగలగడ్డ రమాదేవి, రేగలగడ్డ ఆవులయ్య, సీఆర్‌పి మురళి, సూరా పాండురంగారెడ్డి, బిజ్జం రాంభూపాల్‌రెడ్డి, ఓబులరావు, ఎస్సై క్రిష్ణపావని నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 18: మార్కాపురం పట్టణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఆదివారం ఎస్‌ఐ అబ్దుల్‌రెహమాన్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో దాడులు నిర్వహించగా శ్రీరామ్ అనే వ్యక్తి వద్ద 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా జ్వాలాముఖి అమ్మవారి కల్యాణం



స్వామివార్ల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి18: ఒంగోలు నగరం పెళ్లూరులోని శ్రీగురునాథేశ్వర సమేత జ్వాలాముఖి అమ్మవారి కల్యాణం ఆదివారం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

దేవాలయానికి నూతన రథం అప్పగింత

గిద్దలూరు, ఫిబ్రవరి 18 : దక్షిణకాశిగా పేరొందిన గిద్దలూరులోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానానికి నూతన రథం సమకూరింది. దేవస్థాన కమిటీ చైర్మన్ శివపురం రమాదేవి, మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు దంపతులు రూ.12 లక్షల సొంత నిధులతో రథాన్ని సమకూర్చి దేవస్థానానికి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శోభయాత్ర నిర్వహించి దేవస్థానానికి అప్పగించారు. కార్యక్రమంలో యర్రారెడ్డి, సోమయ్య శ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఆప్టిట్యూడ్ పరీక్షకు విశేష స్పందన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : ఈ-అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని ఆంధ్ర హైస్కూలులో నిర్వహించిన పదో అంతర్రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. 3నుంచి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా 9 కేంద్రాల్లో 8వేల మంది విద్యార్థులకు సెకండ్ లెవల్ పరీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 10న బహుమతి ప్రదానం జరుగుతుందని ఆ సంస్థ సీఈవో డాక్టర్ ఫణిపవన్ తెలిపారు. ఆంధ్రా హైస్కూలులో జరిగిన పరీక్షకు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అభ్యాస్ అకాడమీ ఆంధ్ర మేనేజర్ బి.సాయిరామ్, హెచ్‌ఎం యుగేష్, ఆక్స్‌ఫర్డ్ స్కూలు డైరెక్టర్ లక్ష్మీ, నారాయణ స్కూలు నుంచి నారాయణ, శ్రీరామ్ ఒలంపియాడ్ స్కూలు డైరెక్టర్ శ్రీరాములురెడ్డి, కమల స్కూలు ప్రతినిధి పవన్, జూపిటర్ స్కూలు నుంచి వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాలినేనితో మంత్రి సురేష్ భేటీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పార్టీ జిల్లా ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలు భేటి అయ్యారు. స్థానిక లాయర్‌పేటలోని బాలినేని నివాసంలో ఆదివారం ఉదయం వారు కలిసి సుమారు అరగంట పలు అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం శర్మా కాలేజీలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభించిన అనంతరం సింగరాయకొండకు బయలుదేరి వెళ్ళారు.

విద్యార్థులు ఉన్నత విలువలు నేర్చుకోవాలి



మాట్లాడుతున్న మస్తాన్‌రావు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 18: విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత విలువలు నేర్చుకోవాలని, ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెసల మస్తాన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరం ప్రగతికాలనీలో సంఘం తరఫున ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు అబద్ధాలు, మోసం అనే గుణాలకు దూరంగా ఉండాలని, భారతీయ సంస్కృతి, నాగరికత గొప్పతనాన్ని తెలుసుకోవాలన్నారు. సంస్థ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో గొప్పదని, విద్యార్థులు జీవనోపాధి కోసం ఆంగ్లాన్ని నేర్చుకున్నా, తెలుగు భాషలో సైతం ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పులి నిరంజన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదవటం మాకిష్టం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కోటేశ్వరి తదితరులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 18: ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. నగరానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపగ్రంథ పాలకురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజ్ఞానం కోసం గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఇందిరాగాంధీకి జవహర్‌లాల్ నెహ్రూ రాసిన లేఖలతో రూపొందించి లెటర్స్ ఫ్రం ఫాదర్ టు హిస్ డాటర్ తెలుగు అనువాద పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య ప్రసంగిస్తూ జిల్లా గ్రంథాలయంలో ఎన్నో విజ్ఞానపరమైన పుస్తకాలు ఏర్పాటు చేయటం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్.ఉదయ్‌కుమార్, కరవది సుబ్బారావు, కె.సంపూర్ణమ్మ, స్మైలీ, టి.గోవిందమ్మ, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

25న విజయవాడలో అధ్యయన తరగతులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18: హేతువాద సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే అధ్యయన తరగతులను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా నాస్తిక సాంస్కృతోద్యమాలు, రాజ్యాంగం పౌరహక్కులు-బాధ్యతలు, నాస్తికత్వం-అవశ్యకత తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ అధ్యయన తరగతుల్లో నార్నె వెంకటసుబ్బయ్య, ముప్పాళ్ళ సుబ్బారావు, ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ సమరం, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొంటారని, జిల్లాలోని హేతువాదులు ఈ తరగతుల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న రవీంద్ర

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 18: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ మోటివేషనల్ ట్రైనర్ డాక్టర్ రవీంద్ర తెలిపారు. విద్యార్థులు ఈనెల రోజులు ఇతర అంశాల జోలికి వెళ్ళకుండా కేవలం చదువుమీదే దృష్టి కేంద్రీకరించాలన్నారు. అపుస్మా ఆధర్యంలో విజయీభవ పేరుతో ఆదివారం ఒంగోలులోని ఎ1 ఫంక్షన్ హాలులో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల మోటివేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు మాధవరావు అధ్యక్షతన జరిగిన సభలో మరో మోటివేషన్ సింగంశెట్టి అభిషేక్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకానికి దూరంగా ఉంటే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత రవికుమార్, శ్రీసరస్వతి విద్యా సంస్థల అధినేత ఏవీ.రమణారెడ్డి, శ్రీప్రతిభా విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అపుస్మా ప్రతినిధులు తులసి విష్ణుప్రసాద్, బి.హనుమంతరావు, శ్రీనివాసులు, మల్లికార్జున, వంశీకృష్ణ, మురళీకృష్ణ, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహర్షిణిలో శిక్షణ తరగతులు



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 18 : ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఒంగోలు జూనియర్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈపీఎస్ శిక్షణ జేసి, నేషనల్ ట్రైనర్ రాహుల్ శిక్షకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జేసీఐ నగర ప్రెసిడెంట్ వరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణ అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కసిబిసి నాగేశ్వరరావు, బొమ్మల శ్రీనివాసరావు, నైనాల రామకృష్ణ, ఇ.శివప్రసాద్, ఎస్‌వీఎస్.కొండలు, బాలకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసే వారిని తరిమికొట్టాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 18 : దళిత బహుజనుల మోసం చేసే వారిని తరిమికొట్టాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు తమ సర్వీసులో దళితులను పట్టించుకోని వారు, నేడు తమ వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాల్లో పని చేస్తున్నారని, ఇటువంటి వారి పట్ల దళిత బహుజనులు అప్రమత్తంగా ఉండి తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

సంతనూతపాడు, ఫిబ్రవరి 18: సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును విచారించేందుకు డీఎస్పీ కిషోర్‌బాబు ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి కేసుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18: రానున్న రోజుల్లో ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సంఘ ముఖ్య కార్యకర్తల శిక్షణ తరగతులు జరిగాయి. జి.శ్రీనివాసులు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి వై.సిద్దయ్య, మాజీ ఉపాధ్యక్షుడు పూనాటి ఆంజనేయులు ప్రసంగించారు. పి.రూబెన్స్ విప్లవగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, జీవీ.కొండారెడ్డి, పి.కల్పన, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మంచులో లైట్లు వేసుకుని వెళుతున్న భారీ వాహనం

రోడ్లను కమ్మేసిన పొగమంచు

కొండపి, ఫిబ్రవరి 18: కొండపి ప్రాంతంలో ఆదివారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఉదయం 9 గంటల వరకూ వీడలేదు. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. మంచులో దగ్గరికి వచ్చే వరకు ఎదురు వాహనాలు కనిపించలేదని పలువురు తెలిపారు. మంచు కారణంగా పొగాకు రెలుపునకు ఆటంకం ఏర్పడింది. కూలీలు మూడు గంటలపాటు వేచిచూసి మంచు వీడిన తర్వాత పని ప్రారంభించారు. శుక్రవారం నుంచి వాతావరణం పూర్తిగా మారింది. పగటి వేళ ఎండలు పెరగడంతోపాటు, ఉదయం పూట పొగమంచు అలముకుంటోంది.


ముసలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సమీఉల్లా

ప్రాణం తీసిన గోతుల రోడ్డు

» ఆటో బోల్తా - డ్రైవర్ మృతి .. ఐదుగురికి గాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 : గోతుల రోడ్డు ఒకరి ప్రాణం తీసింది. మండలంలోని పోలవరం పంచాయతీ పరిధిలోని చంద్రగిరి వద్ద ముండ్లమూరు, తాళ్లూరు ప్రధాన రహదారిపై ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సంతనూతలపాడు గ్రామానికి చెందిన మార్పుడి ముసలయ్య(58) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని బొప్పుడివారిపాలెంలో పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేసి ఆటోలో తిరిగి స్వగ్రామం సంతనూతలపాడు వెళ్తుండగా ఆటో నడుపుతున్న ముసలయ్య చంద్రగిరి వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ముసలయ్య ఆటో కింద పడి మృతి చెందారు. ఆటోలో ఉన్న విస్తర వెంకట లక్ష్మి, పాలేటి మల్లేశ్వరి, బంగారమ్మ, దాసరి ఏసమ్మ, చీమకుర్తి మండలం పల్లామల్లికి చెందిన రమాదేవి, తేజశ్వరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరికి ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సనందించి మెరుగైన వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముసలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముసలయ్యకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. దర్శి సీఐ షేక్ సమీ ఉల్లా పరిశీలించి క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. వెంటనే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు.

అరకిలోమీటరు దూరం గోతులే !

ముండ్లమూరు నుంచి తాళ్లూరు వెళ్లే ప్రధాన రహదారి అర కిలో మీటరు వరకు గోతులమయమైంది. ఆ గోతుల కారణంగానే ఆటో బోల్తా పడి ముసలయ్య మృతి చెందినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. గోతుల్లో అదుపు చేయలేకే ఆటో బోల్తా కొట్టిందని, అదృష్ట వశాత్తు బయట పడ్డామని ఆటోలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు బంగారమ్మ, వెంకట లక్ష్మి తెలిపారు.

హీరో తారకరత్నకు నివాళి

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 : ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్‌లో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం వద్ద సినీ నటుడు, టీడీపీ నాయకుడు నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు, అభిమానులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, వీరపనేని వీరనారాయణ, పవన్ కుమార్, వీరపనేని సుబ్బారావు, చంద్రమౌళి, వెంకటరావు పాల్గొన్నారు.

గుండ్లకమ్మలో మళ్లీ ఆగిన ఇసుక రవాణా


గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

» రీచ్ ఉన్నట్టా... లేనట్టా...
» అధికారపార్టీ నేతలకు కమీషన్‌లు, అధికారులకు మామూళ్లు అందకపోయినా నిలిపివేత
» మైనింగ్ అధికారుల తనిఖీలతో మరోసారి నిలిచిన వైనం

అద్దంకి, ఫిబ్రవరి 18: గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ఇసుక రీచ్ ఉన్నట్టా... లేనట్టా అన్న అనుమానాలు గత నాలుగున్నర సంవత్సరాలుగా వ్యక్తమవుతున్నాయి. రీచ్ ఉండి అన్నీ అనుమతులు ఉంటే తరచూ ఇసుక రవాణా నిలిపివేయటం ఏమిటన్న అనుమానాలు వస్తున్నాయి. అధికారపార్టీ నేతలకు కమీషన్‌లు అందకపోయినా... పలు శాఖల అధికారులకు మామూళ్ళు ఇవ్వకపోయినా ఇసుక రవాణా నిలిచిపోతుంది. దీని నిబట్టి అద్దంకి ప్రాంతంలో ఎలాంటి ఇసుక రీచ్ లేదన్న విషయం స్పష్టమవుతుంది.


గుండ్లకమ్మ బ్రిడ్జి అంచువరకు జరిగిన ఇసుక తవ్వకాలు

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన కార్పొరేట్ సంస్థల కనుసన్నలలో ఇసుక సీనరేజ్ వసూలు జరుగుతుంది. అయితే, అధికారపార్టీ నేతలు, ఆయా శాఖల అధికారులు నోరు విప్పకుండా వాటాలు చేరుతున్నాయని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలోనే వాటాలు, కమీషన్‌లు అందనప్పుడు ఏదొక సాకుతో ఇసుక రవాణాకు బ్రేక్‌లు పడుతున్నట్లు తెలుస్తుంది. తరచూ ఇసుక రవాణా నిలిపివేస్తుండటంతో ఇసుక రవాణాదారులు బ్లాక్ మార్కెట్ పేరుతో మరింత ధర పెంచి అమ్మకాలకు తెరలేపుతున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో గుండ్లకమ్మ నది నుంచి అద్దంకి పట్టణంలోకి ట్రాక్టర్ ఇసుక రూ.1200 నుంచి రూ.1500 వరకు ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అదే ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో అయితే ఏకంగా రూ.5 వేలు కూడా వసూలు చేస్తున్నారు. ఇదేమని భవనాల నిర్మాణదారులు అడిగితే మామూళ్ళు ఇస్తేనే ఇసుక బయటకు వస్తుందని ఇసుక రవాణాదారుల నుంచి సమాధానం వస్తుంది. నాలుగు నెలలుగా ఇసుక రవాణా నిలిచిపోగా పక్షం రోజుల నుంచి పునఃప్రారంభమైంది. రెండు రోజుల క్రితం మైనింగ్ అధికారులు వచ్చి దాడులుచేసి ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేశారు. అన్నీ అనుమతులు ఉన్నాయి కదా... ఎందుకు ఆపుతున్నారని పలువురు ఇసుక రవాణాదారులు మైనింగ్ అధికారులను అడుగగా, వాళ్ల నుంచి వచ్చిన సమాధానంతో ఇసుక రవాణాదారులు నోరు వెళ్ళబెట్టినట్లు తెలుస్తుంది. అద్దంకి ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి రీచ్‌లు గుర్తించనప్పుడు ఇసుక తవ్వకాలు ఎలా చేస్తారని అన్నట్లు తెలుస్తుంది. అయితే, నిత్యం రవాణా జరుగుతుంది కదా అని ఇసుక రవాణాదారులు అడిగినప్పుడు మాత్రం మైనింగ్ అధికారుల నుండి సమాధానం రాకపోవటం విశేషం.


ఇసుక రవాణాకు ఇస్తున్న సీనరేజ్ బిల్లు

గతంలో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు కూడా ఇదే పంథాను అనుసరించటం, అనంతరం సీనరేజ్ వసూలు చేసే సిబ్బంది వెళ్లి కలిసిన మరుసటి రోజు నుంచి మరలా ఇసుక రవాణా యథావిధిగా జరుగుతుంది. ఇక అనుమతుల విషయాలను పక్కన పెడితే ఇసుక తవ్వకాల విషయంలో కనీస నిబంధనలు కూడా పాటించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఊటబావులు, మంచినీటి పథకాలు, ఎత్తిపోతల పథకాల బావులు, అద్దంకి-దర్శి రోడ్డులో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి సమీపం వరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్నా.. ఆయా శాఖల అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రవాణాపై స్పష్టత ఇవ్వటంతో పాటు మంచినీటి పథకాలు, ఎత్తిపోతల పథకాలు, బ్రిడ్జిల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ విజయానికి శ్రమించాలి

» మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
» కొనసాగుతున్న వలసల పరంపర

కనిగిరి, ఫిబ్రవరి 18: నూతనంగా పార్టీలో చేరిన వారు తెలుగుదేశం పార్టీ అఖండ విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, సత్యం ఆధ్వర్యంలో వంగపాడు గ్రామానికి చెందిన ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని గట్టి నిర్ణయానికి వచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయబావుటా ఎగరడం ఖాయమన్నారు. వైసీపీ అరాచక పాలన, వేధింపులు భరించలేక టీడీపీలోకి వస్తున్న వారంతా తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం అందరం పాటుపడాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌రెడ్డి ఐదేళ్ల అవినీతి, దోపిడీ, అరాచక, విధ్వంస పాలనను ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉగ్ర సూచించారు. చంద్రబాబు ఎస్సీలకు సముచిత స్థానం ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్సీల ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి వారిపై దాడులు చేయడంతోపాటు నిలువునా మోసగించారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీల దెబ్బ చూపించాలన్నారు. కార్యక్రమంలో మన్నేపల్లి సుశీలరావు, నారాయణ, సాల్మన్, రవి, లోకేష్, చిన్నా, పోలయ్య, యాకోబు, గిడోను తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి.


డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వంగపాడు ఎస్సీ కుటుంబాలు

నుచ్చుపొదలో వైసీపీని వీడిన 15 కుటుంబాలు

పామూరు : గ్రామాలపై ప్రేమ లేని పాలకులు మనకు అవసరం లేదని మీరంతా రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆరేకొండహరి ప్రసాద్, కౌలూరి రహంతుల్లా, బూత్ కమిటీ ఇన్‌చార్జి చంటి ఆధ్వర్యంలో సుమారుగా 15 కుటుంబాలు వైసీపీ ని వీడి ఉగ్ర సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు, వారందరికీ ఉగ్ర పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పందిటి వెంకటేశ్వర్లు, మెడబలిమి నారాయణ, ఎం.రామారావు, చినవెంకటస్వామి, రామ్‌ప్రసాద్, కొలనీడి మాలకొండయ్య, కోలా శ్రీనివాసులు, ఎం.నరసింహులు, కే వెంకటరమణయ్య, అజయ్, అనిల్, ఎస్.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ తన గెలుపునకు కష్టపడి పనిచేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ నాయకులు, ఎం.గంగరాజుయాదవ్, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, మాజీ సింగిల్ విండో చైర్మన్‌లు బీ జయరామిరెడ్డి, బీ నారాయణరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హుసేన్‌రావుయాదవ్, షేక్ ఖాజారహంతుల్లా, పాలపర్తి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి శ్రీనివాసులు, షేక్ షరీఫ్, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, ముబీనా, పోకా నాయుడు, ఎం వెంకట్రావు, మెంటా నరసింహారావు, దేవరపు మాల్యాద్రి, కౌలూరి హనీఫ్, సూర్య పాల్గొన్నారు.

మనోహర్ రావడం ఆనందంగా ఉంది

పామూరు మేజర్ పంచాయతి మాజీ సర్పంచ్ మనోహర్ టీడీపీలోకి రావడం శుభపరిమాణామని, రానున్న ఎన్నికల్లో పట్టణంలో టీడీపీకి తిరుగులేని ఆదరణ లభిస్తుందని టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర అన్నారు. పద్మావతి అతిథి గృహంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు డీవీ మనోహర్, కుమారుడు మహి వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఉగ్ర కండువాలు కప్పి ఆహ్వానించారు.


మాట్లాడుతున్న పరిటాల

దళితుల కోసం పోరాడేది టీడీపీ

తాళ్లూరు, ఫిబ్రవరి 18 : దళితుల కోసం నిరంతరం పోరాడుతూ టీడీపీ అండగా నిలుస్తున్నదని పార్టీ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ప్రతి పల్లెకు టీడీపీ ప్రజా యాత్ర దోసకాయలపాడులో నాయకులు నల్లపాటి సత్యం, సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సురేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అక్రమంగా, అడ్డదారుల్లో గెలవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందన్నారు. గ్రామాల్లో ప్రజలంతా ఒక్కటై వైసీపీ నేతల ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. జగన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచీ ఎస్సీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను దారిమళ్లించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, అందరి బాగు కోసం టీడీపీని గెలిపించుకోవాలన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో నిత్యావసరాల ధరలతోపాటు కరెంట్, బస్సు చార్జీలు పెరిగాయన్నారు. ఇవిచాలక పన్నులతో పేదల నడ్డివిరిచారన్నారు. సంతోషకరంగా జీవనం సాగించేందుకు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. నేతలు శ్రీను, హరి గ్రామస్థులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాల గురించి చంద్రబాబు మాట్లాడటం విడ్డూరం

● చీరాల ఎమ్మెల్యే కరణం


మాట్లాడుతున్న బలరాం

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : నీచ రాజకీయాల గురించి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని చీరాల శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఇంకొల్లు సభలో తన పట్ల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరినీ రోడ్డున పడేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2019లో తాను టీడీపీ నుంచి ఎమ్మెల్యే సీటును చంద్రబాబును అడగలేదని బలరాం తెలిపారు. చంద్రబాబును, ఆయన కొడుకు లోకేష్‌ను ఎవరో తిట్టారని, వాళ్ల మీద కోపంతో నన్ను చీరాలకు పంపారన్నారు. స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పార్టీలకతీతంగా ప్రజలు నన్ను గెలిపించారే తప్ప చంద్రబాబు ద్వారా కాదన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ కాకుండా వాస్తవాలు తెలుసుకొని చంద్రబాబు మాట్లాడితే మంచిదని హితవుపలికారు.

పీఆర్ఎంఈ సంఘ నూతన కమిటీ ఎన్నిక

కనిగిరి, ఫిబ్రవరి 18: పీఆర్ఎంఈ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం నూతన సమితి అధ్యక్షుడు ఖాజా రహమత్ బాషా అన్నారు. ఎం పీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఆదివారం కనిగిరి సమితి పీఆర్ ఎంఈ సంఘ నూతన కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా రహమత్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

ఆటోలతో పొంచిఉన్న ప్రమాదం

» పరిమితికి మించి కూలీలు తరలింపు
» పొట్టకూటి కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం


పరిమితికి మించి ఆటోలో వెళుతున్న కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 18: రెక్కాడితే డొక్కాడని రోజువారీ కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రమాదకరమైన ప్రయాణం సాగిస్తున్నారు. గ్రామాలలో పనులు సరిగా లేకపోవటంతో పలువురు కూలీలు ఆటోలను ఏర్పాటుచేసుకొని పొరుగు మండలాల్లో పనులకు వెళుతున్నారు. పరిమితికి మించి ఆటోలు, జీపులలో కూలీలు తరలి వెళ్లటం చూసిన పలువురు ఏదైన ప్రమాదం జరిగితే కూలీల ప్రాణాలకు ముప్పు తప్పదంటున్నారు. ప్రమాదం అని తెలిసిన కొందరు కూలీలు ఆటోలలోనే పనులకు వెళుతున్నారు. తమ కుటుంబాలు గడవాలంటే రోజువారీ పనులు తప్పవని వారు అంటున్నారు.

బల్లికురవ మండలం వల్లాపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, కొప్పెరపాలెం, కొణిదెన తదితర గ్రామాల నుంచి రోజువారీ పనులకు వెళ్లే కూలీలు ప్రమాదకరమైన ప్రయాణం సాగిస్తున్నారు. పది మంది ఎక్కాల్సిన మూడు చక్రాల ఆటోలో 20 మంది వరకు పనులకు వెళుతున్నారు. 20 మంది వెళ్లాల్సిన నాలుగు చక్రాల ఆటోలో 40 మంది వరకు ప్రయాణం సాగిస్తున్నారు. గతుకుల రోడ్లలో బయటకు వేలాడుతూ కూలీలు తమ పొట్ట నింపుకునేందుకు పొరుగు మండలాలకు మిర్చి కోతల పనులకే, పొగాకు తోటలలో పనులకు వెళుతున్నారు. కూలీల ఆటోలు పల్టీ కొడితే పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో కూడా పలు సందర్భాలలో కూలీల ఆటోలు పడిపోయి పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇటీవల సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన కూలీల ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు ప్రాణాలు పోయాయి. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి కూలీలకు కౌన్సెలింగ్ ఇచ్చి ప్రమాదాలు జరగకుండా కూలీల రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. బల్లికురవ మండల కేంద్రం గుండా ప్రతిరోజు కూలీలు ఆటోల ద్వారా పెద్దఎత్తున తరలి వెళుతున్నారు. ఈ ఆటోలు వెళుతుంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


బల్లికురవ నుంచి పొరుగు మండలాలకు వెళుతున్న కూలీలు

దత్తపాదుకా క్షేత్రంలో ప్రత్యేక పూజలు


దత్తపాదుకాక్షేత్రంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామి

అద్దంకి, ఫిబ్రవరి 18: గురువుల మాటలలో చాలా అంతరార్థం దాగి ఉంటుందని, ఆ మాటలను తేలికగా తీసి వేయవద్దని మైసూరు అవధూత దత్తపీఠం ఉత్తరాధీశులు దత్త విజయానందతీర్థ స్వామీజీ అన్నారు. స్థానిక దత్తపాదుకా క్షేత్రంలో ఆదివారం విజయానంద తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శౌర హోమం, పూర్ణా హుతి నిర్వహించారు. దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీచక్రార్చన, దివ్యనామ సంకీర్తన జరిగాయి. భక్తుల నుద్దేశించి విజయానంద తీర్థ స్వామీజీ మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం ప్రతిష్ఠ జరిగిన జనవరి 22 భారతీయులందరూ గర్వించదగ్గ రోజు అన్నారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు గంగవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

గంగవరం(ఇంకొల్లు), ఫిబ్రవరి 18: ఇంకొల్లు మండలం గంగవరంలో సోమవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ జరగనున్నట్లు ఆపార్టీ గ్రామ అధ్యక్షుడు కరి వీరాంజనేయులు తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు గ్రామానికి చెందిన బొడెంపూడి నాగేశ్వరరావు రెండు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేశారు. గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో 8 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండపి ఎమ్మెల్యే స్వామి, తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పాల్గొననున్నారు. ఉదయం 10.29లకు జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పార్టీ నాయకులు కోరారు.

టీడీపీలో చేరిన 20 కుటుంబాలు

మార్టూరు, ఫిబ్రవరి 18: మార్టూరులోగల మద్ది లక్ష్మయ్య కంపెనీ సమీపంలోని 20 బీసీ కుటుంబాలకు చెందిన వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. 15వ బూత్ పరిధిలోని దాదాపుగా 70 మంది ఓటర్లు శనివారం రాత్రి బీసీ కాలనీ దగ్గరకు వచ్చిన టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పు రవి, వీరాంజనేయులు,శంకర్, అంకమ్మరావు, పోలయ్య వెంకటేశ్వర్లు, చిన్న అంకమ్మ, గోపి, బుజ్జి, వెంకటేష్, మణి అంజమ్మ, పావని, గోపిరాజు, సీతా రాములు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జంపని శ్రీనివాసరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, కామినేని జనార్దన్, పుట్టా స్వామి, షేక్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



తాళ్లూరు, ఫిబ్రవరి 18 : పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగా భవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో సందడిగా మారింది. గంగమ్మ తల్లిని భక్తులు దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారి ఎదుట వాహనాలకు పూజలు చేయించారు. మరి కొందరు గంగమ్మ తల్లికి విరాళాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఎస్. కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మిలు అమ్మవారికిపూజలు నిర్వహించారు.



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

- మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి
- పెద్దనాగులవరంలో 80 కుటుంబాలు చేరిక

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 18: రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా సాధ్య మవుతుందన్నారు. మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో ఆదివారం రాత్రి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 80 కుటుంబాలు కందుల నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆయన కుమారుడు కందుల విఘ్నేష్ రెడ్డిని శాలువాలు, దండలతో ఘనంగా గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలో పెద్ద నాగులవరం వైస్‌సర్పంచ్ షేక్ మస్తాన్‌వలి, మాజీ సర్పంచులు బొమ్మనబోయిన పెద్ద వెంకటసుబ్బయ్య, ఓర్సు వెంకటే శ్వర్లు ఆధ్వర్యంలో 80 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లా డుతూ.. వైసీపీ పాలనపై విసుగు చెందామని కందుల నారాయణరెడ్డితోనే మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధ్యమన్నారు. ప్రత్యేక జిల్లాతోనే తమ బతుకులు బాగుపడ తాయన్నారు. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధిస్తామన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం ప్రత్యేక జిల్లాతోనే సాధ్యమని తద్వారా పెదనాగులవరంలో ఉన్న రైతుల పొలాలు కోట్ల రూపాయలు ధరలు పలుకుతాయన్నారు. ప్రత్యేక జిల్లాతో యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని, అన్ని రంగాలు కార్మికులకు సైతం పని లభిస్తుందని తద్వారా వలసలు నివారించవచ్చు అన్నారు. అనంతరం గ్రామంలో 'బాబు ష్యూరిటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, పెదనాగులవరం గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కంటివైద్యశిబిరానికి విశేషస్పందన

మార్కాపురం వన్‌టౌన్ : ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేది టీడీపీనేని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్ నగర్‌లోని కమలా పాఠశాలలో గుంటూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. దాదాపుగా ఎనిమిదేళ్లగా టీడీపీ ఆధ్వర్యంలో అనేక కంటి వైద్యశిబిరాలు నిర్వహించామని, దాదాపు 2 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. ఇదే ఒరవడి భవిష్యత్తులోనూ కొనసాగిస్తామన్నారు. నేత్ర వైద్య శిబిరానికి సహకరించిన శంకర కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. 750 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 205 మందికి కంటి ఆపరేషన్ల కోసం వైద్యుల సిఫార్సు చేశారు. తొలిరోజు 50 మందిని గుంటూరులోని కంటి ఆసుపత్రికి తరలించారు. ఆప రేషన్లు అవసరమైన మిగతావారిని కూడా ప్రకటించిన తేదీల్లో బస్సుల్లో తీసుకెళ్లి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి తెలిపారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులు, వారి బంధువులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



కంటి వైద్యశిబిరానికి హాజరైన రోగులు

అవీ..ఇవీ..

కరాటే పోటీలో ప్రతిభ



ప్రతిభ చూపిన కరాటే విద్యార్థులు

రాచర్ల, ఫిబ్రవరి 18 : పట్టణంలోని షాదీ ఖానాలో అండర్-15 విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. 20 మంది విద్యార్థులు కరాటే పోటీలో పాల్గొని సత్తాను చాటారు. ముంబయికి చెందిన కున్ఫూ మాస్టర్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. గిద్దలూరు పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ అబ్దుల్ రషీద్ పర్యవేక్షణలో పోటీలు జరగ్గా, గెలుపొందిన వారికి ప్రశంసపత్రాలు బెల్ట్‌లు అందజేశారు. 10 మందికి గ్రీన్ బెల్ట్, ఏడుగురికి ఎల్లో బెల్ట్ అందజేశారు. కార్యక్రమంలో మొహిద్దీన్, తౌఫిక్, బాబు, రిటైర్డ్ కల్నల్ ఓంప్రకాశ్, మస్తాన్‌వలి, బడావలి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి నూతన రథం అప్పగింత



నూతన రథంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గిద్దలూరు, ఫిబ్రవరి 18 : దక్షిణకాశిగా పేరొందిన శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానానికి నూతన రథం సమకూరింది. దేవస్థాన కమిటీ చైర్మన్ శివపురం రమాదేవి, మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు దంపతులు రూ.12 లక్షల సొంత నిధులతో రథాన్ని సమకూర్చి దేవస్థానానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు ఇంటి వద్ద నూతన రథానికి కుటుంబీకులు రాజేష్, హరీష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపుగా శోభయాత్ర నిర్వహించి దేవస్థానానికి అప్పగించారు. కార్యక్రమంలో హిందూదేవాలయాల కమిటీ చైర్మన్ యర్రారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సోమయ్య, కుసుహ హరనాథ మందిరం అధ్యక్షులు శ్రీనివాసులు, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ దేవాలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాగుంట ట్రస్టు ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటయ్య

పుల్లలచరువు, ఫిబ్రవరి 18: మాగుంట ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 16 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన పుల్లలచెరువులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు ఎంపీపీ కందుల వెంకటయ్య వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి సహకారంతో మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల వెంకటయ్య, పీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టరు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు ఆవుల రమణారెడ్డి, మల్లాపాలెం సర్పంచి రమణారెడ్డి,శివారెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

పీఆర్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

పొదిలి, ఫిబ్రవరి18 : పొదిలి తాలూకా సమితి పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల పంచాయతీరాజ్ మిని స్ట్రీస్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఉద్యోగులు ఆదివారం స్థానిక మండ ల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో ఆ సంఘం కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డి.దినేష్, సెక్రటరీగా సయ్యద్.షుకూర్, జాయింట్ సెక్రటరీగా ఎం.సరస్వతి, కౌన్సిలర్స్‌గా ఎం.వెంకటరెడ్డి, ఎస్‌కె.జిందాస్ మదార్‌వలి, ట్రెజరర్‌గా కె.రవిశంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను ఆ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించి అభినందలను తెలిపారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



ప్రత్యేక అలంకరణ పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 18: మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వ హించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆటలతో ఆరోగ్యం



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 18: ఆటలతో ఆరోగ్యం సమకూరుతుందని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. పట్టణంలోని డా. వైఎస్ క్రీడా వికాస కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి షటిల్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో మానవజీవితం యాంత్రికమౌతోందన్నారు. దీని నుంచి బయటపడడానికి క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. అనంతరం పట్టణ స్పోర్ట్స్ అండ్ యోగా క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తిమ్మిశెట్టి సత్యం, నాయకులు సయ్యద్ కరీం, పిన్నిక నాగేశ్వరరావు, వేణు, శివ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి హనుమంత వాహన సేవ



హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 18: స్థానిక గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీ పద్మావతి కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం వేద పండితులు వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపన తిరు మంజనం నిర్వహించారు. రాత్రి హను మంత వాహనంపై వేంకటేశ్వరునికి నగరోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణారావు తదితరుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

మిద్దెపై నుంచి జారిపడి కండెక్టర్ మృతి



రామకృష్ణారెడ్డి(ఫైల్‌ఫోటో)

బేస్తవారపేట, ఫిబ్రవరి18: మిద్దెపై నుంచి జారిపడి ఆర్టీసీ కండెక్టర్ కర్రావుల రామకృష్ణారెడ్డి(49) మృతిచెందిన ఘటన మండలంలోని మోక్షగుండం గ్రామంలో ఆదివారం చోటు చేసుకొంది. గిద్దలూరు ఆర్టీసీ డిపోలో కండెక్టర్‌గా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి పందిళ్లపల్లె గ్రామంలో నూతనంగా భవనం నిర్మించుకుంటున్నాడు. ఆ భవనానికి నీరు క్యూరింగ్ చేస్తూ కాలుజారి మిద్దెపై నుంచి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేస్తవారపేట పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మార్కాపురం ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కే.నాగార్జున రెడ్డి అన్నారు. పట్టణంలోని పీఆర్‌కాలనీలో రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తయారైన 3 బ్లాకులను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యశాఖ కమిషనర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ... మారుమూలన ఉన్న గిద్దలూరుకు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేయడమే కాకుండా అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పూర్తయినంత వరకు 94 బెడ్లు, 23మంది వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, ఎంపీపీ కడప లక్ష్మీ, వైద్యవిధాన పరిషత్ జిల్లా కోర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎస్.మూర్తి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రొటోకాల్ వర్తించదా..?

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 18 : బీసీలను చిన్నచూపు చూడడం తగదని గౌడ సంఘం కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంచర్ల కోటయ్యగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గిద్దలూరు పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవం జరుగుతున్న సమయంలో తనకు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించలేదన్నారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 56 కార్పోరేషన్లను ఏర్పాటు చేసి ప్రతి కార్పోరేషన్‌కు ఒక చైర్మన్, 12 మంది డైరెక్టర్లను నియ మించిందన్నారు. ఆ కోవలో గౌడ కార్పోరేషన్‌కు తనను డైరెక్టర్‌గా నియమించారన్నారు. శిలాఫలకంలో కూడా తన పేరు వేయకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను ఇంత చిన్నచూపు చూడడం అధికారులకు తగదన్నారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

రాచర్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని సోమిదేవిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బత్తుల వెంకటరాజు గుండెపోటుతో మృతిచెందాడు. కోల్‌కత్తాలో విధులు నిర్వహిస్తున్న వెంకటరాజు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆ మేరకు భార్య చంద్రకళకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం మిలటరీ అధికారులు ఆర్మీజవాన్ మృతదేహాన్ని స్వగ్రామమైన సోమిదేవిపల్లికి తీసుకొచ్చారు. ప్రజలు, కుటుంబసభ్యులు భార్య, ఇద్దరు కుమారులు భౌతికకాయం చూసి విలపించారు. మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జి కె.నాగార్జునరెడ్డి నివాళులు అర్పించారు. సోమిదేవిపల్లి సర్పంచ్ రేగలగడ్డ రమాదేవి, రేగలగడ్డ ఆవులయ్య, సీఆర్‌ఐ మురళి, సూరా పాండురంగారెడ్డి, బిజ్జం రాంభూపాల్‌రెడ్డి, ఓబులరావు, ఎస్సై క్రిష్ణపావని నివాళ్లు అర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 18: పట్టణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఆదివారం పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో దాడులు నిర్వహించగా శ్రీరామ్ అనే వ్యక్తి వద్ద 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులకు మహనీయుల మహోత్సవ పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఇస్మాయిల్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 18 : హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన జాతీయస్థాయి మహనీయులమహోత్సవం అవార్డు కార్యక్రమంలో వల్లూరి ఫౌండేషన్ నుంచి ఎర్రగొండపాలెం ముస్లిం యూత్ సొసైటి అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ అవార్డును స్వీకరించారు. ఎర్రగొండపాలెం ప్రాంతంలో అత్యవసర చికిత్స సమయంలో ప్రాణపాయంలో రోగులకు ఉచితంగా దాతల నుంచి రక్తం సరఫరా చేసి సహకారం అందించారు. అందులకు గాను వల్లూరి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరాజు నుంచి ఇస్మాయిల్ జాతీయస్థాయి మహనీయుల మహోత్సవంలో ఉత్తమ అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, అడిషినల్ ఎస్పీ తేజవత్, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవాజ్ఞ శర్మ పాల్గొని అభినందించారు. భారతదేశం తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ పాతిమా పేరు మీద స్వచ్ఛంద సేవకులు ఇస్మాయిల్ అవార్డు పొందారు.

రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయం : ఎరిక్షన్‌బాబు



కార్యకర్తలను టీడీపీలోకి హ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 18:పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్దే టీడీపీ అజెండా అని ఎర్రగొండ పాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఉద్ఘాటించారు. స్థానిక వడ్డేకాలనీలో వైసీపీకి చెందిన 32 కుటుంబాలు ఆదివారం ఎరిక్షన్ బాబు సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిం చారు. అనంతరం ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఒక్కసారి అంటూ మాయ మాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ నియంత పోకడలతో పాలన చేస్తున్నాడన్నారు. జరిగిన నష్టాన్ని విజన్ ఉన్న నారా చంద్రబాబునాయుడు కొద్ది రోజుల్లోనే అందరి ఆశీస్సులతో మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తున్నారన్నారు. తిరిగి అన్ని వ్యవస్థలకు పూర్వ వైభవం తెస్తారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ నీటి కొలాయి ఏర్పాటు, బీసీ చట్టం అమలు చేయడంతో పాటు నిరంతరంగా అభివృద్ధి కొనసాగుతుం దన్నారు. ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే వెలిగొండప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తామన్నారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉండి శక్తి వంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆశీర్వదించాలని సైకిలు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏర్వ మల్లికార్జున రెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, షేక్ సమ్మద్ భాష, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, కె శ్రీనివాసులు, ఎలక పాటి చెంచయ్య,షేక్ భాష, షేక్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి,నాగెళ్ల సత్యనారా యణ, కె సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ బాష, రఫీ, మౌలాలి తదిత రులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం, ఫిబ్రవరి 18: మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరుగుతూ తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించే పథకాలను వివరిస్తూ చంద్రబాబు షూరిటీ బాండ్లను, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని, చంద్రబాబునాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని అన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని దోచుకుతింటుందని అన్నారు. అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు బైలడుగు నాగరాజు ఆధ్వర్యంలో మారబోయిన ఎల్లయ్య, బత్తుల గురవయ్య, వెంకటేశ్వర్లు, గార్లపాటి పెద్దవెంకటేశ్వర్లు, వెంకటరావుతోపాటు 20 బీసీ కుటుంబాలు పార్టీ లో చేరగా వారికి ఇంచార్జ్ ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వలరాజు, నాయకులు, ఎం.శ్రీనివాసరెడ్డి, వి.ఆంజనేయులు, ఏ.నాసరరెడ్డి, ఎం.పిచ్చయ్య, నాగరాజు, జనసేన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంభం చెరువు నుంచి యథేచ్ఛగా నీటి వృథా

రెండేళ్లగా పట్టించుకోని వైనం



కంభం చెరువులో అడుగంటిన జలాలు

కంభం, ఫిబ్రవరి 18 : కంభం చెరువు రెండు తూముల గుండా నీరు వృధాగా పోతుండడంపై రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కంభం చెరువుకు 18 అడుగులమేర నీరు వచ్చింది. మరో 3 అడుగులు నీరు చేరి ఉంటే అలుగు పారేది. రైతులు మూడేళ్ళ పాటు పంటలకు ఢోకా లేదని భావించారు. అయితే వారి ఆనందంగా నిలువలేదు. గత ఏడాది తీవ్ర వర్షాభావానికి తోడు రెండు తూముల గుండా నిరంతరం నీరు వృధాగా పోతుండడంతో ప్రస్తుతం ఆరు అడుగులమేర నీరు ఉంది. రెండు తూముల వద్ద లీకేజీలు ఉన్నా మరమ్మతులు చేయకపోవడంతో నీరువృధాగా పోతూ జల పాతాలను తలపిస్తున్నాయి. చెరువులో ఆ కొద్దిపాటి నీరు నిలువ ఉండకపోతే ఈ వేసవి కాలంలో భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉంది. చెరువు కింద రైతులు అరటి, పసుపు, తదితర పంటలను సాగు చేస్తున్నారు. చెరువులో నీరు అడుగంటితే వ్యవసాయ బోర్ల నుండి నీరు అందదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మంచినీటి బోర్లు కూడా ఎండిపోతాయని, మరోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే దుస్థితి వస్తుందని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వృధాగా పోతున్న నీటిని అరికట్టాలని, తూములకు తక్షణమే మరమత్తులు చేపించాలని ఇరిగేషన్ అధికారులను నిలదీసిన విషయం విదితమే. తూము మరమత్తులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని, తామేమి చేయలేమిని ఇరిగేషన్ ఏఈ చెప్పడం గమనార్హం.

దీనిపై డీఈ జాకీర్‌హుస్సేన్‌ను వివరణ కోరగా చెరువులో నీరు మరికొంత అడుగంటిన తరు వాత రెండు తూములకు అడ్డుగా గోడను నిర్మించి మరమత్తులు చేపడతామన్నారు.

ఘనంగా మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ

- హాజరైన ఎమ్మెల్యే బాలినేని, మాగుంట



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శిద్ధా రాఘవరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : ఒంగోలులోని బాపూజీ కాంప్లెక్స్ ఎదుట ఆర్యవైశ్య సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య కాంశ్య విగ్రహాన్ని ఆదివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావులు రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బా లినేని మాట్లాడుతూ మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. తాను గనులశాఖ మంత్రిగా ఉన్న సమయంలో అధికారులు తనకు తెలియకుండానే సంతకాలు చేసి కేంద్రప్రభుత్వానికి పంపారని, ఆ సమయంలో కేంద్రంలోని అప్పటి మంత్రులు తాను చేసినట్లుగా భావించారని చెప్పారు. ఆ సమయంలో రోశయ్య జోక్యం చేసుకొని బాలినేని అటువంటి వ్యక్తి కాదని చెప్పిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. రోశయ్య మరణానంతరం ఒంగోలులో కాంశ్య విగ్రహం ఏర్పాటు చేస్తానని చెప్పానని, ఆ మేరకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పారిశ్రామికవేత్త చలువాది బదరీనారాయణ, ఆర్యవైశ్య కా ర్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, సూపర్ బజారు చైర్మన్ తాతా బద్రి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు హరీష్ హరి, పోతుల సురేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రావూరి జనార్దన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కోడూరి కిషోర్, రంగనాయ కులు, సురేష్, వేణు, చెంచురామయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో అడుగంటిన భూగర్భజలాలు

ట్యాంకర్లే శరణ్యమంటున్న ప్రజలు



అమానిగుడిపాడులో ట్యాంకరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 18 : మండలంలో తాగునీటిబోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో తాగునీటికోసం గ్రామీణ ప్రజలు ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు ఫిబ్రవరి 1 నుంచి ట్యాంకర్లను నిలిపివేశారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్ర గొండపాలెం మండలంలో 10 గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. ప్రభుత్వం ట్యాంకర్లుతో నీటిసరఫరా నిలిపివేయడంతో కొన్ని గ్రామపంచాయతీల్లో సర్పంచులు ట్యాంకర్లు ఏర్పాటు చేసిన ప్రజలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగడంలేదు. మురారి పల్లె గ్రామంలో 30 ట్యాంకర్లు సరఫరా, కోటయ్య కాలని 10 ట్యాంకర్లు, కాశికుంటతాండ 8 ట్యాంకర్లు, మెట్టబోడుతాండ 2 ట్యాంక ర్లు, అయ్యంబొట్లపల్లి 12 ట్యాంకర్లు, చిన్నబోయలపల్లి 8 ట్యాంకర్లు, వాదంపల్లి 15 ట్యాంకర్లు, అమానిగుడిపాడు 15 ట్యాంకర్లు, తమ్మడపల్లి 20 ట్యాంకర్లు సరఫరా చేస్తున్న ప్రజల అవసరాలకు తాగునీరు సరిపోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పశువులకు, గొర్రెలకు, మేకలకు పొలంలో నీళ్ల లేక పోవడంతో ఇళ్ల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. వేసవి ఉష్ణోగ్రత పెరుగుతండడంతో తాగునీటి అవసరాలు పెరిగినందున ప్రభుత్వం ట్యాంకర్లు నీటిసరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో గ్రామపంచాయతీ సర్పంచులకు గ్రామపంచాయతీల్లో నిధులు నిల్వ లేక ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నిరుత్సాహంతో అరకొరగా ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు, పశువులకు పూర్తిస్థాయిలో నీటిసరఫరా చేయాలంటే ప్రభుత్వం ట్యాంకర్లుకు అనుమతి ఇవ్వాలని సర్పంచులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

షాదీఖానాల నిర్మాణంపై వైసీపీ నిర్లక్ష్యం

» శంకుస్థాపనకే పరిమితం
» టీడీపీ హయాంలో వేసిన శిలాఫలకం
» ఆ కారణంతోనే పనులు చేపట్టని వైసీపీ పాలకులు

దొనకొండ, ఫిబ్రవరి 18 : దొనకొండలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన షాదీఖానా నిర్మాణం కేవలం శంకుస్థాపనకే పరిమితమైంది. ఇక్కడ వేసిన శిలాఫలకం ఐదేళ్లుగా వెక్కిరిస్తోంది. టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు 2016లో షాదీఖానాల నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరు చేసింది. దొనకొండ మండలానికి మంజూరైన షాదీఖానా నిర్మాణం ప్రారంభంలో నాయకులు పట్టించుకోలేదు. అనంతరం అప్పటి మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్ దొనకొండలో షాదీఖానా ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొని అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో అప్పటి అధికారులు ప్రధాన రహదారి పక్కన షాదీఖానా నిర్మాణానికి ఎకరా యాభై సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీంతో మైనార్టీ కార్పొరేషన్ నుంచి రూ.15లక్షల వ్యయంతో షాదీఖానాను నిర్మించేందుకు టెండరు ఖరారుకావటంతో అప్పటి మంత్రి శిద్దా 1-3-2019లో శంకుస్థాపన చేశారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన పూర్తికావస్తున్నా నేటికీ షాదీఖానా నిర్మాణాలను పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో శంకుస్థాపన జరిగిందన్న కారణంగానే వైసీపీ నాయకులు వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల అభివృద్ధిని చూడాలిగాని ఇలా వ్యవహరించడం సరికాదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పునాది గుంతకే పరిమితమైంది తప్ప నిర్మాణ పనులు అక్క అడుగు కూడా పడలేదు.

షాదీఖానా నిర్మాణం, దాని ప్రాముఖ్యతను పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని, షాదీఖాన నిర్మాణం దొనకొండ ప్రాంత మైనార్టీలకు కలగానే మిగిలిపోయిందని, ఇక ఆ విషయాన్ని మరిచిపోవడమేనని పలువురు బహిరంగంగానే అంటున్నారు. మండలంలోని దొనకొండ, కొచ్చెర్లకోట, వద్దిపాడు తదితర గ్రామాలలో దాదాపు 900 ముస్లిం కుటుంబాలు జీవిస్తున్నారు. వివాహ, ఇతర శుభకార్యాలు, సమావేశాలకు దొనకొండలో సరైన సౌకర్యం లేక అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. అధికార పార్టీ పాలకులు దొనకొండకు మంజూరైన షాదీఖానా నిర్మాణాన్ని ఐదేళ్లుగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేయడాన్ని ప్రజలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు.


షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి శిద్దా.. వేసిన శిలాఫలకం (ఫైల్)

షాదీఖానా నిర్మాణం టీడీపీతోనే సాధ్యం



దొనకొండ మండలంలోని ముస్లీం కుటుంబాలకు షాదీఖానా అవసరంను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం గుర్తించి షాదీఖానా మంజూరు చేసి శంఖుస్థాపన కార్యక్రమం చేపట్టింది. అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం విస్మరించి షాదీఖాన నిర్మాణం గూర్చి ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ముస్లీ మైనార్టీల పట్ల వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు నిదర్శనంగా ఐదేళ్లుగా వెక్కిరిస్తున్న షాదీఖానా శిలాఫలకం, పునాదులు అందుకు దర్పణం పడుతున్నాయి. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే షాదీఖాన నిర్మాణం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

- షేక్ తోహీద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు


పరీక్షలు చేస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

236 మంది పేదలకు ఉచిత కంటి పరీక్షలు

డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి స్పందన

కనిగిరి, ఫిబ్రవరి 18: కనిగిరి ప్రాంతంలోని పేదలకు కంటి చూపు ఇచ్చేందుకే టీడీపి ఇంచార్జి డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో నిరంతరాయంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కాజల్, శ్యామల్‌దీప్‌లు కంటి వైద్య పరిక్షలు చేశారు. 236మందికి కంటి వైద్య పరిక్షలు నిర్వహించగా, వారిలో 173 మంది కంటి ఆపరేషన్లు అవసరంగా డాక్టర్‌లు గుర్తించారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి శంకర కంటి ఆసుపత్రి ప్రత్యేక వాహనాల్లో తరలింపు ఏర్పాట్లు చేపట్టారు. మొదటి విడతగా 50మంది తరలించారు. రెండవ విడత ఈనెల 19న 60మంది, మూడవ విడతగా 20వ తేదీ 50మంది తరలించనున్నారు. కంటి వైద్య పరిక్షలకు కోసం వచ్చిన వారిని డాక్టర్ ఉగ్ర పేరు,పేరునా పలకరించారు. వైద్య శిబిరంలో టీడీపి శ్రేణులు, కార్యకర్తలు వాలంటీర్లుగా వివిధ సేవలు అందించారు.

టీడీపీ అభిమానికి నివాళి


నారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

దొనకొండ, ఫిబ్రవరి 18 : బ్రహ్మరావు పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త, అభిమాని అయిన పొడతెరపు నారాయణ(72) గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సభ్యుడు మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, సీనియర్ నాయకులు కామేపల్లి చెంచయ్య, వల్లపునేని వెంకటస్వామి, తోటా కోటేశ్వరరావు, దుగ్గింపూడి కోటేశ్వరరావు, షేక్ ముసామియా, షేక్ సుభాని, వల్లపునేని ఆదినారాయణ, వేగినాటి అల్లూరయ్య ఫణిదపు అనంతరాములు, పురుషోత్తం సత్యానందం, ఫణిదపు వీరాంజనేయులు, బత్తుల గాలయ్య, మరికొందరు బ్రహ్మరావు పేటలోని నారాయణ స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతిచెందిన నారాయణకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా కోటిరెడ్డి

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 : మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పసుపుగల్లు గ్రామానికి చెందిన మారం కోటిరెడ్డిని నియమిస్తూ దర్శి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పుట్లూరి కొండారెడ్డి ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొండారెడ్డి సూచించారు. కోటిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పీసీసీ అధ్యక్షులు షర్మిల కు, సెక్రటరీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి

పామూరు, ఫిబ్రవరి 18 : విశ్వజన హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ కమిటీ సభ్యులు జగదాభి మాల్యాద్రి, మాజీ వార్డు మెంబర్ జాజం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రామాంజనేయులు, యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

అందుబాటులో ఉండేందుకే కార్యాలయం

దొనకొండ, ఫిబ్రవరి 18 : గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకే వైసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వైసీపీ మండల ఇన్‌చార్జి రమణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉషామురళి, కృష్ణారెడ్డి, అంజనేయరెడ్డి, సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.


ముసలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సమీఉల్లా

ప్రాణం తీసిన గోతుల రోడ్డు

» ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి
» ఐదుగురికి గాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 : గోతుల రోడ్డు ఒకరి ప్రాణం తీసింది. మండలంలోని పోలవరం పంచాయతీ పరిధిలోని చంద్రగిరి వద్ద ముండ్లమూరు, తాళ్లూరు ప్రధాన రహదారిపై ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సంతనూతలపాడు గ్రామానికి చెందిన మార్పుడి ముసలయ్య(58) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని బొప్పూడివారిపాలెంలో పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేసి ఆటోలో తిరిగి స్వగ్రామం సంతనూతలపాడు వెళ్తుండగా ఆటో నడుపుతున్న ముసలయ్య చంద్రగిరి వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ముసలయ్య ఆటో కింద పడి మృతి చెందారు. ఆటోలో ఉన్న విస్తర వెంకట లక్ష్మి, పాలేటి మల్లేశ్వరి, బంగారమ్మ, దాసరి ఏసమ్మ, చీమకుర్తి మండలం పల్లామల్లికి చెందిన రమాదేవి, తేజశ్వరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరికి ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సనందించి మెరుగైన వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముసలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముసలయ్యకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. దర్శి సీఐ షేక్ సమీ ఉల్లా పరిశీలించి క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. వెంటనే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ యూ వెంకటకృష్ణయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర కిలో మీటర్ దూరం గోతులే

ముండ్లమూరు నుంచి తాళ్లూరు వెళ్లే ప్రధాన రహదారి అర కిలో మీటరు వరకు గోతులమయమైంది. ఆ గోతుల కారణంగానే ఆటో బోల్తా పడి ముసలయ్య మృతి చెందినట్లు ప్రయాణికులు చెప్తున్నారు. గోతుల్లో అదుపు చేయలేకే ఆటో బోల్తా కొట్టిందని, అదృష్ట వశాత్తు బయట పడ్డామని ఆటోలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు బంగారమ్మ, వెంకట లక్ష్మి తెలిపారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

దర్శి, ఫిబ్రవరి 18 : లోక్ అదాలత్‌ను ప్రజలు వినియోగించుకోవాలని దర్శి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ ఎస్ శివశంకరరెడ్డి కోరారు. సుప్రీం, హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు పర్యవేక్షణలో వచ్చేనెల 9వ తేదీన దర్శిలో అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేసుల్లో రాజీ చేసుకొని సత్వర న్యాయం పొందాలని సూచించారు. అదాలత్‌లో రాజీపడినట్లు అయితే ఇరువర్గాలు విజయం సాధించినట్లే అన్నారు. ఇక్కడ పరిష్కరించుకున్న కేసులపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని, సమస్యలకు శాంతియుత పరిష్కారం లభిస్తుందన్నారు. అధిక కేసులు రాజీ అయ్యేందుకు న్యాయవాదులు తమవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.రవీంద్ర చెన్నకేశవులు, మంజుల, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ఎంఈ సంఘ నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఉద్యోగులు

కనిగిరి, ఫిబ్రవరి 18: పీఆర్ఎంఈ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం నూతన సమితి అధ్యక్షుడు ఖాజా రహమత్ బాషా అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఆదివారం కనిగిరి సమితి పీఆర్ఎంఈ సంఘ నూతన కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా రహమత్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగులంతా ఐక్యతతో ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సంఘ ఉపాధ్యక్షునిగా జీ పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా పీ గురుప్రసాద్, నలుగురితో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా షేక్ రహిమాన్, సహాయ ఎన్నికల అధికారిగా తిరుపాలు, జడ్పీ ఒంగోలు వారు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృష్ణంరాజు, ఏపీఎన్జీవో కనిగిరి అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ఆరు మండలాల సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మేజర్ కాలువ మురుగుమయం

» కంపుకొడుతున్న వైనం » ఆక్రమణతో మైనర్‌లు కనుమరుగు
» అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

దర్శి, ఫిబ్రవరి 18 : సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరు అందించే మేజర్, మైనర్ కాలువలు మురికి కాలువలుగా మారుతున్నాయి. ఆలనా, పాలనా పట్టించుకునే వారే లేకపోవడంతో కాలువలు రూపురేఖలు కోల్పోతున్నాయి. దర్శి పట్టణ పరిసరాల్లో ఉన్న తూర్పువీరాయపాలెం మేజర్ కాలువ, దర్శి మైనర్ కాలువలు ఆక్రమణలతో కుచించుకుపోవడమే కాక గృహాల్లోని మురికి నీరు కాల్వల్లోకి మళ్లించడంతో కంపు వెదజల్లుతున్నాయి. దర్శి మేజర్ కాలువలోకి అనేక చోట్ల మురికి నీటి కాలువలను నేరుగా మళ్లించారు. ప్రస్తుతం కాలువలో మురికి నీరు, చెత్త నిల్వ చేరడంతో కంపు వెదజల్లుతున్నాయి. ఎన్ఎస్‌పీ అధికారులు కాలువల ఆక్రమణలను, అధ్వానంగా మారుతున్న పరిస్థితిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే కొంత కాలానికి మేజర్, మైనర్ కాలువలు ఆక్రమణలతో కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.


మేజర్ కాలువలోకి మళ్లించిన మురుగు నీరు

టీడీపీ విజయానికి కృషి చేయండి

» మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
» కొనసాగుతున్న వలసల పరంపర


డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వంగపాడు ఎస్సీ కుటుంబాలు

కనిగిరి, ఫిబ్రవరి 18: నూతనంగా పార్టీలో చేరిన వారు తెలుగుదేశం పార్టీ అఖండ విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, సత్యం ఆధ్వర్యంలో వంగపాడు గ్రామానికి చెందిన ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని గట్టి నిర్ణయానికి వచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయబావుటా ఎగరడం ఖాయమన్నారు. వైసీపీ అరాచక పాలన, వేధింపులు భరించలేక టీడీపీలోకి వస్తున్న వారంతా తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం అందరం పాటుపడాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌రెడ్డి ఐదేళ్ల అవినీతి, దోపిడీ, అరాచక, విధ్వంస పాలనను ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉగ్ర సూచించారు. చంద్రబాబు ఎస్సీలకు సముచిత స్థానం ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్సీల ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి వారిపై దాడులు చేయడంతోపాటు నిలువునా మోసగించారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీల దెబ్బ చూపించాలన్నారు. కార్యక్రమంలో మన్నేపల్లి సుశీలరావు, నారాయణ, సాల్మన్, రవి, లోకేష్, చిన్నా, పోలయ్య యాకోబు, గిడీను తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి.

నుచ్చుపొదలో వైసీపీని వీడిన 15 కుటుంబాలు

పామూరు : గ్రామాలపై ప్రేమ లేని పాలకులు మనకు అవసరం లేదని మీరంతా రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆరేకొండహరి ప్రసాద్, కౌలూరి రహంతుల్లా, బూత్ కమిటీ ఇన్‌చార్జి చంటి ఆధ్వర్యంలో సుమారుగా 15 కుటుంబాలు వైసీపీ ని వీడి ఉగ్ర సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు, వారందరికీ ఉగ్ర పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పందిటి వెంకటేశ్వర్లు, మెడబలిమి నారాయణ, ఎం.రామారావు, చినవెంకటస్వామి, రామ్‌ప్రసాద్, కొలనీడి మాలకొండయ్య, కోలా శ్రీనివాసులు, ఎం.నరసింహులు, కే వెంకటరమణయ్య, అజయ్, అనిల్, ఎన్.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ తన గెలుపునకు కష్టపడి పనిచేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ నాయకులు, ఎం.గంగరాజుయాదవ్, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, మాజీ సింగిల్ విండో చైర్మన్‌లు బీ జయరామిరెడ్డి, బీ నారాయణరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హుసేన్‌రావుయాదవ్, షేక్ ఖాజారహంతుల్లా, పాలపర్తి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి శ్రీనివాసులు, షేక్ షరీఫ్, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, ముబినా, పోకా నాయుడు, ఎం వెంకట్రావు, మెంటా నరసింహారావు, దేవరపు మాల్యాద్రి, కౌలూరి హనీఫ్, సూర్య పాల్గొన్నారు.

మనోహర్ రావడం ఆనందంగా ఉంది

పామూరు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మనోహర్ టీడీపీలోకి రావడం శుభపరిణామమని, రానున్న ఎన్నికల్లో పట్టణంలో టీడీపీకి తిరుగులేని ఆదరణ లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఉగ్ర అన్నారు. పద్మావతి అతిథి గృహంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు డీవీ మనోహర్, కుమారుడు మహి వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఉగ్ర కండువాలు కప్పి ఆహ్వానించారు. ఉగ్ర మాట్లాడుతూ మనోహర్ వ్యక్తిగత ప్రయోజనాల కన్నా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. వైసీపీ పాలనలో ఆర్యవైశ్యులు తీవ్రంగా నష్టపోయారని, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అడుగుజాడలో తాను నడిచానన్నారు. తన హయాంలోనే సీఎస్‌పురం రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చామని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులకు ఏకష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఉగ్ర భరోసా ఇచ్చారు. మనోహర్ మాట్లాడుతూ వైసీపీ విధానాలు నచ్చక గతంలో పార్టీ పదవికి రాజీనామా చేశానని, ఇప్పుడు పార్టీని వీడి ఉగ్ర విజన్ నచ్చి టీడీపీలో చేరానన్నారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, బీ జయరామిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, ఇర్రి కోటిరెడ్డి, గౌస్‌బాష, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన నుచ్చుపొద వాసులు, మనోహర్‌కు కండువా కప్పుతున్న ఉగ్ర


మాట్లాడుతున్న పరిటాల

దళితుల కోసం పోరాడేది టీడీపీనే

తాళ్లూరు, ఫిబ్రవరి 18 : దళితుల కోసం నిరంతరం పోరాడుతూ టీడీపీ అండగా నిలుస్తున్నదని పార్టీ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ప్రతి పల్లెకు టీడీపీ ప్రజా యాత్ర దోసకాయలపాడులో నాయకులు నల్లపాటి సత్యం, సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సురేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అక్రమంగా, అడ్డదారుల్లో గెలవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందన్నారు. గ్రామాల్లో ప్రజలంతా ఒక్కటై వైసీపీ నేతల ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. జగన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచీ ఎస్సీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను దారిమళ్లించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, అందరి బాగు కోసం టీడీపీని గెలిపించుకోవాలన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో నిత్యావసరాల ధరలతోపాటు కరెంట్, బస్సు చార్జీలు పెరిగాయన్నారు. ఇవిచాలక పన్నులతో పేదల నడ్డివిరిచారన్నారు. సంతోషకరంగా జీవనం సాగించేందుకు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీను, హరి గ్రామస్థులు పాల్గొన్నారు.

హీరో తారకరత్నకు నివాళి


తారకరత్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 : ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్‌లో స్వర్గీయ ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సినీ నటుడు, టీడీపీ నాయకుడు నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు, అభిమానులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, వీరపనేని వీరనారాయణ, పవన్ కుమార్, వీరపనేని సుబ్బారావు, చంద్రమౌళి, వెంకటరావు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



తాళ్లూరు, ఫిబ్రవరి 18 : పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా చూడాలని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. గంగమ్మ తల్లిని భక్తులు దర్శించుకోగా, పలువురు వాహన పూజలు చేయించారు. మరి కొందరు భక్తులు గంగమ్మతల్లికి విరాళాలు సమర్పించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్. కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పొంగళ్లు నివేదించారు. ముండ్లమూరు, పోలవరం, శంకరాపురం, పసుపుగల్లు, బొప్పూడివారిపాలెం, నూజెండ్లపల్లి, కెల్లంపల్లి గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

జనసేన పార్టీ అధ్యక్షుడిగా రత్నకిషోర్


రత్నకిషోర్‌ను అభినందిస్తున్న శ్రేణులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 : మండలంలోని పెద ఉల్లగల్లు జనసేన పార్టీ అధ్యక్షుడిగా మంచు రత్న కిషోర్‌ను ఎన్నుకున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోటా రామారావు తెలిపారు. ఆదివారం దర్శిలోని పార్టీ కార్యాలయంలో రత్న కిషోర్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పై నమ్మకంతో గ్రామ పార్టీ అధ్యక్షునిగా నియమించినందుకు అధినేత పవన్ కల్యాణ్, దర్శి ఇన్‌చార్జి బొటుకు రమేష్ బాబు, నియోజక వర్గ జనసేన నాయకుడు గరికపాటి వెంకట్‌కు, గిరిశాల ఏసురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా తప్పెట వెంకటరావును నియమించినట్లు తెలిపారు.

గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద పెద్ద ఎత్తున నిల్వలు ఉన్న హద్దు రాళ్లు



గుదిబండలు!

- గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులకు భారంగా జగనన్న భూరక్ష హద్దురాళ్లు
- గతంలో ఒత్తిడి తెచ్చి మరీ రాళ్లను తయారు చేయించిన అధికారులు
- ఇప్పుడు తయారు చేసిన రాళ్లు కొనే నాథుడు కరువు
- 10 లక్షల పైబడి హద్దు రాళ్ల నిల్వలు
- ఎపీఎండీసీని నమ్ముకొని తీవ్రంగా నష్టపోయామని యజమానుల ఆవేదన

బల్లికురవ, ఫిబ్రవరి 18: గ్రామాల్లో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం ద్వారా పంట భూములను సర్వే చేసి వాటికి హద్దులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. సర్వే అనంతరం భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేసేలా గ్రానైట్ ఫ్యాక్టరీల్లో హద్దురాళ్లు తయారు చేయించింది. ఇప్పుడు ఈ భూరక్ష హద్దు రాళ్లే ఫ్యాక్టరీ యజమానులకు గుదిబండలా మారాయి. యజమానులు సొంతగా పెట్టుబడి పెట్టి లక్షలు వెచ్చించి తయారు చేసిన రాళ్లను ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. దీంతో ఎక్కడ చూసినా హద్దు రాళ్ల నిల్వలు పెద్దఎత్తున ఉన్నాయి. ఈ విషయాన్ని అధికార్ల దృష్టికి తీసుకు వెళుతున్నా ఎవరు పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం వస్తే సర్వే రాళ్లను వారు కొనుగోలు చేయరని అప్పుడు తాము తీవ్రంగా నష్టపోతామని వారు గగ్గోలు పెడుతున్నారు.

బెదిరించి మరీ టార్గెట్లు..

బల్లికురవ, మార్టూరు మండలాల్లో ఉన్న సుమారు వంద లాది గ్రానైట్ ఫ్యాక్టరీ కటింగ్ మిషన్ల ద్వారా ప్రభుత్వం హద్దు రాళ్లను తయారు చేయించింది. మొదట్లో తమకు గిట్టుబాటు కాదని యజమానులు అడ్డం తిరిగినా అధికారులతో బెదిరించి వారికి టార్గెట్లు విధించారు. దీంతో వారంతా పెట్టు బడులు పెట్టి రాళ్లపై పేర్లు నమోదు చేసి తయారు చేశారు. ఇలా కొన్ని లక్షల రాళ్లను తయారు చేశారు వాటిపై 2020 ఏడాది అంటూ పేరు నమోదు చేయించారు. ఒక్కో రాయికి ఫ్యాక్టరీ యజమానులకు ఆంధ్రప్రదేశ్ మినరల్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా రూ.300 వంతున చెల్లించారు. మొదట్లో కొంత ఆలస్యం అయినా నగదు ఇచ్చారని ఇప్పుడు గత ఆరు మాసాల నుంచి తాము తయారు చేసిన హద్దు రాళ్లను అసలు కొనుగోలు చేయటం లేదని యజమానులు చెబుతున్నారు. బల్లికురవ, మార్టూరు మండలాల్లో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలలో సుమారు పది లక్షల పైచిలుకు హద్దు రాళ్ల నిల్వలు ఉన్నాయని యజమానులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టు పొందిన వారు తమకు సకాలంలో నగదు చెల్లింపులు చేయటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూసర్వే కమిషనర్ కార్యాలయాన్ని, ఎపీఎండీసీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించినావారు ఒకరిపై ఒకరు చెప్పుకొం టున్నారని తెలిపారు. ఇవి హద్దు రాళ్లకు తప్ప ఎందుకు పనికి రావని, ముందు ముందు వీటని ఏం చేయాలని, ఫ్యాక్టరీలలో తమ పనులకు కూడా అడ్డంకిగా ఉన్నాయని వారు అంటున్నారు.





బల్లికురవలో మూతబడిన హద్దు రాళ్ల తయారీ కోసం ఏర్పాటు చేసిన ఫాక్టరీ



బల్లికురవలో మూతపడిన ఎపీఎండీసీ ఫ్యాక్టరీ

వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు హద్దు రాళ్ల తయారు చేసి పంపేందుకు కోట్లు వెచ్చించి ప్రభుత్వం బల్లికురవలో రెండేళ్ల క్రితం కటింగ్ మిషన్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. మెదట్లో ఇక్కడ నుండి వేల సంఖ్యలో రాళ్ల తయారు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేశారు. గత ఆరు నెలల నుంచి ఈ ఫ్యాక్టరీలో పనులు నిలిచిపోయాయి. సర్వే పనులు మందగించటం వలనే కోట్ల పెట్టుబడులు పెట్టిన ఏపీఎండీసీ కార్పొరేషన్ ఫ్యాక్టరీ కూడా మూతపడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మైనింగ్ అధికార్లను బెదిరించి జగనన్న భూరక్షణ పథకంలో హద్దు రాళ్లను తమతో తయారు చేయించిందని ఓ ఫ్యాక్టరీ యజమాని తెలిపారు. ప్రభుత్వం మారితే ఈ రాళ్లతో తమకు తీవ్ర నష్టాలు తప్పవని పేర్కొన్నాడు.



అందని.. అల్పాహారం

- పది విద్యార్థులకు అల్పాహార నిధులు లేనట్లేనా !
- హెచ్‌ఎంలు, ఎమ్మెల్సీ విజ్ఞప్తులు బుట్టదాఖలు చేసిన జడ్పీ పాలకవర్గం
- నెల గడుస్తున్నా నిధులు విడుదల చేయని వైనం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి18: నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖల్ని ఎటూ మార్చలేదు.. కనీసం పది విద్యార్థులకు పరీక్షల సమయంలో అల్పాహారం అందించడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదు. అల్పాహారం కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం వినతిపత్రాలు ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా జడ్పీ పాలక వర్గం పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయి డెడ్, మున్సిపల్ పాఠశాలల్లో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దాదాపు 40వేలకు పైగా ఉన్నారు. మార్చిలో జరిగే పరీక్షలకు ఆయా విద్యార్థులకు ఏటా డిసెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభం అవుతాయి. మధ్యాహ్న 12 గంటలకు పాఠశాలలో భోజనం పెడతారు. తరువాత సాయంత్రం దాదాపు 7 గంటల వరకు పాఠశాలలోనే పది విద్యార్థులు ఉం డాలి. ఈ సమయంలో వారు పాఠశాలలో ఆక లితో అలమటించాల్సిందే. ఈ నేపథ్యంలో పేద, దిగువ మధ్యతరగతికి చెందిన వారికి అల్పాహారం అందించడానికి ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాట్లు చేస్తోంది.

అప్పట్లో అలా... ఇప్పుడిలా..

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థికి రూ.7 నుంచి రూ.10 చొప్పున నిధులు మొత్తం దాదాపు రూ.35లక్షల కు పైగా ఏటా విడుదల చేసేవారు. గత ప్రభుత్వాల హ యాంలో దాదాపు మూడునెలల ముందే అల్పాహారం కోసం నిధులు విడుదల చేయడంతోపాటు దాతల నుంచి మరికొంత సొమ్ము సమకూరేలా ఏర్పాట్లు చేసేశారు. ఫలితంగా విద్యార్థుల కు రోజు సాయంత్రం ఇడ్లీ, ఉప్మా, ఉడికించిన వేరుశనగలు, గుగ్గిళ్ళు వంటి అల్పాహారం, అరటి, జామ తదితర పండ్లు అందించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పరీ క్షలకు నెలరోజు ముందు నుంచే అల్పాహారం పంపిణీ చేసేలా నిబంధనలు మార్చారు. దీనికి నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి పాఠశాల గ్రాంట్ నుంచి వాడుకోవాలని, తరువాత నిధులు విడుదల చేస్తామని చెబుతూ వచ్చారు. ఈ ఏడాది పాఠశాల గ్రాంట్ కూడా సక్రమంగా పాఠశాలల కు విడుదల చేయకపోవడంతో హెచ్‌ఎంలు అల్పా హారం పంపిణీ విషయంలో చేతులెత్తేశారు. ఫలితంగా విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ తరగతులకు హాజరు కావాల్సి వస్తోంది.

రెంటికిచెడ్డ రేవడిలా మున్సిపల్ విద్యార్థుల పరిస్థితి...

మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ నుంచి అల్పాహారం కోసం నిధులు విడుదల అయ్యేవి. దాతలు, మున్సిపల్, కార్పొషన్ నిధులు కలిపి ఒక్కో విద్యార్థికి రూ.10 నుంచి రూ.20 వరకు విడుదల చేసే వారు. అయితే ఈ ఏడాది మున్సిపల్, కార్పొరేషన్ పరిధి నుంచి పాఠశాలల్ని తొలగించి ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో ఈ విద్యార్థుల కు అటు ప్రభుత్వం నుంచి కానీ ఇటు కార్పొరేషన్, మున్సిపల్ స్కూల్స్ నుంచి నిధులు విడుదల కావడం లేదు. రెంటికి చెడ్డ రేవడిలా విద్యార్థుల దుస్థితి తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అల్పాహారం కోసం నిధులు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వచ్చేది జనసేన, టీడీపీ ప్రభుత్వమే

- వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు
- జనసేన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అనగాని , గాదె, బోనబోయిన



జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అనగాని, ముమ్మనేని, గాదె, బోనబోయిన తదితరులు

రేపల్లె, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో రానున్నది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం రేపల్లె పదో వార్డులో జనసేన పార్టీ కార్యాలయంతో పాటు పలు వార్డుల్లో జనసేన పార్టీ జెండా దిమ్మలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని ముఖ్యమంత్రి పదవి చేపట్టిన జగన్ ప్రజలను నట్టేట ముంచారన్నారు. వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు బతికే పరిస్థితి లేదన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అహంకారానికి, వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు జనసైనికులు, యువతరైతులు, ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల తర్వాత వైసీపీ జెండా కనుమరుగేనన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో కనీసం ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చెయ్యలేదన్నారు. కనీసం రహదారులను కూడా అభివృద్ధి చెయ్యలేని పరిస్థితి నెలకొందన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధిలో రాష్ట్రం ముప్పై ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. అప్పుల కుప్పగా మార్చి పెన్షనర్లకు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేనట్లుగా రాష్ట్రాన్ని తయారు చేశారన్నారు. ప్రజలు దీనిని గమనించాలన్నారు. రాష్ట్రంలో 50892 ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే 6100కు నోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికల సమయంలో జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన పట్టణ, రూరల్ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్, రేపల్లె జానకిరామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధర్‌రావు, దేవగిరి శంకర్, తెలుగుయువత నాయకులు కొలసాని రా ము, పూషడపుకుమారస్వామి, తాతా ఏడుకొండలు, నల్లపాటి యల్లయ్య, ఎంపీటీసీ బొర్రా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా నిలిచిన ధ్యానబుద్ధ ప్రాజెక్టు భవనం



డైయేరియా


- నాలుగుకు చేరిన మృతులు
- గుంటూరులో అదుపులోకి రాని వైనం
- అడుగడుగునా తాగునీటి పైపులకు లీకులు
- ఇప్పటికీ మురుగునీటి డ్రెయిన్లలోనే నీటి పైపులైన్లు



గుంటూరు(మెడికల్) ఫిబ్రవరి 18: గుంటూరు నగరంలో రెండు వారాలుగా డయేరియాను నియంత్రించడంలో నగర పాలక సంస్థ విఫలమైంది. ఫలితగా ఆదివారం మరో ప్రాణం బలైంది. శ్రీనగర్‌కు చెందిన గాజుల సూర్యనారాయణ(75) మృతి చెందారు. ఇప్పటికే ముగ్గురు మృతి చెందగా సూర్యనారాయణ మృతితో ఆ సంఖ్య నాలుగుకు చేరింది. మరో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఇంతా జరుగుతున్నా, జిల్లా యంత్రాంగం అతిసార నియంత్రణలో మొద్దునిద్రలో ఉందనే విమర్శలు వస్తున్నాయి. డయేరియా వెలుగు చూసిన తర్వాత.. ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు సమీక్షలు జరిపి హడావిడి చేశారు. రెండు రోజుల్లో పరిస్థితి పూర్తి అదుపులోకి వస్తుందని ప్రకటించారు. అయితే సమీక్షలు ముగిసిన వారం దాటినా పరిస్థితి మరింత దిగజారింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని గుంటూరులోనే ఉంటున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. అధికారుల మధ్య సమన్వయం కొరవడమే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి.

నీటి కాలుష్యమే కారణమని తెలిసినా..

ప్రధానంగా కార్పొరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో కలుషితమే అతిసారానికి కారణమని స్వయంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులే అనుమానం వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో మంచినీటి పైపులు ఉన్నాయి. డయేరియా ప్రబలిన అనంతరం ఆయా పైపులైన్లను మరమ్మతు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించినా సమస్య తీవ్రత తగ్గలేదు. మరో పక్క సమస్యను పక్కదారి పట్టించేలా అధికారులు వ్యవహరిస్తున్నారనే వాదనలున్నాయి. అతిసారం ప్రబలిన పలు ప్రాంతాల్లో నీటి నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాల నిర్ధారణకు పంపారు. నాణ్యత ప్రమాణాలపై ల్యాబ్ ఇచ్చిన నివేదికలను తొక్కిపెట్టిన అధికారులు, డయేరియాకు ఏమాత్రం సంబంధం లేని పానీపూరిని తెరపైకి తెచ్చారు. నగరంలో పానీపూరి బండ్లను నిషేధించాలని ప్రాంతీయ నీటి పరిశోధనశాల నిపుణులు నివేదిక ఇచ్చినట్లు ప్రకటించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యను పక్కదారి పట్టించడమేనని ఆరోపించారు. ఇదేరీతిలో మినరల్ వాటర్ ప్లాంట్లలో నీరు తాగి బాధితులు డయేరియా బారిన పడి ఉంటారనే అనుమానం వ్యక్తం చేస్తూ మరో పసలేని వాదన తెరపైకి తెచ్చారు. కలుషిత సమస్యకు ప్రధాన కారణమైన నీటి పైపుల లోపాలను సవరించే ప్రక్రియ మాత్రం పెద్దగా జరగడం లేదు.



మృతి చెందిన సూర్యనారాయణ



శారదా కాలనీ రిజర్వాయర్ వద్ద నీటి శాంపిల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కమిషనర్ కీర్తి

అసంపూర్తిగా.. ధ్యానబుద్ధ

- జేతవనంలో అసాంఘిక కార్యకలాపాలు
- మేకలు, గొర్రెలకు నిలయంగా పరిసరాలు
- ప్రాజెక్టుపై కన్నెత్తి చూడని మంత్రి నాగార్జున
- టీడీపీ శంకుస్థాపన.. వైసీపీ హయాంలో నిలిచిన పనులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 18: బౌద్ధ ఆరామంగా వెలుగొంది.. పర్యాటకంగా ఎంతో విశిష్టత పొందిన ప్రాంతమది. ఆ ప్రాంతం ప్రస్తుతం ఎవరికీ పట్టకుండా, మందుబాబులకు నిలయంగా, వ్యర్థాలతో దుర్గంధభరితంగా మారింది. అయినా పాలకులు, అధికారుల్లో చలనం లేదు. గౌతమ బుద్ధుని ధాతువులపై నిర్మితమై బుద్ధుడు నడయాడిన భట్టిప్రోలు బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు టీడీపీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ప్రాజెక్టుకు జేతవనంగా నామకరణం చేశారు. బౌద్ధ స్థూపం వెనుక ఉన్న రెండు చెరువుల మధ్యలో రూ.60 లక్షలతో 40 అడుగుల ధ్యానబుద్ధ విగ్రహ నిర్మాణం, మ్యూజియం, లైబ్రరి, పర్యాటకులకు వసతి సౌకర్యం కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. 2016లో ప్రాజెక్టుకు అప్పటి మంత్రి స్థానిక ఎమ్మెల్యే ఆనంద బాబు శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనులు కొనసాగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా పనులు నిలిచిపోయాయి. ఐదేళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా జేతవనం ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఎందుకు పనులు నిలిచిపోయాయో, పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయో, అసలు ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున జేతవనం ప్రాజెక్టు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. స్థానిక ఎమ్మెల్యే మంత్రి పదవి పొందినా ప్రాజెక్టు పనులు ప్రారంభించలేదని, అసలు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్తులు, పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం మేకలు, గొర్రెలకు నిలయంగా మారింది. వ్యర్థాలతో ప్రాంగణం నిండి దుర్గంధం వెదజల్లుతుంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే మందుబాబులు భవనంపైకి ఎక్కి మద్యం తాగి ఆ సీసాలను అక్కడే పడవేస్తున్నారు.

ప్రాజెక్టు నిరాదరణ



భట్టిప్రోలు బౌద్ధస్థూపం చారిత్రక సంపదగా ఖ్యాతి గడించింది. అమరావతి తర్వాత అతి పెద్ద స్థూపం ఇదే. బుద్ధ భగవానుడు ఇక్కడ నుంచే ప్రపంచానికి శాంతి సందేశాన్ని, బోధనలను విస్తరింపజేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇంతటి చారిత్రక సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రాజెక్టుకు శంకుస్థాపనతో ఎంతో ఆనందించాం. ఐదేళ్లుగా ప్రాజెక్టుకు ఆదరణ లేకపోవడంతో ఆశలు ఆవిరయ్యాయి. పనులు త్వరితగతిన ప్రారంభించాలి.

- ముద్దా లీలామోహనరావు, విశ్రాంత తెలుగు పండిట్, భట్టిప్రోలు

బుద్ధుని ధాతువులపై నిర్మితమైన భట్టిప్రోలు బౌద్ధస్తూపం





ప్రాంగణంలో మద్యం సీసాలు, గ్లాసులు, వ్యర్థాలు

ఇసుక తవ్వకాలపై.. నిరసన

- గుండిమెడ క్వారీలో భారీ గోతుల గుర్తింపు
- టీడీపీ జనసేన నేతల రాకతో పొదల్లోకి యంత్రాలు



ఇసుక క్వారీలో భారీ గుంత వద్ద టీడీపీ జనసేన నేతలు

తాడేపల్లి, ఫిబ్రవరి 18: ఐదేళ్లలో 50 కోట్ల టన్నుల ఇసుకను బొక్కేశారు.. అక్రమ తవ్వకాలతో గుంతలు ఏర్పడి ఏంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.. అంటూ అక్రమ ఇసుక తవ్వకాలపై తాడేపల్లి మండలం గుండిమెడ ఇసుక క్వారీలో ఆదివారం టీడీపీ, జనసేన నేతలు నిరసన తెలిపారు. క్వారీలో భారీగా తవ్వేసిన గుంతలను, ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. నేతల రాక సమాచారంతో ఎక్స్‌కవేటర్, లారీలను, ట్రాక్టర్లను నిర్వాహకులు ముళ్లపొదల్లో దాచేశారు. అయినా వాటిలో కొన్నింటిని టీడీపీ జనసేన నేతలు గుర్తించారు. కృష్ణానదిలో సుమారు 5 కిలోమీటర్ల పొడవున ఇసుక అక్రమ తవ్వకాలను వారు పరిశీలించారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని, ఇసుక దొంగలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య, అమరా సుబ్బారావు, కొమ్మారెడ్డి కిరణ్, జనసేన నేత సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.1000కి దొరికితే నేడు అది రూ.5 వేలైందన్నారు. అధికారులు ఎందుకు నిద్ర నటిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, వల్లభనేని వెంకట్రావు, కేశంనేని శ్రీఅనిత, కొల్లి శేషు, కాట్రగడ్డ మధు, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


సభ జరుగుతున్న సమయంలో ఖాళీగా కుర్చీలు (ఇన్‌సెట్లో) రెండు గ్రూపుల నాయకులతో మాట్లాడుతున్న బాలినేని

కొండపి వైసీపీలో బహిర్గతమైన వర్గ విభేదాలు

● వైఎస్‌ఆర్ విగ్రహావిష్కరణకు దూరంగా అశోక్‌బాబు వర్గీయులు

● హాజరుకాని వరికూటి, తాటిపర్తి, మాదాసి

సింగరాయకొండ, ఫిబ్రవరి 18 : నియోజకవర్గ వైసీపీలో మరోమారు వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆదివారం శానంపూడి రోడ్డు ఎదురుగా జాతీయ రహదారి పక్కనే నిర్వహించిన వైఎస్‌ఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జులు మాదాసి వెంకయ్య, వరికూటి అశోక్‌బాబు, వైపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో తొలి నుంచి గ్రూపు తగాదాలు నెలకొనడంతో తాజాగా వెంకయ్య, ఆ తర్వాత అశోక్ కుమార్‌ను కాదని కొత్తగా మంత్రి సురేష్‌ను ఇన్‌చార్జిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఇదిలా ఉండగా, రాష్ట్ర వైసీపీ వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మించిన ఆర్బీ, వైఎస్‌ఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి వరికూటి డుమ్మా కొట్టారు. ఈ కార్యక్రమానికి వరికూటి అభిమానులు, ఆయన్ను అనుసరించే నాయకులు, ముఖ్యంగా స్థానిక ముస్లింలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సింగరాయకొండకు చెంది వైపాలెం ఇన్‌చార్జిగా ఉన్న తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఆహ్వానం ఉన్నా ఆయన కూడా మోహం చాటేశారు. తాను వైపాలెంలో నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మంత్రి సురేష్ ఒక్కసారి కూడా చంద్రశేఖర్‌కు మద్దతుగా అక్కడ ఆయనతో పాటు పర్యటించలేదు. దీంతో ఆయన ఇన్‌చార్జిగా ఉన్న నియోజకవర్గంలో నిర్వహిస్తున్నా కార్యక్రమానికి తాటిపర్తి పాల్గొనకుండా దూరంగా ఉన్నట్లు చర్చనడుస్తోంది. కాగా పూర్తిగా పార్టీ కార్యక్రమైనప్పటికీ వైసీపీ మండల అధ్యక్షుడైన సామంతుల రవికుమార్‌రెడ్డిని స్టేజీ మీదకు ఆహ్వానించినా ఆయన కింద కుర్చీలోనే కూర్చుండిపోయారు.

రెండుసార్లు గ్రూపు తగాదాల వల్లే ఓడాం : బాలినేని

సభలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండుసార్లు వైసీపీలో ఉన్న గ్రూపు తగాదాల వలనే పార్టీ అభ్యర్థులు ఓడిపోయారని చెప్పారు. పార్టీలో ఉండి పార్టీకి ద్రోహం చేయకూడదని వైఎస్‌ఆర్ చెప్పిన మాటను శ్రేణులు గుర్తుంచుకోవాలని సూచించారు. డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డికి గతంలో పార్టీలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, అందర్నీ కలుపుకొని పోవాలని సూచించారు. దీనిపై అశోక్ స్పందిస్తూ ఇకపై తాను మండలంలో నాయకత్వం, పెత్తనంకాని చేయబోనని చెప్పారు.

అద్దంకి ఎమ్మెల్యే కారు బోల్తా

బెలూన్‌లు తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

మరో కారులో హైదరాబాద్ వెళ్లిన రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 18 : అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఆయన సురక్షితంగా బయటపడ్డారు. అందిన సమాచారం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం అద్దంకిలో పలు కార్యక్రమాలకు హాజరైన రవికుమార్ అనంతరం విజయవాడ వెళ్లి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ నుంచి 3.30 గంటల సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరారు. సాయంత్రం 6 గంటల సమయంలో సూర్యాపేట వద్ద కారు ప్రమాదానికి గురైంది. బెలూన్‌లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న రవికుమార్, గన్‌మన్, డ్రైవర్ క్షేమంగా బయటపడ్డారు. ముందు వెళ్తున్న వాహనం ఒక్కసారిగా స్లో కావడంతో దాన్ని తప్పించే క్రమంలో ఎమ్మెల్యే కారు బోల్తా పడినట్లు తెలుస్తోంది. వెంటనే మరోకారులో రవికుమార్ హైదరాబాద్ వెళ్లారు. ఎమ్మెల్యే కారు ప్రమాదానికి గురైనట్లు తెలిసిన వెంటనే అద్దంకి నియోజకవర్గ టీడీపీ శ్రేణులు, అభిమానులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఆయన ఎలాంటి గాయాలు లేకుండా క్షేమంగా బయటపడ్డారని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు.

12 ఎయిడెడ్ స్కూళ్ల మూసివేత!

● ఇప్పటికే ఒక హైస్కూల్‌కు తాళం

● మరో 11 పాఠశాలలకు నోటీసులు

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 18 : జిల్లాలో 12 ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఒక ఎయిడెడ్ హైస్కూల్‌కు తాళం పడింది. మరో 11 పాఠశాలలను ఎందుకు మూసి వేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని యాజమాన్యాలకు డీఈవో నోటీసులు ఇచ్చారు. జిల్లాలో నాలుగు హైస్కూళ్లు, ఏడు ప్రాథమిక పాఠశాలలు ఆ జాబితాలో ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. 2022-23 విద్యా సంవత్సరంలో విద్యార్థులు లేని (జీరో ఎన్‌రోల్‌మెంట్), 10 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను గుర్తించాలన్నారు. వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకొని మూసివేతకు చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పాఠశాల విద్య ఆర్జేడీ, డీఈవోలను ఆదేశించారు. జిల్లాలో గత విద్యా సంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్, పది మంది లోపు ఉన్న పాఠశాలున్న 12 పాఠశాలను గుర్తించారు. వీటిల్లో తొమ్మిది చోట్ల జీరో ఎన్‌రోల్‌మెంట్, ఒక్క పాఠశాలలో ఒకరు, మరో స్కూల్‌లో ఎనిమిది మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఒంగోలు స్టేషన్ రోడ్డులోని సమావేశం హైస్కూల్‌లో పిల్లలు ఒక్కరు కూడా లేకపోవడంతో దాన్ని ఇప్పటికే మూసివేశారు. కొమరోలు మండలం గోవరపల్లిలోని ఏబీఎం పాఠశాలలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్నారు. మార్కాపురం పదో వార్డులోని శారదా ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నారు. ఒంగోలు గద్దలగుంటలోని హెచ్‌ఏ ఎయిడెడ్ పాఠశాల, కొమరోలు మండలం నల్లగుంట ఎయిడెడ్ స్కూలు, గిద్దలూరు ఏపీజీ ఎలిమెంటరీ స్కూలు, కనిగిరిలోని ఏబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, దొనకొండ మండలం ఒబ్బాపురం ఎయిడెడ్ పాఠశాల, వైపాలెం డీఎంఎస్ బీసీ బాలికల హైస్కూలు, గిద్దలూరు శ్రీవివేకానంద హైస్కూలు, కొమరోలు మండలం నల్లగుంట్ల ఎయిడెడ్ హైస్కూలు, ఒంగోలు జీవీఎస్ హైస్కూలులో ఒక్క విద్యార్థి కూడా లేరు. దీంతో ఈ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పటికే అవసరం ఉన్న ఇతర చోట్ల సర్దుబాటు చేసి మాతృపాఠశాలల నుంచి జీతాలు చెల్లిస్తున్నారు. ఇకపై ఇవి పూర్తిగా మూతపడనున్నాయి.

నీచ రాజకీయాల గురించి చంద్రబాబు మాట్లాడటం విడ్డూరం

● చీరాల ఎమ్మెల్యే కరణం


మాట్లాడుతున్న బలరాం

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : నీచ రాజకీయాల గురించి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని చీరాల శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఇంకొల్లు సభలో తన పట్ల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరినీ రోడ్డున పడేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2019లో తాను టీడీపీ నుంచి ఎమ్మెల్యే సీటును చంద్రబాబును అడగలేదని బలరాం తెలిపారు. చంద్రబాబును, ఆయన కొడుకు లోకేష్‌ను ఎవరో తిట్టారని, వాళ్ల మీద కోపంతో నన్ను చీరాలకు పంపారన్నారు. స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పార్టీలకతీతంగా ప్రజలు నన్ను గెలిపించారే తప్ప చంద్రబాబు ద్వారా కాదన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ కాకుండా వాస్తవాలు తెలుసుకొని చంద్రబాబు మాట్లాడితే మంచిదని హితవుపలికారు.

రోజురోజుకూ

వెలుగుచూస్తున్న బోగస్‌లు

వెతికే కొద్దీ బయటపడుతున్న వైనం

అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు..

అవగాహన లేని బీఎల్వోలు

చెప్పాపెట్టకుండా విధులకు

గైర్హాజరవుతున్న సిబ్బంది

ఆందోళన వ్యక్తం చేస్తున్న

ప్రతిపక్షాలు

దండిగా.. దొంగోట్లు..!



ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో ఎక్కడ చూసినా తప్పులే కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం వైసీపీ ప్రభుత్వం వేస్తున్న ఎత్తుగడలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు ఎన్నిసార్లు సరిచేసినా, మళ్లీ అవే అవకతవకలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పూర్తి సమాచారాన్ని సేకరించడం లేదని ఓటర్లు విమర్శిస్తున్నారు. ఎన్నికల కమిషన్ మాత్రం ఇదే చివరి జాబితా.. ఏమైనా తేడాలు ఉంటే సరిచేసుకోవాలని చెబుతోంది. అధికారపార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులకు రెండేసి చోట్ల ఓటుహక్కు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో నాయకులు బోగస్ ఓట్లను చేర్పించినప్పటికీ బీఎల్వోలు ఎటువంటి విచారణ చేయకుండా జాబితాలో అలాగే ఉంచుతుండటంపై ప్రతిపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 18 : ఓటమి తప్పదన్న భయంతో వైసీపీ దొంగ ఓట్లు చేర్పించే పనిలో ఉన్నట్లుగా లెక్కలు చెబుతున్నాయి. గతేడాది నుంచి ప్రారంభమైన ఓటరు దరఖాస్తుల పరిశీలనలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. 2023 ఆగస్టు నుంచి ఓట్లకు సంబంధించి నమోదులు, చేర్పులు, మార్పులు, తొలగింపులు, డబుల్ ఎంట్రీలు ఇలా వివిధ రకాల ప్రక్రియ నడుస్తోంది. డోర్ టూ డోర్ పరిశీలన జరుగుతోంది. గతేడాది ఆగస్టులో డ్రాఫ్ట్ జాబితా రాగా, అక్టోబరు నుంచి మదర్ రోల్ జాబితా సిద్ధమైంది. అయితే ఓటర్ల జాబితాపై అధికారులు పరిశీలన చేస్తుండగా తప్పులు కోకొల్లలుగా బయటపడుతున్నాయి. ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే బీఎల్వోలలో కొందరికి అవగాహన లోపం, మరోవైపు అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో దొంగ ఓట్లు చేర్పించినట్లు తెలుస్తోంది.

పరిశీలనలో బయటపడుతున్న అక్రమాలు

ఏడాదిగా పరిశీలన చేస్తున్నప్పటికీ ఇంకా ఓటర్ల జాబితాల్లో తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి. బీఎల్వోల్లో అవగాహన లోపం, అధికారులపై వైసీపీ నేతల ఒత్తిడి కారణంగా డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు జాబితాల్లో అలాగే ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన ఓటరు తుది జాబితాలోనూ అవకతవకలు కోకొల్లుగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా డబుల్ ఎంట్రీ ఓట్లు, పదిహేను వందల నుంచి రెండు వేల వరకు చనిపోయిన వారి ఓట్లు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అయితే వాటిని తొలగించాల్సి ఉంది. ఓటరు జాబితాలో వెలుగుచూస్తున్న అవకతవకలపై ప్రతిపక్షాలు పదేపదే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలో దాని సవచారం.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లిలో ఒకటో బూత్ కేంద్రంలో మొత్తం 929 ఓటర్లు ఉన్నారు. ఈ బూత్ పరిధిలో ఎనిమిది మంది 0 డోర్ నంబర్‌తో ఉన్నారు. పొందుగుల శివమల్లారెడ్డి, పాతర్ల చంద్రకళ పేర్లు 0 డోర్ నెంబర్లతో కనిపిస్తున్నాయి. 1 డోర్ నెంబర్‌తో బూల కొండేటి, చిన్న నాగమ్మ మేకల, ప్రవీణ్ మేకల, భవాని పాతర్ల తదితరులు ఉన్నారు. గ్రామంలో 10మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. గ్రామానికి చెందిన చక్కిలం సుబ్బరామయ్య మృతిచెంది ఎనిమిది నెలలు దాటినప్పటికీ, ప్రస్తుత జాబితాలో ఓటుహక్కును కల్పించారు. మండలంలోని రాయవరం 108వ పోలింగ్ కేంద్రంలో 20మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్లు గల్లంతయ్యాయి. గత జాబితాలో వీరికి ఓటుహక్కు ఉన్నా, ప్రస్తుత జాబితాలో డిలీట్‌లో ఉంచారు. తమకు తెలియకుండా తమ ఓట్లు తొలగించటం ఏమిటని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

అధికారుల ఇష్టారాజ్యం

వైసీపీ నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో కొందరు బీఎల్వోలు, బీఎల్ఏలు చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు తెలుస్తోంది. ఫీల్డ్ వర్క్ పేరుతో ఉండే బీఎల్వోలు జిల్లాలో 2,500 మంది వరకు ఉన్నారు. అయితే రోజులో కనీసం 70 నుంచి 100మంది వరకు తమ పైఅధికారులకు చెప్పకుండానే విధులకు రావడం లేదని సమాచారం. అంతేకాకుండా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫాం 6, 7, 8లను బీఎల్వోలు నేరుగా తీసుకుని పరిష్కరించాలి. ప్రజల నుంచి వచ్చే ఓటరుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సి ఉంది. అవేమీ చేయకుండా ఆన్‌లైన్‌లో పరిష్కరించుకోవాలని చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎల్వోల నిర్లక్ష్య సమాధానంపై ప్రజలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.

లక్షల్లో దరఖాస్తులు

అందిన సమాచారం మేరకు గతేడాది నుంచి ఇప్పటి వరకు 5,42,746 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో సుమారు 5.34లక్షల వరకు పరిశీలన చేసినట్లు సమాచారం. వాటిలో వెయ్యికిపైగా దొంగ ఓట్లు, 1,500లకుపైగా చనిపోయిన వారి పేరుతో ఓట్లు ఉండగా.. అసలు అడ్రస్, ఊరూ, పేరు లేని ఓట్లు వేలల్లోనే ఉన్నాయి. ఇంకా 2,183 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరలోనే ఉండగా, పరిశీలనలో వెలుగుచూస్తున్న అక్రమాలపై అధికారులు ఎప్పుడు చర్యలు తీసుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశం

జిల్లాలో దొంగ ఓట్ల నమోదుపై ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ దినేష్‌కుమార్ సీరియస్ అయినట్లు సమాచారం. బాధ్యులపై క్రిమినల్ చర్యలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఒకే డోర్ నంబరుపై వందల సంఖ్యలో దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలు, అడ్రస్ లేకుండా ఓట్లు నమోదు తదితర అంశాలపై కలెక్టర్ సీరియస్‌గా దృష్టి సారించారు. అక్రమాలకు పాల్పడిన బీఎల్వోలు, బీఎల్ఏలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం.


మురుగుమ్మి ఓటర్ల జాబితాలో గుర్తించిన నకిలీ ఓట్లు

కొత్త జాబితాలోనూ దొంగ ఓట్లు

● తెలంగాణకు చెందిన ముగ్గురి పేర్లు

పీసీపల్లి, : పీసీ పల్లి మండలంలో వెతికేకొద్దీ దొంగ ఓట్లు బయటపడుతున్నాయి. కొత్త ఓటర్ల జాబితాలోనూ పొరుగు రాష్ట్రం తెలంగాణకు చెందిన వారి పేర్లు ఉన్నాయి. స్థానికులు కాకపోయినప్పటికీ మురుగుమ్మిలోని డోర్ నెంబర్లతో ఓట్లు చేర్పించారు. కొంతమంది వైసీపీ కార్యకర్తలు తెలంగాణలో ఉన్న తమ బంధువులను ఇక్కడి అడ్రస్‌లతో పేర్లు నమోదు చేయించారని టీడీపీ గ్రామ నాయకులు ఆరోపిస్తున్నారు. దొంగ ఓట్ల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. టీడీపీ నాయకులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని 216 నెంబరు పోలింగ్ కేంద్రం జాబితాలో వరుస సంఖ్య 391లో ఎక్స్‌ఎంహెచ్ 2061034 ఓటర్ ఐడీతో నవీన రామారం భర్త దేవేంద్రరెడ్డి పేరు ఉంది. ఈమె తెలంగాణ వ్యక్తిగా గ్రామస్థులు గుర్తించారు. అదే బూత్‌లో వరుస నెంబరు 395లో ఎక్స్‌ఎంహెచ్ 2060911 ఐడీతో దేవేంద్రరెడ్డి రామారం తండ్రి రామిరెడ్డి పేరు నమోదైంది. ఇతను స్థానికుడు కాదని తెలంగాణ వాసి అని టీడీపీ నాయకులు గుర్తించారు. అదే బూత్‌లో వరుస నెంబరు 403లో ఎక్స్‌ఎంహెచ్ 2060929 ఐడీతో పద్మ వీరెడ్డి భర్త పాండురంగారెడ్డి పేరున మహిళ ఓటు కలిగి ఉంది. ఈమె కూడా స్థానికురాలు కాదని తెలంగాణకు చెందినవారని టీడీపీ నేతలు నిర్ధారించుకున్నారు. ఈ ముగ్గురు గ్రామంలోని వైసీపీ కార్యకర్తకు బంధువులని చెప్తున్నారు. అందువల్లనే ఇక్కడ దొంగ ఓటర్లుగా చేర్పించారని ఆరోపిస్తున్నారు. వెంటనే ఆ ఓట్లను తొలగించాలని ఆ బూత్ ఓటర్లు, టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అదే బూత్‌లో సీరియల్ నెంబర్ 202లో స్థానికుడైన వైసీపీ సానుభూతిపరుడు ప్రగడ పెదపుల్లయ్యకు ఓటు ఉండగా, 985 నెంబర్‌తో కూడా ఆయన పేరుతో మరో ఓటు కనిపిస్తోంది.

కిం కర్తవ్యం!


ఆమంచి


మహీధర్‌రెడ్డి

తొందరెదుకంటున్న మహీధర్‌రెడ్డి

ఆమంచికి అన్ని దారులు మూసుకుపోయినట్లే

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీకి చెందిన కందుకూరు శాసనసభ్యుడు మహీధర్‌రెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై ఆ ఇద్దరు నాయకులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. మహీధర్‌రెడ్డి ఇంటికి శనివారం ఉదయం నుంచి పెద్దసంఖ్యలో అనుచరులు వచ్చి రకరకాల అభిప్రాయాలు చెబుతూ ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు ఆమంచి కృష్ణమోహన్‌ను కూడా ముఖ్యఅనుచరులు కలుస్తున్నారు. వారిద్దరూ రాజకీయ భవితవ్యంపై ఇప్పటికైతే స్పష్టమైన నిర్ణయానికి రానప్పటికీ వ్యూహాత్మకంగా అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది. మానుగుంట, ఆమంచిలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఊహించని షాక్ ఇచ్చిన విషయం విదితమే. కందుకూరు నియోజకవర్గంలో మహీధర్‌రెడ్డి ఇప్పటి వరకూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తండ్రి మూడుసార్లు విజయం సాధించారు. ఇప్పటికీ బలమైన వర్గం ఉన్న ఆయన్ను జగన్ ఈసారి కూడా కొనసాగిస్తారని అంతా భావించారు. అయితే అనూహ్యంగా మహీధర్‌ను తప్పించడమే కాకుండా ఆ స్థానంలో మహిళను అందునా ఆయన సిఫార్సు లేని వారిని రంగంలోకి తెచ్చారు. ఇక ఆమంచి కృష్ణమోహన్‌ను ముఖ్యమంత్రి ఏరి కోరి పార్టీలోకి తీసుకున్నారు. జగన్ ఓదార్పు యాత్ర సమయంలో చీరాల ఎమ్మెల్యేగా ఉన్న ఆమంచి నియోజకవర్గంలో వైఎస్సార్ విగ్రహాల ఏర్పాట్లను అడ్డుకున్నారు. అయినప్పటికీ 2019లో పిలిచి మరీ ఆయనకు వైసీపీ చీరాల టికెట్ ఇచ్చారు. ఓడిపోయిన తర్వాత స్థానికులు వద్దన్నా పర్చూరు ఇన్‌చార్జిగా నియమించారు. ఏడాది తిరక్కముందే ఆమంచిని దూరం పెట్టడం ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన్ను పర్చూరు నుంచి తప్పించి కొత్త వారిని రంగంలోకి దించారు. ఆమంచి అడిగిన చీరాల నుంచి ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్‌కు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వేచి చూడండి

కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని శనివారం ఆయన స్వగ్రామమైన మాచవరంలో అనుచరుల్లో ముఖ్యలంతా వచ్చి కలిశారు. అందరితో ఆయన ఓపిగ్గా మాట్లాడారు. 'ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. నామినేషన్ల లోపు ఏమైనా జరగొచ్చు. నామినేషన్ల చివరి రోజు కూడా మార్పులు చోటుచేసుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి' అని తనను కలిసిన వారితో వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

గతంలో ఆయన టీడీపీలోకి వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారం జరిగింది. అలాగే వైసీపీలో కూడా కొత్త ఇన్‌చార్జిల పట్ల నియోజకవర్గాల్లో సానుకూలత రాకపోతే మార్పులు చేస్తున్నట్లే, చివర్లో వైసీపీ టికెట్ తిరిగి మహీధర్‌కే రావచ్చని కొందరు, టీడీపీలోకి వెళ్లవచ్చని మరికొందరు ఆయన మాటలను బట్టి అభిప్రాయపడుతున్నారు. ఈసారి పోటీలో ఉండకపోవచ్చని కూడా ఇంకొందరు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఏదోరూపంలో ఆయన ఈ పర్యాయం ఎన్నికల రంగంలో ఉండే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీలో ఉంటారా? స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా?

చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌పై శనివారం ఇంకొల్లులో జరిగిన సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తీవ్రమైన విమర్శలు చేశారు. ఆయన మాటల ద్వారా ఆమంచికి ఆ పార్టీలో అవకాశం లేదని చెప్పకనే చెప్పారు. జనసేన వైపు నుంచి కూడా ఆయన ముందుకు వచ్చే అవకాశాలు ఏమాత్రం కనిపించడం లేదు. ఇకపోతే ప్రధాన పార్టీల్లో మిగిలింది బీజేపీ, కాంగ్రెస్. టీడీపీతో బీజేపీ జతకడుతున్నందున ఆవైపు నుంచి అవకాశాలు తక్కువే. కాంగ్రెస్ పక్షాన పోటీ వైపు ఆమంచి అడుగులు వేయకపోవచ్చు.

ఈనేపథ్యంలో శనివారం పందిళ్లపల్లిలో ఆయన్ను పర్చూరు నియోజకవర్గం వారు కలిస్తే పార్టీ నిర్ణయాన్ని గౌరవిద్దాం అన్న చందంగా మాట్లాడినట్లు చెబుతున్నారు. అదే సమయంలో చీరాల నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలవారీ ఉన్న తన అంతరంగికులతో విడివిడిగా మాట్లాడుతున్నారు. దీంతో ఆయన 2014 మాదిరిగానే చీరాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వస్తారా? వైసీపీలోనే ఉంటూ ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉంటారా? అన్నది తేలాల్సి ఉంది.

బదిలీల బంతాట

ఇష్టానుసారం అధికారుల మార్పు

నెలలో కొండపి నియోజకవర్గానికి ముగ్గురు ఈఆర్వోలు

సింగరాయకొండకు మూడోసారి తహసీల్దార్ రాక

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమంటున్న ఎమ్మెల్యే స్వామి

కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి


కొండపి, ఫిబ్రవరి 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు బంతాటగా మారాయి. కొండపి నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా మంత్రి ఆదిమూలపు సురేష్ రావడంతో పూర్తిగా అధికారుల నియామకం ఆయన కనుసన్నల్లో జరుగుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. ఎలక్షన్ విధుల్లో పక్షపాతం వహిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని ఎన్నికల సంఘం అధికారులు హెచ్చరిస్తున్నా అధికారపార్టీ నేతలు పట్టించుకోవడం లేదు. కిందిస్థాయిలో తమకు కావాల్సిన అధికారుల నియామకాలు ఇష్టానుసారం చేయించుకుంటూనే ఉన్నారు. నియోజకవర్గంలో తమకు అనుకూలంగా ఉండరని భావిస్తున్న తహసీల్దార్లను, ఈఆర్వోలను పదేపదే మారుస్తుండటమే ఇందుకు నిదర్శనం.

నెలలోపే ముగ్గురు ఈఆర్వోలు

అధికారులు గత నెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితాలను ప్రచురించారు. మరుసటి రోజు అప్పటి ఈఆర్వో నారదముని కొండపిలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించిన అప్పటి ఈఆర్వో, తహసీల్దార్లను పార్టీల నాయకులు ప్రశంసించారు. ఆ తర్వాత ఎన్నికల నిబంధనల మేరకు నారదముని జిల్లా నుంచి బదిలీ అయ్యారు. అనంతరం 15 రోజులకు కొండపి ఈఆర్వోగా ఝాన్సీలక్ష్మి వచ్చారు. ఆమె ఒకసారి తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. వారంరోజుల్లోనే ఆమె మారిపోయారు. ఈనెల 15న బీఎల్ఎన్ రాజకుమారి ఈఆర్వోగా వచ్చారు. కొండపిలో తహసీల్దార్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె నాయకులు లేవనెత్తిన అంశాలపై ఈసారి సమావేశంలో సమాధానాలు చెబుతానని, మినిట్స్ బుక్‌లో రాయించారు. అయితే తిరిగి కొండపి నియోజకవర్గ ఈఆర్వోగా ఆమె స్థానంలో ఎ.కుమార్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వచ్చాయి. దీంతో రాజకీయ ఒత్తిళ్లతో బదిలీలు పదేపదే జరుగుతున్నాయని అటు ప్రజలు, ఇటు ప్రతిపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు.

సింగరాయకొండ తహసీల్దార్‌లు కూడా..

సింగరాయకొండ తహసీల్దార్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఈనెల 6న అక్కడ తహసీల్దార్‌గా శంఖల రమణయ్యను నియమించారు. వెంటనే 7వ తేదీన ఆయన్ను మార్చి జె.ప్రసాదరావుకు పోస్టింగ్ ఇచ్చారు. తిరిగి గుంటూరు జిల్లా నుంచి ఎం.భవానీశంకర్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం కొనసాగుతున్నారు. తహసీల్దార్లను కూడా ఇలాగే పదేపదే మార్చడంలో మంత్రి పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం సీరియస్‌గా చెబుతున్నా పదేపదే తహసీల్దార్‌లు, ఈఆర్వోలను మారుస్తుండంతో నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



అధికార పార్టీ ఒత్తిళ్లతోనే - ఎమ్మెల్యే స్వామి

కొండపి నియోజకవర్గ ఈఆర్వోలుగా నెల వ్యవధిలో ముగ్గురిని మార్చడం, సింగరాయకొండ తహసీల్దార్లను పదేపదే బదిలీ చేయడం వెనుక మంత్రి సురేష్, వైసీపీ నేతల ప్రమేయం ఉందని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మంత్రి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు అనుకూలమైన అధికారులను తెచ్చుకొంటున్నారన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అధికారులను పదేపదే బదిలీ చేయడంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశానని ఆయన చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గుండ్లకమ్మలో మళ్లీ ఆగిన ఇసుక రవాణా


గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

- రీచ్ ఉన్నట్టా... లేనట్టా...
- అధికారపార్టీ నేతలకు కమీషన్‌లు, అధికారులకు మామూళ్లు అందకపోయినా నిలిపివేత
- మైనింగ్ అధికారుల తనిఖీలతో మరోసారి నిలిచిన వైనం

అద్దంకి, ఫిబ్రవరి 18: గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ఇసుక రీచ్ ఉన్నట్టా.. లేనట్టా అన్న అనుమానాలు గత నాలుగున్నర సంవత్సరాలుగా వ్యక్తమవుతున్నాయి. రీచ్ ఉండి అన్నీ అనుమతులు ఉంటే తరచూ ఇసుక రవాణా నిలిపివేయటం ఏమిటన్న అనుమానాలు వస్తున్నాయి. అధికారపార్టీ నేతలకు కమీషన్‌లు అందకపోయినా.. పలు శాఖల అధికారులకు మామూళ్ళు ఇవ్వకపోయినా ఇసుక రవాణా నిలిచిపోతుంది. దీని నిబట్టి అద్దంకి ప్రాంతంలో ఎలాంటి ఇసుక రీచ్ లేదన్న విషయం స్పష్టమవుతుంది.

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన కార్పొరేట్ సంస్థల కనుసన్నలలో ఇసుక సీనరేజ్ వసూలు జరుగుతుంది. అయితే, అధికారపార్టీ నేతలు, ఆయా శాఖల అధికారులు నోరు విప్పకుండా వాటాలు చేరుతున్నాయని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలోనే వాటాలు, కమీషన్‌లు అందనప్పుడు ఏదొక సాకుతో ఇసుక రవాణాకు బ్రేక్‌లు పడుతున్నట్లు తెలుస్తుంది. తరచూ ఇసుక రవాణా నిలిపివేస్తుండటంతో ఇసుక రవాణాదారులు బ్లాక్ మార్కెట్ పేరుతో మరింత ధర పెంచి అమ్మకాలకు తెరలేపుతున్నారు.


గుండ్లకమ్మ బ్రిడ్జి అంచువరకు జరిగిన ఇసుక తవ్వకాలు


ఇసుక రవాణాకు ఇస్తున్న సీనరేజ్ బిల్లు

టీడీపీ ప్రభుత్వ హయాంలో గుండ్లకమ్మ నది నుంచి అద్దంకి పట్టణంలోకి ట్రాక్టర్ ఇసుక రూ.1200 నుంచి రూ.1500 వరకు ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అదే ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో అయితే ఏకంగా రూ.5 వేలు కూడా వసూలు చేస్తున్నారు. ఇదేమని భవనాల నిర్మాణదారులు అడిగితే మామూళ్ళు ఇస్తేనే ఇసుక బయటకు వస్తుందని ఇసుక రవాణాదారుల నుంచి సమాధానం వస్తుంది. నాలుగు నెలలుగా ఇసుక రవాణా నిలిచిపోగా పక్షం రోజుల నుంచి పునఃప్రారంభమైంది. రెండు రోజుల క్రితం మైనింగ్ అధికారులు వచ్చి దాడులుచేసి ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేశారు. అన్నీ అనుమతులు ఉన్నాయి కదా... ఎందుకు ఆపుతున్నారని పలువురు ఇసుక రవాణాదారులు మైనింగ్ అధికారులను అడుగగా, వాళ్ల నుంచి వచ్చిన సమాధానంతో ఇసుక రవాణాదారులు నోరు వెళ్ళబెట్టినట్లు తెలుస్తుంది. అద్దంకి ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి రీచ్‌లు గుర్తించనప్పుడు ఇసుక తవ్వకాలు ఎలా చేస్తారని అన్నట్లు తెలుస్తుంది. అయితే, నిత్యం రవాణా జరుగుతుంది కదా అని ఇసుక రవాణాదారులు అడిగినప్పుడు మాత్రం మైనింగ్ అధికారుల నుండి సమాధానం రాకపోవటం విశేషం.

గతంలో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు కూడా ఇదే పంథాను అనుసరించటం, అనంతరం సీనరేజ్ వసూలు చేసే సిబ్బంది వెళ్లి కలిసిన మరుసటి రోజు నుంచి మరలా ఇసుక రవాణా యథావిధిగా జరుగుతుంది. ఇక అనుమతుల విషయాలను పక్కన పెడితే ఇసుక తవ్వకాల విషయంలో కనీస నిబంధనలు కూడా పాటించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఊటబావులు, మంచినీటి పథకాలు, ఎత్తిపోతల పథకాల బావులు, అద్దంకి-దర్శి రోడ్డులో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి సమీపం వరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్నా.. ఆయా శాఖల అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రవాణాపై స్పష్టత ఇవ్వటంతో పాటు మంచినీటి పథకాలు, ఎత్తిపోతల పథకాలు, బ్రిడ్జిల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



దత్తపాదుకాక్షేత్రంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దత్తవిజయానంద తీర్థ స్వామీజీ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

దత్తపాదుకాక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అద్దంకి, ఫిబ్రవరి 18: గురువుల మాటలలో చాలా అంతరార్థం దాగి ఉంటుందని, ఆ మాటలను తేలికగా తీసి వేయవద్దని మైసూరు అవధూత దత్తపీఠం ఉత్తరాధీశులు దత్త విజయానందతీర్థ స్వామీజీ అన్నారు. స్థానిక దత్తపాదుకా క్షేత్రంలో ఆదివారం విజయానంద తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శౌర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీచక్రార్చన, దివ్యనామ సంకీర్తన జరిగాయి. భక్తుల నుద్దేశించి విజయానంద తీర్థ స్వామీజీ మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం ప్రతిష్ఠ జరిగిన జనవరి 22 భారతీయులందరూ గర్వించదగ్గ రోజు అన్నారు. సూర్యుడిని ఆరాధించటం వల్ల అనారోగ్యం సమస్యలు తొలగి మంచి జరుగుతుందన్నారు. ఆదివారం సూర్యుడు వారం అని, ఆరోజు ఏపని ప్రారంభించినా మంచి జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డి ఆదివారం రాత్రి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. దత్తపాదుకాక్షేత్రం కమిటీ బాధ్యులు నాగసూరి హనుమత్ ప్రసాద్, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, తమ్మన శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ


ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం, టీడీపీ కార్యాలయం

గంగవరం(ఇంకొల్లు), ఫిబ్రవరి 18: ఇంకొల్లు మండలం గంగవరంలో సోమవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ జరగనున్నట్లు ఆపార్టీ గ్రామ అధ్యక్షుడు కరి వీరాంజనేయులు తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు గ్రామానికి చెందిన బొడెంపూడి నాగేశ్వరరావు రెండు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేశారు.

గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో 8 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పాల్గొననున్నారు. ఉదయం 10.29లకు జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పార్టీ నాయకులు కోరారు.

ఆటోలతో పొంచిఉన్న ప్రమాదం

- పరిమితికి మించి కూలీలు తరలింపు
- పొట్టకూటి కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం


పరిమితికి మించి ఆటోలో వెళుతున్న కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 18: రెక్కాడితే డొక్కాడని రోజువారీ కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రమాదకరమైన ప్రయాణం సాగిస్తున్నారు. గ్రామాలలో పనులు సరిగా లేకపోవటంతో పలువురు కూలీలు ఆటోలను ఏర్పాటుచేసుకొని పొరుగు మండలాల్లో పనులకు వెళుతున్నారు. పరిమితికి మించి ఆటోలు, జీపులలో కూలీలు తరలి వెళ్లటం చూసిన పలువురు ఏదైన ప్రమాదం జరిగితే కూలీల ప్రాణాలకు ముప్పు తప్పదంటున్నారు. ప్రమాదం అని తెలిసిన కొందరు కూలీలు ఆటోలలోనే పనులకు వెళుతున్నారు. తమ కుటుంబాలు గడవాలంటే రోజువారీ పనులు తప్పవని వారు అంటున్నారు.

బల్లికురవ మండలం వల్లాపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, కొప్పెరపాలెం, కొణిదెన తదితర గ్రామాల నుంచి రోజువారీ పనులకు వెళ్లే కూలీలు ప్రమాదకరమైన ప్రయాణం సాగిస్తున్నారు. పది మంది ఎక్కాల్సిన మూడు చక్రాల ఆటోలో 20 మంది వరకు పనులకు వెళుతున్నారు. 20 మంది వెళ్లాల్సిన నాలుగు చక్రాల ఆటోలో 40 మంది వరకు ప్రయాణం సాగిస్తున్నారు. గతుకుల రోడ్లలో బయటకు వేలాడుతూ కూలీలు తమ పొట్ట నింపుకునేందుకు పొరుగు మండలాలకు మిర్చి కోతల పనులకే, పొగాకు తోటలలో పనులకు వెళుతున్నారు. కూలీల ఆటోలు పల్టీ కొడితే పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో కూడా పలు సందర్భాలలో కూలీల ఆటోలు పడిపోయి పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇటీవల సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన కూలీల ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు ప్రాణాలు పోయాయి. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి కూలీలకు కౌన్సెలింగ్ ఇచ్చి ప్రమాదాలు జరగకుండా కూలీల రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. బల్లికురవ మండల కేంద్రం గుండా ప్రతిరోజు కూలీలు ఆటోల ద్వారా పెద్దఎత్తున తరలి వెళుతున్నారు. ఈ ఆటోలు వెళుతుంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


బల్లికురవ నుంచి పొరుగు మండలాలకు వెళుతున్న కూలీలు

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- దారిమళ్లిన నిధులు
- ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు
- కనీస అవసరాలను కూడా తీర్చలేకపోతున్నామని ఆవేదన


అద్దంకి మండలం తిమ్మాయపాలెంలో ముందుకు కదలని మురుగు నీరు

అద్దంకి, ఫిబ్రవరి 18: దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలే. అలాంటి గ్రామాలలో అభివృద్ధి, పారిశుధ్య పనులు చేపట్టేందుకు విడుదల వుతున్న నిధులు గ్రామ పంచాయతీలకు చేరకుండా పక్కదారి పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోగా, కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు కూడా పక్కదారి పట్టించారని పలువురు సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. దీంతో కనీసం పారిశుధ్య పనులు కూడా చేపట్టే అవకాశం కూడా లేకుండాపోయిందని వాపోతున్నారు.


బల్లికురవ మండలం కొప్పెరపాడులో డ్రైన్‌లు లేక ముందుకు కదలని మురుగు

అద్దంకి నియోజకవర్గంలో 103 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో అత్యధిక శాతం మంది సర్పంచ్‌లు అధికారపార్టీకి చెందిన వారే. ఇటీవల విడుదల చేసిన నిధులలో కొద్దిమేర మాత్రమే పంచాయతీలకు జమ అయ్యాయి. వీటితో వీధిలైట్లు మరమ్మతులకే సరి పోతున్నాయని, మురుగు కాలువలు శుభ్రంచేసే పరిస్థితి లేకుండా పోయిందని అభిప్రాయపడుతున్నారు. కొత్తగా ఒక్క సైడు కాలువ కాని, సీసీ రోడ్డుకాని వేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలను నిర్వీర్యం చేశారు



- పూనాటి విక్రమ్, సర్పంచ్, కొటికలపూడి

గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోగా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను కూడా పూర్తిగా పక్కదారి పట్టించి పంచాయతీలను నిర్వీర్యం చేశారు. చిన్నపాటి పని చేద్దామన్నా నిధులు లేకుండా పోయాయి. ఇటీవల కొద్దిమేర నిధులు వచ్చినా వీధిలైట్లు ఏర్పాటుకు కూడా సరిపోవటం లేదు. ఇక పారిశుధ్య పనులు చేపట్టే అవకాశమే లేదు.



స్థలం ఆక్రమించి నిర్మాణం

సంతమాగులూరు, ఫిబ్రవరి 18: మండలంలోని ఏల్చూరుకు చెందిన కుంచాల అంకమ్మకు గతంలో ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరుచేసింది. అదే గ్రామానికి చెందిన వల్లెపు నాగరాజు ఆ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో సదరు స్థల యజమాని కుంచాల అంకమ్మ కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి వచ్చిన నోటీసులను అధికారులు, పోలీసులకు చూపించినా వారు స్పందించడంలేదని బాధితురాలు వాపోతున్నారు. గ్రామానికి చెందిన వల్లెపు నాగరాజు అధికార పార్టీ కార్యకర్త కావడంతో ఆ పార్టీ నాయకుల అండదండలతో స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

బోడవాడ(పర్చూరు), ఫిబ్రవరి 18: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పర్చూరు మండలం బోడవాడ గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి నాగార్జున హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లెల వెంకట్రావు, ఐ.బాబురావు, జి.చారువాక, కూరాకుల ఇసాక్, జంగా ఎలీషాబాబు, అంబేడ్కర్ యూత్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలపై వందకోట్లు అవినీతికి పాల్పడ్డానని తనపై ఆరోపణలు చేయటం సరికాదని, ఆరోపణలపై చర్చకు సిద్ధమని మంత్రి నాగార్జున అన్నారు. ఆదివారం పర్చూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంకొల్లులో జరిగిన రా కదలిరా సభపై స్పందించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని తట్టుకోలేక చంద్రబాబు ఇలాంటి ఆరోపణలను చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొల్లా వెంకట్రావు, గాజుల రమేష్, కూరాకుల ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

మార్టూరు, ఫిబ్రవరి 18: సీపీఎస్, జీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షను విధానాన్ని అమలుచేసే పార్టీలకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇస్తాయని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుసుల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలకు చెందిన రాష్ట్ర అధ్యక్షులు, మండల, నియోజకవర్గ, జిల్లా అధ్యక్షులకు పోస్టు కార్డులను పంపిస్తున్నట్టు చెప్పారు. ఆయా పార్టీలు తమ మ్యానిఫెస్టోలో పాత పెన్షను విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించాలన్నారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం ఓపీఎస్‌పై చేసే పార్టీకే ఉద్యోగ , ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జె.వినయ్‌కుమార్, కంది మళ్ల రవిబాబు, బండారు ఆదినారాయణ, శ్రీపతి వెంకటసుబ్బయ్య, రంగస్వామి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో వైసీపీలో వణుకు

చీరాల, ఫిబ్రవరి 18: టీడీపీ సూపర్ సిక్స్‌తో వైసీపీలో వణుకు తారస్థాయికి చేరిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పార్టీశ్రేణులు ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇంకొల్లులో జరిగిన రా కదలి రా సభకు చీరాల నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లి సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పంగులూరు, ఫిబ్రవరి 18: పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేశారు. ఆదివారం తెల్లవారు జామున మండలంలోని కోటపాడు పొలాల్లో పేకాట శిబిరంపై ఎస్ఐ తిరుపతిరావు దాడి పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి లక్షా రెండు వేల మూడువందల అరవై రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ చెప్పారు. మండలంలో పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 18: స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం ఎస్సై సురేష్ రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. తమ పద్ధతులను మార్చుకుని మంచి మార్గంలో నడవాలని సూచించారు. తమపై ఉన్న రౌడీ షీట్లను ఎత్తివేసే విధంగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 18: వాడరేవు సముద్రతీరంలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే పర్యాటకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం సముద్రతీరంకు పర్యాటకులు పోటెత్తారు. ఈక్రమంలో ఎస్సై తీరాన్ని పరిశీలించారు. పర్యాటకులతో మాట్లాడారు. స్నానాలు ఆచరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

టీడీపీలో చేరిన 20 కుటుంబాలు


ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరిన బీసీ కుటుంబాలు

మార్టూరు, ఫిబ్రవరి 18: మార్టూరులోగల మద్ది లక్ష్మయ్య కంపెనీ సమీపంలోని 20 బీసీ కుటుంబాలకు చెందిన వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. 15వ బూత్ పరిధిలోని దాదాపుగా 70 మంది ఓటర్లు శనివారం రాత్రి బీసీ కాలనీ దగ్గరకు వచ్చిన టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పు రవి, వీరాంజనేయులు,శంకర్, అంకమ్మరావు, పోలయ్య, వెంకటేశ్వర్లు, చిన్న అంకమ్మ, గోపి, బుజ్జి, వెంకటేష్, మణి అంజమ్మ, పావని, గోపిరాజు, సీతా రాములు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంపని శ్రీనివాసరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, కామినేని జనార్దన్, పుట్టా స్వామి, షేక్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుకు నేడు ఆఖరు తేదీ

మార్టూరు, ఫిబ్రవరి 18: రబీలో రైతులు సాగు చేసిన పంట వివరాల నమోదుకు సోమవారం ఆఖరి రోజు అని మండల వ్యవసాయాధికారి వీరగంధం కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు చేయించుకున్న వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి లభించే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తాయన్నారు. ఇప్పటికి మండలంలో 10,032 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశామన్నారు. ఇంకా నమోదు చేయించుకోవలసిన రైతులు తమ పంటలను నమోదు చేయించుకోవాలన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా రామసుబ్బారావు

చినగంజాం, ఫిబ్రవరి 18: చినగంజాం గ్రామానికి చెందిన మోటుమర్రి రామసుబ్బారావు ఆర్యవైశ్య సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. బాపట్లలో సంఘం జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామసుబ్బారావు మాట్లాడుతూ జిల్లా ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి, ఆర్యవైశ్యుల అభ్యున్నతకి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యదర్శిగా ఎంపికైన రామసుబ్బారావుని సంఘం మండల అధ్యక్షుడు కోట శివరామకృష్ణ, సభ్యులు, నాయకులు, పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

జూదరుల అరెస్టు

స్వర్ణ(పర్చూరు), ఫిబ్రవరి 18: కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టుచేసి రూ.1750 నదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సురేష్ తెలిపారు. వీరిపై కేసునమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నాగులపాడు సొసైటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం


సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న మానికొండ నాగరాజు

అద్దంకి, ఫిబ్రవరి 18: అద్దంకి పట్టణం కేంద్రంగా ఉన్న నాగులపాడు సొసైటీ పాలకవర్గం(త్రిమెన్ కమిటీ) ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం శింగరకొండ రోడ్డు లోని కూకట్ల కన్వెన్షన్‌లో జరిగింది. చైర్మన్‌గా మానికొండ నాగరాజు, సభ్యులుగా రాఘవరెడ్డి, వెంగళశెట్టి వెంకటేశ్వర్లుతో సహకార శాఖ ఆడిట్ అధికారిణి శ్రీదేవి ప్రమాణం చేయించారు.

కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ప్రసాదరెడ్డి, జ్యోతి హనుమంతరావు, రామిరెడ్డి ఆదిరెడ్డి, సోమా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల కొరిశపాడు సమితి యూనిట్ ఎన్నికలు ఆదివారం అద్దంకిలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగాయి. ఈ ఎన్నికలలో కొరిశపాడు, అద్దంకి మండలాల ఉద్యోగులు పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్‌వీ రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీధర్, కోశాధికారిగా బి.ఆషాజ్యోతి, ఉపాధ్యక్షుడిగా ఎం.ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎం.శివరామకృష్ణ, ఏ.నాగమల్లేశ్వరి, బి.భరత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

టీడీపీ అభ్యున్నతికి కృషి

ఇంకొల్లు, ఫిబ్రవరి 18: ఇంకొల్లులో జరిగిన రా కదిలిరా చంద్రబాబు సభను విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పార్టీ అభ్యున్నతికి కృషిచేసి అహర్నిశలు శ్రమించే పార్టీ అధినేత చంద్రబాబును మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వ్యవసాయ పనులలో ఎంతో బిజీగా ఉన్న సభకు పెద్దఎత్తున తరలివచ్చి సంఘీభావం తెలిపిన బాపట్ల, ఒంగోలు పార్లమెంట్‌లోని నియోజకవర్గ ప్రజలకు ఏలూరి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

సోమశిలలో 20.325 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 18: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 20.325 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

అడిగేదెవరు..
ఆపేదెవరు ?

- ఈసీ లేకుండా ఇసుక తవ్వకాలు
- ఐదు రీచ్‌లలో లోడేస్తున్న కాంట్రాక్టర్లు
- నిత్యం రాష్ట్రం దాటుతున్న వందల లారీలు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- ఎన్జీటీని తప్పుదారి పట్టిస్తున్న అధికారులు



బుచ్చి మండలం మినగల్లు రీచ్‌లో టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

నెల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుమతులు లేవన్న భయమే లేదు.. నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్నామన్న ఆలోచనే లేదు.. ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నామన్న ఆందోళన లేదు.. అధికార యంత్రాంగం పట్టుకుంటుందేమోనన్న భీతిత అసలే లేదు.. అడిగేదెవరు... ఆపేదెవరు...? అన్న రీతిలో జిల్లాలోని పెన్నానదిని లోడేస్తున్నారు. భారీ యంత్రాలతో చట్ట విరుద్ధంగా ఇసుకను అక్ర మంగా తవ్వుతున్నారు. నిత్యం వందలాది లారీలను పక్క ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ రూ.కోట్లను సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుడు అనుమతి లేకుండా పిల్లకాలువలో తువ్వ ఇసుక తీసుకెళుతుంటే జులుం ప్రదర్శించే రెవెన్యూ, పోలీసు, మైనింగ్, సెబ్, విజిలెన్స్ అధికారులు.. ఇప్పుడు ఇసుక రీచ్‌లలో బహిరంగ దోపిడీ జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

● కొనుగోలు చేయాల్సిన దుస్థితి

జిల్లాలో లభ్యమవుతున్న ఇసుకను పేదలు తమ సొంత అవసరాలకు తీసుకెళ్లడానికి వీల్లేదు. అలా తీసుకెళుతున్న వారిపై ఎన్నో కేసులు నమోదయ్యాయి. ఎక్కడి నుంచో వచ్చి అధికారమే అండగా జిల్లాలోని సంపదను దోచుకెళుతుంటే, వారి వద్ద నుంచి పేదలు ఇసుకను కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుతం ఐదు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. పడమటికంభంపాడు, మిన గల్లు, ముదివర్తి, పల్లిపాడు రీచ్‌లతోపాటు సంగం డీసిల్టేషన్ పాయింట్ వద్ద కూడా ఇసుక తవ్వకాలకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనల ప్రకారం పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకుండా ఏ రీచ్‌లోనూ ఇసుకను తవ్వేందుకు లేదు. కానీ జిల్లాలో ఏ ఒక్క రీచ్‌కూ ఈసీ లేదు. గతేడాది మేనెలతోనే ఈసీ గడువు ముగిసింది. ఆ తర్వాత నుంచి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉన్న ఇసుకనే విక్రయాలు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూ ఉన్నా వాస్తవానికి రీచ్‌లలో ఇష్టానుసారంగా తవ్వుతున్నారు. కొన్ని జిల్లాల్లోని రీచ్‌లకు మనుషులతో తవ్వేలా ఈసీ వచ్చింది. కానీ జిల్లాలోని రీచ్‌లకు కనీసం అది కూడా లేదు. పర్యావరణ నిబంధనల ప్రకారం నదుల్లో మీటర్‌కు మించి తవ్వకాలు జరపకూడదు. కానీ రీచ్‌లను పరిశీలిస్తే ఐదు మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుపుతున్నారు. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రీచ్‌లన్నీ ఒక ప్రత్యేక సామ్రాజ్యంగా మారిపోయాయి. ఇసుకను కొనేవారు మినహా మిగిలిన వారెవరికీ అందులోకి ప్రవేశం లేదు. గేటు వద్దనే కొందరు ప్రైవేటు వ్యక్తులు అడ్డుకుంటున్నారు.

● ఎన్జీటీకూ తప్పుడు నివేదిక..!

రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, ఈసీలు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదైంది. అయితే ప్రభుత్వమేమో ఎక్కడా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరగడం లేదని చెబుతోంది. దీంతో ప్రతీ జిల్లాలో కనీసం ఒక ఇసుక రీచ్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు చెన్నై బెంచ్ ఆదేశించింది. అయితే జిల్లాలో ఇప్పటికీ తవ్వకాలు జరుపుతున్న ఐదు రీచ్‌లలో అధికారులు పరిశీలించకుండా, తవ్వకాలు జరగని విరువూరు, అప్పారావుపాలెం రీచ్‌లలో పరిశీలన జరిపి గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అధికారుల నిబద్ధతకు ఇది నిదర్శనంగా కనిపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఏ రీచ్‌లో పరిశీలన చేయాలన్నది కూడా రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలేనని అధికార వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకూ ప్రజలను, కోర్టులను మభ్యపెడుతూ వస్తున్న ప్రభుత్వం ఇప్పుడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను కూడా తప్పుదోవ పట్టిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇందుకూరుపేట మండలం పల్లెపాడు రీచ్‌లో లారీలకు ఇసుక లోడ్ చేస్తున్న యంత్రాలు (డ్రోన్‌ఫొటో)

జిల్లాపై బర్డ్ ఫ్లూ ప్రభావం



- మనుషులకు సోకే అవకాశం
- కోళ్లఫారాల్లో పనిచేసేవారు జాగ్రత్త
- మాస్కులు, గ్లౌజులు ధరించి పనిచేయాలి
- వ్యాధిసోకిన కోళ్లను కి.మీ దూరంలో నిర్వీర్యం చేయాలి
- చికెన్ కొనుగోళ్లు లేక దుకాణాలు వెలవెల
- చేపల మార్కెట్లకు ఎగబడ్డ జనం

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 18: జిల్లాపై బర్డ్ ఫ్లూ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. ఈ వ్యాధి మనుషులకు కూడా సోకే అవకాశం ఉండటంతో జిల్లా అధికార యంత్రాంగం తగిన హెచ్చరికలు జారీ చేసింది. వ్యాధి లక్షణాలు ఉండే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్సలు చేయించు కోవాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు కోళ్లఫారాలను పరిశీలించి తగిన సూచనలిచ్చారు. చాటగొట్ల, గుమ్మళ్లదిబ్బలో చనిపోయిన కోళ్లను కిలోమీటరు దూరంలో నిర్వీర్యం చేయాలని ఆదేశించారు. గతంలో పలు దేశాల్లో బర్డ్ ఫ్లూ వల్ల అనేకమంది చనిపోయి ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని వారు చెబుతున్నారు. ఈజిప్ట్, ఇండోనేషియా, వియత్నాం, నెదర్లాండ్ దేశాల్లో 2003, 2016 సంవత్సరాల్లో బర్డ్ ఫ్లూ సోకిన 850 మందిలో 50 శాతం కంటే ఎక్కువగా మరణాలు సంభవించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. హెచ్7ఎన్9 అనే బర్డ్ ఫ్లూ వైరస్ చైనాలోనూ వెలుగు చూడగా, వేలాది కోళ్ల ఫారాలను మూసి వేయించారు. పలువురికి వ్యాధి సోకింది. బర్డ్ ఫ్లూ వైరస్ గాలిలోనూ, ధూళిలోనూ వ్యాపించి మనుషులకు సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో మూడు రోజులుగా నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి మాంసం దుకాణాలను అధికారులు మూసి వేయించారు.

● వైరల్ న్యూమోనియాకు అవకాశం

బర్డ్ ఫ్లూ వైరస్ వల్ల మనుషులు వైరల్ న్యూమోనియాకు గురయ్యే అవకాశం ఉంది. మూడు రోజులుగా తగ్గని జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి, దగ్గు, కండరాల నొప్పులు తదితర లక్షణాలు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకు దారితీయవచ్చు. అలాగే కంటిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలాంటి లక్షణాలు దీర్ఘకాలం ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి. అలాగే కోళ్ళ, పక్షుల మలం ద్వారా కూడా వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. కోళ్ల ఫారాల్లో పనిచేసేవారు తప్పనిసరిగా ఎన్95 మాస్క్‌తో పాటు చేతులకు గ్లౌజులు కూడా వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



బర్డ్ ఫ్లూ మనుషులకు కూడా సోకే అవకాశం ఉంది. వ్యాధి లక్షణాలు కనిపిస్తే అలాంటివారు క్వారంటైన్‌లో ఉండటం ఉత్తమం. ప్రత్యేకించి మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు బర్డ్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- డాక్టర్ పోకల రవి, పల్మనాలజిస్ట్



సంగం : పట్టణంలోని చికెన్ దుకాణాలు ఆదివారం కొనుగోలుదారులు లేక వెలవెల పోయాయి. దీంతో దుకాణదారులు నిరాశపడ్డారు. అయితే చేపల దుకాణాలు మాత్రం కళకళలాడాయి.



సీతారామపురం : పట్టణంలో ఆదివారం జనంతో కళకళలాడే చికెన్ దుకాణాలు బోసిపోయాయి. ఈ క్రమంలో చేపలు, మటన్ విక్రయాలు జోరందుకున్నాయి.ఉదయం నుంచే మాంసాహార ప్రియులు చేపల, మటన్ దుకాణాల వద్ద బారులు తీరారు.

చేపల దుకాణాలు కళకళ



పొదలకూరులో చేపల దుకాణం వద్ద వేచి ఉన్న ప్రజలు

పొదలకూరు, ఫిబ్రవరి 18 : మండలంలో బర్డ్ ఫ్లూ లక్షణాలు బయటపడడంతో పొదలకూరులో మూడు రోజులుగా చికెన్ క్రయవిక్రయాలను నిషేధించారు. అయితే ఆదివారం కావడంతో నాన్‌వెజ్ ప్రియులు చేపల కోసం ఎగబడ్డారు. దీంతో చేపలకు బాగా డిమాండ్ ఏర్పడింది. కిలో రూ.200 నుంచి రూ.300 వరకు అమ్మారు. కాగా స్థానిక చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

ఇళ్ల మధ్యనే కోళ్లతో భయాందోళన

పొదలకూరులోని అగచాట్లపురం సమీపంలో ఉన్న సత్యనారాయణపురం, శ్రీనివాసనగర్‌లో కొంతకాలం నుంచి ఇళ్ల మధ్యలో బాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టారు. బర్డ్ ఫ్లూతో భయపడుతున్న తరుణంలో ఈ బాయిలర్ కోళ్ల స్థావరంతో చుట్టుపక్కలవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చికెన్ దుకాణాలు మూత పడగా, ఇక్కడి కోళ్ల వ్యాపారి మాత్రం రహస్యం గా పెద్ద ఎత్తున చికెన్‌ను, కోళ్లను పలు ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కోళ్ల స్థావరాన్ని జనావాసాలకు దూరంగా తరలించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.



అభ్యర్థులకు అగ్నిపరీక్ష !

- పాత సిలబస్‌తోనే డీఎస్సీ నిర్వహణ
- దరఖాస్తులకు అధిక ఫీజుల వసూలు
- ఆన్‌లైన్‌లో సర్వర్ కష్టాలు
- నిరుద్యోగుల ఆందోళన



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 18 : డీఎస్సీ అభ్యర్థులకు ఫీజుల చెల్లింపు, సిలబస్ అగ్ని పరీక్షగా మారాయి. నిర్దేశించిన సిలబస్ పై అభ్యర్థులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి ప్రతి ఏటా పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేస్తూనే ఉంది. దీంతో కొత్త అభ్యర్థులు మారిన సిలబస్‌నే అనుసరిస్తుండగా, పాతవారు మాత్రం కొత్త, పాత సిలబస్‌లను అనుసరిస్తూ చదవాల్సి వస్తోంది. పాత పుస్తకాలు ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు టెట్, డీఎస్సీలకు దరఖాస్తులకు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆన్‌లైన్ సర్వర్‌లు సరిగా పనిచేయకపోవడం, కొంతమందికి ఫీజులు కట్ అవుతున్నా ఐడీలు రాకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నామంటూ పలువురు ఆందోళన చెందుతున్నారు.

● అభ్యర్థుల ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ గందరగోళంగా మారింది. ఓవైపు దరఖాస్తుల ఆందోళన, మరోవైపు సిలబస్ గందరగోళంతో అభ్యర్థులంతా ఆందోళన చెందుతున్నారు. 2018 ప్రకటనలో ఇచ్చిన సిలబస్‌నే అనుసరించాలని ఈ డీఎస్సీకి నిర్దేశించారు. 2019-20లో 3, 4, 5 తరగతుల సిలబస్‌ను మార్పు చేశారు.ఆ తర్వాత ఏడాదికో తరగతి చొప్పున సిలబస్‌ను మార్పులు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకాలు మార్పు చేసి ఈ సిలబస్‌ను కూడా జత చేయడంతో అభ్యర్థులకు మరింత భారంగా మారింది. పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడం, సమయం మాత్రం 30 రోజులే ఉండడంతో పాఠ్యాంశాలు చదవడం, పునశ్చరణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సీబీఎస్‌ఈ పేరుతో 6, 7 తరగతుల పుస్తకాలను రెండుసార్లు మార్పు చేశారని, ఇందులో ఏ సంవత్సరానిది చదవాలో స్పష్టత లేదంటున్నారు. 2022లో నిర్వహించిన టెట్‌కు కొత్త సిలబస్‌నే ఇవ్వడంతో కొంతమంది అభ్యర్థులు కొత్త సిలబస్‌పైనే దృష్టి సారించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు మాత్రం పుస్తకాలు మారి నాలుగేళ్లకు పైగా అయినందున ప్రస్తుతం పాతవి అందుబాటులో లేవంటున్నారు. గతంలో విద్యార్థులు తరగతులు మారిన తరువాత వారి నుంచి పాత పుస్తకాలను సేకరించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోగా ఆన్‌లైన్‌లో సైతం కొత్తసిలబస్‌తోనే పీడీఎఫ్‌లు అందుబాటులో ఉండడంతో ఏమి చేయాలో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు..

● అధిక ఫీజులతో కష్టాలు

డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలంటే టెట్‌లో అర్హత సాధించాలి. ఈ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా డీఎస్సీలో వెయిటేజీ మార్కులు ఉంటాయి. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలో రూ.25లు ఉండే దరఖాస్తు ప్రస్తుతం రూ.750లు చేయడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాక ఓటీపీ వస్తుండగా అది భర్తీ చేసినా కొంతమందికి ఐడీ రాకపోవడంతో నగదు కోత పడుతున్నాయంటూ ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థికి ఐడీ వస్తేనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా సర్వర్ సమస్యలతో నగదు కట్ అయిపోతుడడంతో జిల్లాలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బ్యాంక్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ వెబ్ సైట్ సరిగా పనిచేయక దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకపోవడం, జరిగే పరిణా మాలపై బయట మాట్లాడితే తమను ఇబ్బందులు పెడతారేమోనన్న భయం అభ్యర్థులను వెంటాడు తోంది. అసలే నిరుద్యో గులమైన తాము అప్పులు తెచ్చి మరీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లిస్తుండగా ఈ సొమ్ములు ప్రభుత్వ ఖాతాలోకి జమ అవుతున్నా తాము దరఖాస్తు చేసుకోలేక పోతున్నామని, మళ్లీ నగదు ఎక్కడి నుంచి తీసురావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి తమ సమస్యలను పరిష్క రించడంతో పాటు సిలబస్‌పై కూడా స్పష్టత ఇవ్వా లని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.



24న వ్యాసపూర్ణిమ నగరోత్సవం

- డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 18 : ఈనెల 24న వ్యాసపూర్ణిమ సందర్భంగా నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని ఆ సొసైటీ చైర్మన్ వీరి చలపతి రావు, బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నగరంలోని నవాబుపేటలో ఉన్న డీసీఎంఎస్ రైసు మిల్లులో లక్ష్మీనరసింహ స్వామివారికి పూజా కార్యక్రమం, అనంతరం నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. ఏటా ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆసరా సొమ్ములేవి ?

- సీఎం బటన్ నొక్కి నాలుగు వారాలు
- నిధుల విడుదలలో జాప్యం
- ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన
- వేలాదిమంది డ్వాక్రా సభ్యుల ఎదురుచూపు

సంగం, ఫిబ్రవరి 18: ఆసరా పథకానికి సీఎం బటన్ నొక్కి నాలుగు వారాలైనా, ఇంకా నాలుగోవంతు లబ్ధిదారుల ఖాతాల్లో కూడా నగదు జమకాలేదు. గత నెల 23న ముఖ్యమంత్రి బహిరంగసభలో ఆసరా నాలుగో విడత నిధులకు బటన్ నొక్కారు. కానీ అవసరమైనన్ని నిధులు విడుదల కాక ఈ పరిస్థితి నెలకొంది. అయితే మరో రెండు వారాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న నేపథ్యంలో ఈలోపు ఆసరా నిధులు జమ అవుతాయో...? లేదోనని లబ్ధిదారుల్లో సందేహం వ్యక్తమవుతోంది. దీంతో వారు అటు సచివాలయాలు, ఇటు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం రేపో, మాపో జమవుతాయని చెబుతున్నారు.

● జమైంది.. లేనిది చూడారా ?

సంక్షేమ పథకాల అమలు కోసం బటన్లు నొక్కుతున్నా.. అని సీఎం బహిరంగ సభలో చెబుతున్నా, ఆ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతునాన్నయా... లేదా ? అనే విషయాన్ని మాత్రం పట్టించుకోవడంలేదు. ఆ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. వాయిదాల పర్వం, దాటవేత ధోరణి, ఇతర కొర్రీలతో సంక్షేమ పథకాలను నీరుగార్చడంతో తలమునకలైన ప్రభుత్వం ఆసరా పథకాన్ని కూడా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోంది. అమ్మఒడి, చేయూత, పింఛను పథకాల మాదిరిగా ఆంక్షల పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టేందుకు వీలు లేకపోవడంతో వాయిదాల పద్ధతిలో పథకాన్ని నీరుగార్చేందుకు పూనుకుంది. ఫలితంగా ఎప్పుడో 2023 నాటికే ఇవ్వాల్సిన ఆసరా వాయిదా పడింది.

● 3.29 లక్షల మంది లబ్ధిదారులు

జిల్లాలో 34,443 సంఘాల్లోని 3,29,841 మందికి ఆసరా కింద రూ.270.54 కోట్ల రుణమాఫీ నిధులు రావాల్సి ఉంది. ఈ మేరకు ఆసరా నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అన్ని పథకాల పరిస్థితే ఈ పథకానికి పట్టిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

● 15 నెలల ఆలస్యం

2019 ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా జగన్ మాట్లాడుతూ నవంబరులోపు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటికే రుణాలు చెల్లించి ఉంటే, వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని కూడా ఆయన ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన 15 నెలల తరువాత 2020 సెప్టెంబరు 11న వైఎస్సార్ ఆసరా పేరుతో ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ప్రారంభించింది. రెండోవిడత నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న, మూడో విడత ఆరు నెలల ఆలస్యంగా అందచేసింది. 2022 అక్టోబరు నుంచి అదిగో ఇదిగో... అంటూ 2023 మార్చి చివరి వరకూ నెట్టుకిచ్చి మూడో విడత బటన్ నొక్కారు. తాజాగా నాల్గవ విడత ఆసరాకు గత నెల 23న బటన్ నొక్కారు.

● అన్ని పథకాలదీ ఇదే పరిస్థితి..?

సీఎం జగన్ బటన్ ఎప్పుడు నొక్కినా ఆ నగదు లబ్ధిదారుల ఖాతాల్లో చేరేందుకు కొంత సమయం పడుతోంది. ఒక్కోసారి రెండు నెలలు కూడా పట్టిన సందర్భాలు ఉన్నాయి. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేదోడు.. ఇలా పథకం ఏదైనా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడేందుకు సమయం పడుతోంది. ఒకవేళ ఏ కారణం చేతనైనా జమ కాకపోతే ఇక అంతే సంగతులని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి ప్రభుత్వం వద్ద ఆయా పథకాలకు అవసరమైన నిధులు లేకపోయినా సీఎం బటన్ నొక్కేస్తున్నారు. సీఎం బటన్ నొక్కాక ఒకరి ఖాతాలో జమ అయి, మరొకరి ఖాతాలో జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



సంగంలో నిర్వహించిన ఆసరా కార్యక్రమం (ఫైల్)

గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయాలి



ఉదయగిరి రూరల్: విలేకరులతో మాట్లాడుతున్న అజయకుమార్



సంగంలో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 18: ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జీ చెర్లోపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్క రించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దోచుకొని దాచుకోవడం జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు తెలియదన్నారు. రాబోయే ఎన్నికల్లో టిక్కెట్ ఎవరికి వచ్చినా జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి విజయానికి సహకరించాలన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే మంచి వ్యక్తికి ఓటేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరావు, కుర్రా కృష్ణయాదవ్, కొలికొండ శశిధర్, అల్లూరి రవీంద్ర, సురేందర్‌రెడ్డి, పిట్ల కిరణ్, సత్యనారాయణ, పీ.శ్రీనివాసులు, తిరుపతయ్య, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా జనసైనికులు కృషి చేయా అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంగంలో ఆ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ నుంచి బంగ్లా సెంటర్ వరకు జనసైనికులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత అడుగుజాడల్లో జనసైనికులు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, మండల నాయకులు ఆనంద్, భాను, టీడీపీ నాయకులు మంజులనాయుడు, విజయకృష్ణారెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



సిమెంట్ రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచి

సీతారామపురం, ఫిబ్రవరి 18: మండలంలోని సీతారామపురం బిట్-1 సచివాలయ పరిధిలోని తోట కాలనీలో ఆదివారం సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యకుమారి మాట్లాడుతూ పంచాయతీలో నిధులు లేకపోవడం వల్ల చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాలేదని, అయినప్పటికీ ప్రజలు అవస్థలు పడకూడదని సిమెంట్ రోడ్లు వేస్తున్నామని తెలిపారు.

ఎన్నికల విధులపై శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 18: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఆదివారం ఎన్నికల విధులపై శిక్షణ నిర్వహించారు. నియోజకవర్గం లోని ఎనిమిది మండలాలకు చెందిన సెక్టార్ అధికారులు, పోలీసులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తీసుకోవాల్సిన విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐ గిరిబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతసాగరం, ఫిబ్రవరి 18: మండలంలోని పడమటికంబంపాడు గ్రామానికి చెందిన కత్తి వెంకటరమణయ్య లివర్ వ్యాధితో బాధపడుతుండగా అతని ఆరోగ్యం మెరుగు కోసం ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ రూ. 20 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పెంచలయ్య, సురేష్, చిన్నయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

'టీఆర్ఆర్'లో రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటు

కందుకూరు, ఫిబ్రవరి 18: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో రీసెర్చ్ సెంటర్లను కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్, ఇంగ్లీష్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్లలో రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆయా విభాగాలలో పనిచేస్తున్న డాక్టరేట్ అధ్యాపకులను రీసెర్చ్ గైడ్‌లుగా గుర్తించారని తెలిపారు. ఇటీవలే ఇతర యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్ల బృందం కళాశాలను సందర్శించి ఆయా డిపార్ట్‌మెంట్లలోని మౌలిక వసతులను పరిశీలించి యూనివర్సిటీకి అందజేసిన నివేదిక మేరకు రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అన్ని కళాశాలల్లో అత్యధికంగా టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16మంది డాక్టరేట్ పొందిన అధ్యాపకులు పనిచేస్తున్నారని గత ఆరేళ్లకాలంలో కళాశాలకు చెందిన అధ్యాపకులు 100కి పైగా పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారని ప్రస్తుతం రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటుతో పరిశోధనలు మరింత ఊపందుకుంటాయని ఆయన పేర్కొన్నారు.

ఉదయగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి, ఫిబ్రవరి 18: పట్టణంలోని మంగళకట్ట, శ్రీనగర్‌కాలనీ, యూనియన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, మాజీ మండల వైసీపీ కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఉదయగిరి సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీటీసీ షేక్ పెదమస్తానీఎస్థాన్, ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్‌ల ఆధ్వర్యంలో దుర్గంపై ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, నాయకులు అక్కులరెడ్డి, యస్థానీ, ఉప్పుటూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

ఉదయగిరి రూరల్: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బుధవారం నిర్వహించే దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపికృష్ణ, మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు టెక్ ఫెయిర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 18: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మకూరు మున్సిపాల్టీ, మండలంలోని అన్ని పాఠశాలల 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం సాంకేతిక విద్యపై టెక్ ఫెయిర్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి నాగేశ్వరరావు తెలిపారు. సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఏర్పరుచుకోవచ్చని, 10వ తరగతి అనంతరం పాలిటెక్నిక్ సరైన మార్గమని అవగాహన కల్పించాలనే లక్ష్యంతో టెక్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్తెమ్మకు వైభవంగా పాల పొంగళ్లు



ఊరేగింపుగా పూజాసామగ్రితో ఆలయానికి వస్తున్న భక్తులు

కలువాయి, ఫిబ్రవరి 18: మండలంలోని అగ్రహారంలో గ్రామదేవత సత్తెమ్మకు ఆదివారం పాల పొంగళ్లు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పూజా సామాగ్రి తీసుకుని మహిళలు మేళతాళాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు, రేపు వేలం పాటలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 18: మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో సోమ, మంగళవారాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలపై బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో పాల్గొనేవారు ఆయా అంశాలకు సంబంధించి నిర్ణయించిన నగదును ధరావత్తు కింద చెల్లించాలన్నారు. పాట దక్కించుకున్న వారు 1.4.2024 నుంచి 31.3.2025 వరకు హక్కు కలిగి ఉంటారన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : బీజేపీ



మాట్లాడుతున్న భరత్‌కుమార్ యాదవ్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండపల్లి భరత్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతోందన్నారు. పార్లమెంట్ స్థానానికి కూడా అభ్యర్థి దొరకడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు జమ చేస్తున్న నిధులను సైతం స్వాహా చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీయేనన్నారు. ప్రజల సొమ్మును స్వాహా చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు డబ్బు సంచులతో మళ్లీ ప్రజల వద్దకు ఓట్ల కోసం వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి ఊసే లేదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చలువేనన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామినాయుడు, నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, షాజహాన్, వెంకటేశ్వర్లు, చల్లా సుబ్బరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న రామాంజనేయులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 18: దుత్తలూరు-నర్రవాడ గ్రామాల మధ్యలో 565 జాతీయ రహదారి పక్కన యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థల దాత, ఉదయగిరి జడ్పీటీసీ మోడి రామాంజనేయుల యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లా డుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, రఘువీరారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ చెంచలబాబుయాదవ్, నేతలు బోడె రామచంద్రయాదవ్, అవుల వెంకట్రామయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారన్నారు. శంకుస్థాపన అనంతరం శ్రీకృష్ణ ఆరాధన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని యాదవ సోదరులంతా అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిని తొలగించాలి : సీపీఎం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య

సీతారామపురం, ఫిబ్రవరి 18 : విద్యార్థుల పట్ల నీచంగా వ్యవహరించిన స్థానిక ఏపీ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించే వరకు మా పోరాటం ఆగదని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి నుంచైనా మోడల్ స్కూల్‌కి చెడ్డ పేరు రాకుండా ప్రిన్సిపాల్ చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండె రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న ఆరుతడి పంటలు !

● 'రాళ్లపాడు' జలాలు ఇవ్వాలని రైతుల వేడుకోలు



అన్నెబోయినపల్లి సమీపంలో సాగు చేసిన పత్తి

లింగసముద్రం, ఫిబ్రవరి 18 : రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో సాగు చేసిన ఆరుతడి పంటలు నీటి ఎద్దడితో ఎండుముఖం పడుతున్నాయి. ఈ క్రమంలో రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి గత ఏడాది నవంబరు చివర్లో అరకొరగా వర్షాలు కురిశాయి. దీంతో ప్రాజెక్టులోకి కేవలం 14 అడుగుల నీరు మాత్రమే చేరింది. దీంతో రైతులు ఆయకట్టు పరిధిలో వరి పైరు సాగు చేయకుండా పత్తి, శనగ, తదితర పంటలు సాగు చేశారు. అప్పటి నుంచి వర్షాలు కురవలేదు. దీంతో మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. సాగు చేసిన ఆరుతడి పంటలు వాడు ముఖం పడుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 12.1 అడుగుల నీరు ఉంది. ఆరుతడి పంటలు ఎండిపోకుండా రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని కాలువలకు విడుదల చేయాలని సంబంధిత జిల్లా అధికారులతో పాటు ప్రాజెక్టు అధికారులను రైతులు కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మొరుపెట్టుకుంటున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఉలవపాడు, ఫిబ్రవరి 18 : మండలంలోని రాజుపాలెం సమీప మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.16,400 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు.

ఉపాధి కల్పన, అభివృద్ధికి చిరునామా చంద్రబాబు

● టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 18: రాష్ట్రాభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పనకు చిరునామా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని టీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో శనివారం రాత్రి ఆయన మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు వలలు, బోట్లు, ఇతర పథకాలు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వంలో ఎలాంటి పథకాలు వర్తింపచేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతిందని, సముద్రంలో మత్స్యసంపద తగ్గుతుండడంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయన్నారు. తీరప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించే కావలి-తుమ్మలపెంట రోడ్డు అధ్వానంగా ఉన్నా దానిని వేయలేని దుస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న తుమ్మలపెంటపై కక్ష్య సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ కర్యాక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి : నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, పోతుగంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక : కావలి రూరల్ మండలం రాజువారి చింతలపాలెం, చెంచుగాని పాలెంకు చెందిన పలువురు వైసీపీ నేతలు పేముల మాల్యాద్రి, నాసిన జ్వాలరావు, పోసిన శ్రీనివాసులు, జ్యోతి బాబూరావు, జ్యోతి వేణుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీలో చేరిన ఎస్సీ కాలనీ యువకులతో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 18: మండలంలోని పలుకూరు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీని వీడి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు నార్నె రోశయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొద్దులూరి కొండలరావుల ఆధ్వర్యంలో వీరంతా స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, కష్టనష్టాలలో మీకు తోడుగా ఉంటానని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నన్ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి !

కలిగిరి, ఫిబ్రవరి 18 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు మేడం పెంచల నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఆదివారం మమతా రక్త సహాయ శిబిరం ద్వారా 40 మంది రక్తదాతలు నోవా బ్లడ్ బ్యాంక్ వారికి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో రక్తదానంపై అపోహలు తొలగి యువత కూడా రక్తదానినికి ముందుకు రావడం సంతోషకరమైన పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సభ్యులు పీవీ.కృష్ణమూర్తి, వీసీ.మంజాన్‌రావు, జీ.వెంకటేశ్వర్లు, ఎం.పోలయ్య, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల రక్తదానం

బిట్రగుంట : బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సెలింగ్ ఫౌండేషన్ డే సందర్భంగా ఆదివారం రైల్వే కార్మికుల రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఏఐజీసీ బిట్రగుంటబ్రాంచ్ కార్యదర్శి విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఒంగోలు, గూడూరు రైల్వే వైద్యులు ఎల్వీ రమణారావు, ఎస్ఎస్ కుమార్, బిట్రగుంట స్టేషన్ మాష్టరు మురళీధర్‌రెడ్డి, బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు మిట్టా మురళీకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ

బిట్రగుంట, ఫిబ్రవరి 18: ప్రభుత్వం ప్రజలకు ప్రతి నెల అందచేస్తున్న రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో వెంకటరమణ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులోని 8వ రేషన్ షాపు నిర్వాహకులు ఆరు నెలలుగా రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదన్న ఆరోపణలపై జిల్లా అధికారులు స్పందించారు. ఈ క్రమంలో ఆదివారం కొత్తూరుతో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. రేషన్ షాప్ డీలర్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో విశ్వనాథరావుపేట, తాళ్లూరు గ్రామాల్లోని డీలర్ల వద్ద నుంచి బియ్యం, చక్కెర తీసుకువచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏఎస్‌వో అంకయ్య, డీటీ మల్లికార్జున, పీఎంయు వెంకట్, వీఆర్వో మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

అధిష్ఠానం నిర్ణయం మేరకు పనిచేయాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 18: తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు సూచించారు. బోగోలు టీడీపీ కార్యాలయంలో ఆదివారం మండల కార్యకర్తల సమావేశం జరిగింది. సోమవారం కావలిలో జరిగే నియోజకవర్గస్థాయి సమావేశాన్ని, బుధవారం బోగోలులో జరుగు విస్తృత స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదూరువెంకటేశ్వర్లు రెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, గద్దే కొండయ్య, కడియాల గోవిందు, చల్లా క్రాంతి, మనోహర్, పుట్టా సుబ్బారావు, అహ్మద్‌బాషా, సుబ్బారెడ్డి, వాయిల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

'జూపూడి అవకాశవాది'

బిట్రగుంట, ఫిబ్రవరి 18: విదేశీ విద్యకు జగన్‌పేరు పెట్టడం తప్పులేదని జూపుడి అనడం అవకాశవాదమే అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. జూపుడి మాటలను ఖండిస్తూ దళితులతో కలసి ఆదివారం బోగోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగ నిర్మాతకు బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు పీడిత ప్రజల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ పేరు అవసరం లేదని, వైఎస్‌జగన్ పేరు పెడితే ప్రపంచమంతా తెలుస్తుందని గుంట నక్క జూపుడి ఆలోచనన్నారు. నాలుగు డబ్బులు సంపాదించేందుకు ఏ ఎండకు ఆ గొడుగు ఎత్తడం జూపుడి ప్రభాకర్ నైజమన్నారు. జగన్ దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలు తీసివేస్తే అది అన్యాయమని అడగ లేని పెద్దమనిషి జూపుడి అని దుయ్యబట్టారు. ఈ విషయమై దళిత సంఘాల నేతలు అందరు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల తిరువళ్లూరు, సాదుప్రసాద్, ఆత్మకూరి తేజ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళితనేతలు

జనసేన, టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతే..

● జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆరంఖాన్



జనసేన కార్యాలయం ప్రారంభోత్సవంలో నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 18: జనసేన, టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతవ్వడం ఖాయమని జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆరంఖాన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. ముందుగా జెండాచెట్టు వద్ద నుంచి జనసేన రాష్ట్ర నేతలతో కలసి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరంఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్‌తో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా చిన్న కార్యకర్త పోటీ చేసిన గెలుస్తారన్నారు. జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి, అళహరి సుధాకర్‌లు మాట్లాడుతూ కావలిలో రోడ్లు చూస్తే వైసీపీ చేసిన అభివృద్ధి అద్దం పడుతుందన్నారు. కార్యక్మమంలో ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ శశిధర్, రాష్ట్ర అధికారప్రతినిధి రావిపాటి అశోక్, తాతంశెట్టి నాగేంద్ర, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు ప్రభుత్వం చేసింది శూన్యం

● యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



యానాదులతో మాట్లాడుతున్న పెంచలయ్య

అల్లూరు, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం యానాదులకు చేసింది శూన్యమేనని యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ.పెంచలయ్య అన్నారు. అల్లూరు మండలం బట్రకాగొల్లులో యానాదులతో ఆయన ఆదివారం సాయంత్రం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన సభ్యులతో కలసి యానాదుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడుతూ తాగునీటికి నేటికీ బావులపై ఆధారపడి ఉన్నారన్నారు. జగనన్న ఇళ్లు కట్టకుండానే బిల్లులు డ్రా చేశారని ఆయన విమర్శించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 4 లక్షల మంది యానాదుల సమస్యలను తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఛైర్మన్ రాపూరి కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మావులూరి మురళి, మహిళా నాయకులు చెంబేటి ఉష, ఇండ్ల రమ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శైవక్షేత్రాల నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణ భూమిపూజలో పండితులు

బిట్రగుంట, ఫిబ్రవరి 18: బోగోలు పంచాయతీ మణికంఠ నగర్‌లో శైవక్షేత్రాల నిర్మాణానికి ఆదివారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమాలను శైవాగమ పండితులు వెంకట సుబ్బయ శర్మ బృందం ఆధ్వర్యంలో జరిగాయి. విఘ్నేశ్వర సుబ్రహ్మణ్య అయ్యప్ప స్థలం ఆవరణలో విశ్వేశ్వర అన్నపూర్ణ సమేత శివాలయం, అయ్యప్ప ఆలయాలకు శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. విఘ్నేశ్వరపూజ, మండపారాధన, వాస్తు పూజ, శివపార్వతుల శాంతి హోమ కార్యక్రమాలు పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బచ్చు అమరా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఆనందసాగర్, సాయి సేవకులు ఐశ్వర్య, నీరజ, అశోక్, పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు వేంకటేశ్వర్లు, స్థానిక పెద్దలు తుమ్మల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉలవపాడు, ఫిబ్రవరి 18 : పట్టుదలతో చదివితే 10వ తరగతి పరీక్షలలో ఆశించిన మార్కులు పొందవచ్చని మండల విద్యాశాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. ఆదివారం ఉలవపాడులోని శ్రీసాయి హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏంఈవో పబ్లిక్ పరీక్షలలో పాటించవలసిన నియమాలు గురించి వివరించారు. అదేవిధంగా రాష్ట్ర వైఎస్ఆర్‌టీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, కరస్పాండెంట్ కేశవరపు శేషమ్మలు మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు రాబట్టాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం ఆట పాటలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూరుబాషాలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న నూర్‌బాషా సంఘం నేత చెన్నయ్య

కావలి, ఫిబ్రవరి 18: నూరుబాషా(దూదేకుల)లకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని నూర్‌బాషా సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని రామిరెడ్డితోట కల్యాణ మండపంలో ఆదివారం నూరుబాషా సంఘం ఆత్మీయ సమావేశం, వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 23 లక్షల మంది నూరుబాషాలు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా చట్టసభలకు పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. రాబోయే ఎన్నికలలో 2 పార్లమెంట్, 5 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు షేక్ సలీం, షేక్ చెన్నయ్య, మహబూబ్ బాషా, మీరా సాహెబ్, హుస్సేన్ సాహెబ్, మస్తాన్ వలీ, షరీఫ్, షాహినా, దిల్షాద్, ఖలీల్, చాంద్‌బాషా, షాన్‌వాజ్, రఫీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువుకు నేతల ఆశీర్వాదం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 18 : మండలంలోని శాఖవరంకు చెందిన వడ్లమూడి శ్రీహరిరావు - ధనమ్మల కుమార్తె చైతన్య వివాహ వేడుకలకు ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లు వేర్వేరుగా హాజరై నూతన వధువును ఆశీర్వదించారు. ఆ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కూనిపాలెం సర్పంచు నవ్వులూరి రాజారమేష్, నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, నవ్వులూరి వెంకటేశ్వర్లు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వడ్లమూడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.